నవశక్తి

Vol. 2, no. 22

(May. 17, 1939)

బెజవాడ, 1939

Navaśakti

Vol. 2, no. 22

(May. 17, 1939)

Bejavāḍa, 1939


Record no. 682

Regd. No. M. 3824

నవశక్తి

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారపత్రిక

సంపుటం 2 బుధవారం 17-5-39 బెజవాడ సంచిక 22



కాశీపట్టణంలో సత్యాగ్రహం సాగించిన రైతులు

భీమవరం పంచాయితీ బోర్డు కాంగ్రెసు పార్టీపై అసత్య ప్రచారం.

ది 3-5-39 తేది జనవాణి పత్రికలో భీమవరము పంచాయితీ బోర్డు కాంగ్రెసు మెంబర్ల విపరీతవైఖరి అంటూ వొక విలేఖరి వ్రాసిన స్టేటుమెంటును చూచి నాను.

ఎవ్వరో కొందరు స్వార్థపరులు, తాము చేసిన అక్రమములు, అన్యాయములు, కప్పిపుచ్చి ప్రజాసామాన్యములో అపోహలు కలుగచేయుటకు పత్రికలలో ఏవో అసందర్భపు వ్రాతలు, అవినీతికరమైన చేష్టలు చేయుట చాలకాలమునుంచి యదేచ్ఛగా, జర్గుచున్నది. జనవాణి పత్రికలో ప్రకటించిన ప్రకటనకూడ సత్య మార్గమునిన్ని ప్రజలలో దురూహాలకు సావకాశము లేకుండా చేయుటకుగాను యదార్థపరిస్థితులను తెలియ జేయుటకుగాను యీ క్రింది స్టేటుమెంటును యిచ్చు చున్నాను.

భీమవరము తాలూకా కాంగ్రెసు సంఘమువారు భీమవరంలో సమావేశమై మేజరు పంచాయితీలలో కాంగ్రెసు అభ్యర్థులను నిల్పి పోటీచేయించవలసినదిగా తీర్మానించి యున్నారు. అప్రకారము భీమవరం పంచాయితీకి, కాంగ్రెసు అభ్యర్థులను పోటీపెట్టినాము. ముగ్గురు కాంగ్రెసు అభ్యర్థులు విజయము పొందిరి. మొదటివార్డుకు నిల్పిన కాంగ్రెసు అభ్యర్థి శ్రీ అల్లూరి రామకృష్ణం రాజుగారు. (రిటైరు డిప్యూటి కలెక్టరు, స్పెషల్ I క్లాసు మేజస్ట్రీటు). వీరువస్తే బోర్డులో యిదివరకు చేసిన అవకతవకలు ఎక్కడ బయటపడునోయని కొందరు వారిని రానియ్యకుండా చేయుటకు విశ్వప్రయత్నముచేసి పోటీగా ఒక హరిజనుని నిల్పినారు. కాని లాభం కలుగలేదు. రాజుగారేనెగ్గారు.

ఎన్నికలో 3 గురు కాంగ్రెసు అభ్యర్థులు నెగ్గిరి. తాత్కాలిక బోర్డుప్రెసిడెంటుగా జిల్లాబోర్డువారు శ్రీ అల్లూరి రామకృష్ణం రాజుగార్ని నియమించినారు. వారు చార్జిపుచ్చుకొని రికార్డు యావత్తు పరిశీలించి యిదివరకు వున్న ఆడిట్ రిపోర్టులను, బోర్డుకు రావలసిన బాకీలను గూర్చి ప్రయత్నం చేసినారు. దర్మిలాను ప్రెసిడెంటు ఎన్నికలు జర్గినవి. వైసుప్రెసిడెంటుగారగు మెంతే వెంకట్రామయ్యగారు కాంగ్రెసు ప్లెడ్జిపై సంతకముచేసి కాంగ్రెసుపార్టీలో చేరినారు. పంచాయితీ బోర్డుకు రావలసిన బాకీలను గూర్చి పాటదారులకు నోటీసులు యిప్పించి వసూలు చేయుటకు కాంగ్రెసు అభ్యర్థులే స్వయముగా ప్రయత్నించారు. పాటదార్లు యిదివరకు సొమ్ము యిచ్చి యుండుటచేత వారు సొమ్ము యివ్వనక్కరలేదని తెల్పి వారివద్దనున్న పాత రశీదులు తీసుకువచ్చి శ్రీ రామకృష్ణం రాజుగార్కి యిచ్చినారు. వారు ఆరశీదులను తీసుకొని పార్టీకి రశీదు యిచ్చినారు. అలా పుచ్చుకున్న రశీదులు కలవు.

యిప్పుడు ప్రెసిడెంటుగా నున్న శ్రీ నందమూరి బ్రహ్మానందంగారు, లోగడ రెండుమాసములు డెలిగేటు ప్రెసిడెంటుగాచేసి, పాటదార్లవద్ద పన్ను వసూలుచేసి. తప్పు రశీదులు యిచ్చి రు. 476 లు దుర్వినియోగ పరచినారు. అసలు ప్రెసిడెంటుగారి కాలంలోకూడా ఇటువంటివి కొన్ని జరిగాయి.

పై విషయములు యావత్తును బయటకు తీసుకువచ్చి గ్రామంలోని పెద్దలతో రామకృష్ణం రాజుగారు చెప్పినారు. అందుపై పాతప్రెసిడెంటుగారి అన్నగారు ఆనాపతుసొమ్ములో 11 వందల రూపాయలు బోర్డుకు జమకట్టినారు. యింకను, ఆడిట్ అబ్జక్షన్ల మొత్తం,

గమనించండి

రశీదుల బాకీమొత్తం యివ్వవలసి యున్నది. పైవిధముగా బోర్డుసొమ్మును దుర్వినియోగపరచి యిదివరకు వారు చేసిన అక్రమములు, అన్యాయములు, బయట పెట్టినారనే వుక్కురోషముతో, శ్రీరామకృష్ణం రాజు గారిపై నిందలు మోపుట చాల హేయమైన పని.

పైవిషయములను గురించి కాంగ్రెసు పార్టీవారుపై అధికారులకు తెలియపర్చినారు. దానినిగురించి విచారణ అవుతూ వున్నది. యదార్థసంగతులు తెలియపర్చినాను.

కృ॥ వెంకటేశ్వరరావు
కార్యదర్శి

5—5—39. భీమవరం, తాలూకా కాంగ్రెసు సంఘం.

* * *

పిఠాపుర విద్యార్థుల ప్రథమ వార్షికోత్సవము

పి ఠా పు ర ము.

పిఠాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులసంఘ ప్రథమ వార్షికసభ శ్రీ మల్యాల మాధవరావు బి. ఏ., గారి అధ్యక్షతన ఏప్రిల్ 22 వ తేదీని మహారాజశ్రీ ఉమర్ ఆలీషా బహద్దర్ గారి తోటలో జరుపబడినది. వందమంది విద్యార్థులు హాజరయిరి.

విద్యార్థుల సంఘ కార్యదర్శియగు మొహిద్దీన్ భాషా గారు గతసంవత్సరము సంఘము చేసిన పనులు నివేదిక పూర్వకముగ చదివిరి. తదనంతరం బాలాజీదాను గారు విద్యార్థులు రాజకీయములలో పాల్గొనవలయునని చెప్పుచు, భారతదేశమునకు విద్యార్థులద్వారానే స్వాతంత్ర్యము రాగలదని వక్కాణించిరి. ఆ సభలో వచ్చే సంవత్సరపు కార్య నిర్వాహక సభ ఎన్నుకోబడినది. మొహబూబ్ ఆలీషాగారు ప్రధాన కార్యదర్శిగను, కె. సి. హెచ్. వీరభద్రరావుగారు కోశాధికారిగ ఎన్నుకొనబడిరి.

ఈ క్రింది తీర్మానములు ఆసభయందు ఆమోదింపబడినవి.

1. స్కూలు జీతము అన్ని స్కూళ్ళకన్న అధికముగ నున్నది. గావున ఆ స్కూళ్లో జీతమువలె నుంచి సాధ్యమైనంతవరకు తగ్గించవలయును.

2 లైబ్రెరీకి, విజ్ఞానాభివృద్ధి చేసెడి పుస్తకములు తెప్పించవలయును.

3. స్కూలువారు తెప్పించు వార్తా పత్రికలు పరిషత్ పత్రికలు విద్యార్థులందరు చదువ నర్హత నిమ్మని ఈ సభ అధికారులను కోరిరి.

4. స్కూలునందలి పాతపైపు మిషనులు తీసివేసి క్రొత్త మిషనులుంచి ఎక్కువమంది విద్యార్థులా ప్రధాన సబ్జక్టును తీసుకొనుటకు ఏర్పాటు చేయవలెనని ఈ సభ అధికారులను కోరుచున్నది.

5. నేరము చిన్నదైనప్పుడు ఎక్కువ శిక్ష విధించ కూడదని ఈ సభ అధికారులను కోరుచున్నది.

6. ఈ స్కూలునందు హాస్టల్ లేనందున పొరుగూరి విద్యార్థులు ఇచటనే చదువు సాగించుకొనుటకు వారికి సౌకర్యములు కలుగచేయుటకు స్కూలు వారి అధికారముక్రింద హాస్టల్ పెట్టించవలయునని ఈ సభ గోరుచున్నది.

7. ఈ యూనియను మీటింగులు స్కూలు భవనమందు జరిపించుకొను నధికారము విద్యార్థులకు నివ్వవలసినదని అధికారులనీ సభ గోరుచున్నది.

8. మెంగుటూరు విద్యార్థి జిల్లా సభలో నామోదించిన తీర్మానము:—"స్కూలు విద్యార్థులే కో. ఆపరేటివు సొసైటీనిబెట్టి వీద విద్యార్థులకు జీతములు కట్టుటకును వార్కి పుస్తకములు కొనుటకు డబ్బు సర్దుబాటు చేయుట" ఈ సభవారు నంగీకరించిరి.

9. పంచమ విద్యార్థుల ఆశ్రమములు తీసివేసి వచ్చే సంవత్సరము జీతము పంచములు కట్టుమని శాసించిన అధికారుల చర్య నీ సభ ఖండించుచున్నది.

* * *

కృష్ణాజిల్లా యువజన సంఘం

జిల్లా యువకులకు హెచ్చరిక

జిల్లాలోని స్థానిక యువజన సంఘములు, యువకులు ఇంతవరకు యువజన సంఘ సభ్యులను తగు శ్రద్ధతో చేర్పించి ఆఫీసుకు పంపించలేదు. జిల్లాయువజన ప్రతినిధి మహాసభ ఈ నెల 3 వ వారంలో జరుపబడును. కాన స్థానిక యువజన సంఘములు, యువకులు శ్రద్ధతో సభ్యులను విరివిగా చేర్పించి ఆఫీసునకు వెంటనే రశీదు పుస్తకములు, చందా రుసుముతోసహా పంపించగోరుతాను. యువజన మహాసభకు పదిమంది ప్రాథమిక సభ్యులకు ఒక ప్రతినిధిచొప్పున ఎన్నుకొని పంపించవలయును. యువజనసంఘ సభ్యత్వ రుసుము అణాకు తగ్గించబడినది. మహాసభ స్థల, తేదీలు తరువాత ప్రకటించబడును.

ఇట్లు
రామినేని సిద్దయ్య
సహాయ కార్యదర్శి కృ॥ జి॥ యు॥ సం॥

* * *

రాయలసీమ యాత్రాదళము

శ్రీ రాయలసీమ యాత్రాదళమువారు యీగ్రామమునకు విచ్చేసిన సందర్భమున నిన్నటి రాత్రి దాదాపు 8—30 గంటలకు శ్రీయుత గూడ వేంకటచలపతిరావుగారి అధ్యక్షతక్రింద గొప్ప బహిరంగసభ జరుపబడినది. సభకు పురప్రముఖులందరు విచ్చేశారు. యాత్రాదళాధ్యక్షులవారిచేతను, సభాధ్యక్షులవారిచేతను ప్రస్తుత రాజకీయాల్ని గురించి కాంగ్రెసువారి మంత్రాంగాన్ని గురించి వయోజన విద్యా ప్రచారాన్ని గురించి ఉపన్యసించబడ్డ తర్వాత సభయందు యీ దిగువ తీర్మానాలు యేకగ్రీవంగా ఆమోదింపబడ్డాయి.

1. ఇంతటినుండి తాలూకా, జిల్లాకాంగ్రెసు సంఘముల యొక్కయు వాని కార్యనిర్వాహక వర్గముల యొక్కయూ జిల్లాబోర్డు యొక్కయూ సమావేశములు సాధ్యమైనంతవరకూ గ్రామాలలోనే జరుపపడునట్లు రాష్ట్రీయ కాంగ్రెసువారు ప్రయత్నించుచుండాలి.

2. జిల్లాబోర్డుల పరిపాలనలను ఒక్కొక్కటే పునాదులలోనికి పరిశీలించి చక్కబరచుటకు రాష్ట్రీయ కాంగ్రెసువారు వెనువెంటనే అర్హమైన ఒక ఉపసంఘాన్ని నియమించవలయును.

3. స్థానిక సంస్థలయొక్కయు, తాలూకా, జిల్లా, రాష్ట్రీయ కాంగ్రెసు సంఘాలయొక్కయు పదవులకు నగరవాసులు పోటీచేయక వాటిని కొంతకాలము గ్రామవాసులకు వదలిపెట్టవలయును.

4. స్థానిక సంస్థలవారు నిర్బంధ విద్యా విధానాన్ని వయోజన విద్యా ప్రచారాన్ని గ్రామాదులలో వెనువెంటనే ప్రవేశపెట్టించవలయును.

5. శ్రీ మద్రాసు ప్రభుత్వమువారు, హిందీ పండితులకు ముడిబెట్టబడిన యింగ్లీషు భాషా సంబంధాన్ని యెట్టి షరతులేకుండా రద్దు చెయ్యాలి.

(ఒక ప్రేక్షకుడు)

సంపుటం 2 నవశక్తి బుధవారం

సంచిక 22 17-5-9

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు). కంభంపాటి సత్యనారాయణ. పుచ్చలపల్లి సుందరయ్య. తమ్మల వెంకట రామయ్య.

స్వాతంత్ర్య యుద్ధానికి తగమా?

"వాతావరణము హింసా పూరితముగా ఉంది. నేను హింసతోకూడిన గాలిని పీల్చుతున్నాను, నిట్టూర్చుతున్నాను....నేడు ఉన్న పరిస్థితులలో కాంగ్రెసు సత్యాగ్రహము లాంటిది నడుపలేము." ఇది మహాత్ముడు వెల్లడించిన అభిప్రాయాలు. ఇవి గాంధీ-బోసు లేఖలలో బయల్పడిన విశేషాలు. "నేడు కాంగ్రెసులో ఉన్న అల్పసంఖ్యాకులు, అధిక సంఖ్యాకులూ అనేది వట్టి కల్ల. కాంగ్రెసులో కుళ్లు ఏర్పడింది. అవినీతి ఏర్పడింది. దొంగ మెంబర్లను చేర్పించారు" అనే సారాంశము గల భావాలనుకూడ మహాత్ముడు వెలిబుచ్చాడు. మహాత్ముడు ఇలాంటి భావాలను వెలిబుచ్చడము, క్రొత్తగాదు. శాసనసభా కార్యక్రమానికి అనుమతి ఇచ్చిననాటినుండి, ముఖ్యముగా స్వీకరించిన నాటినుండి. ప్రజా సామాన్యములో కల్గిన అమోఘ చైతన్యాన్ని గుర్తించి, అతివాదులు ప్రజల పోరాటాలను నడుపుతున్నపుడు ఇదే అభిప్రాయము వెలిబుచ్చసాగాడు. కమ్యూనిస్టులు బొంబాయిలో అత్యధిక సంఖ్యాకులచే రాష్ట్ర కాంగ్రెసు సభ్యులుగ ఎన్నుకొన్నప్పుడుకూడ మహాత్ముడు కాంగ్రెసులో "కుళ్లు" ఏర్పడిందని వగచాడు.

మహాత్ముడూ-అతని అనుచరులూ - ఈనాడు కాంగ్రెసును ఈ విధముగా చూస్తున్నారు. "కాంగ్రెసులో కుళ్లు ఏర్పడింది-ఏర్పడటానికి కారణము దొంగ మెంబర్లు-దొంగమెంబర్లు చేరడమువలననే అతివాదుల పలుకుబడి హెచ్చింది— అతివాదుల పలుకుబడివలననే పోరాటాలు, పోరాటాలలో హింసా, ప్రబలింది." ఇది నిజమా? కానేకాదు.

కాంగ్రెసులో చేరిన సభ్యులందరూ విశ్వసనీయులే అని మేము అనం. కాని నూతన రాజ్యాంగ శాసనంలో ఎన్ని ప్రతిరోధకాలున్నా, కాంగ్రెసు మంత్రి పదవులు స్వీకరించారనగానే, ప్రజలలో ఆత్మవిశ్వాసము ప్రబలింది. మన మంత్రులు ఏదైనా చేయకపోతారా అని ఆశ కల్గింది. అందుచేతనే విరివిగా సభ్యులు చేరారు. ఇదిగాక కాంగ్రెసు ప్రత్యక్ష పోరాటములో గాక, పదవులలో ఉండటంవలన, తమ స్వార్థ క్షేమాలకోసం చేరిన సభ్యులు, చేర్పించిన సభ్యులు కొందరు లేకపోలేదు. కాని ఇలాంటి సభ్యులు చేరడానికి గాని, చేర్పించడానికి గాని ఎవరికి అవకాశం ఉంటుంది? మంత్రిపదవులతో పలుకుబడి గల్గిన ప్రముఖులకో, డబ్బు వెచ్చించగల మితవాద ప్రముఖులకో వీలుంటుంది కాని అతివాదులకు కాదు. నేడు అతివాదులకు పలుకుబడి ఉందంటే, అది వారు దొంగమెంబర్లను చేర్పించడమువలన కానే కాదు. ప్రజలలో కలిసి మెలిసి తిరిగి, ప్రజల కష్టాల తెలుసుకొని, ప్రజల కోర్కెలకొరకై పోరాడుచుండుటవలననే. సుభాసుబాబుకు అత్యధికసంఖ్యాకులు ఓటిచ్చారంటే, అది "బూటకపు మెంబర్లను చేర్పించడము"వలన కాదు. కొన్ని హితకార్యాలు చేసినా, మితవాదులు ప్రజల కోర్కెలకై సాగుతున్న పోరాటాలను అణచి, రానురాను సామ్రాజ్యవాదానికి లొంగి తగిన ప్రతిఘటన చూపలేకపోవడమే. ఈ అపాయకర స్థితినుండి బయటపడి, స్వాతంత్ర్యపోరాటాన్ని సాగించవలసింది అనే బోసుబాబుకు ఓట్లిచ్చారు.

ఈ సంగతి గమనించక, తమ బలహీనత గుర్తించలేక, మితవాదులు, అతివాదులపై నిందమోపడము, తరమాలని ప్రయత్నించడము హానికరము.

నేడు కాంగ్రెసులో ప్రబలిన కుళ్లు పోవాలంటే సుభాసు చెప్పినట్లు స్వాతంత్ర పోరాటమే కర్తవ్యము. స్వాతంత్ర పోరాటములో 'చెల్లని దమ్మిడీ' లేవో, చెల్లేవి ఏవో తేలిపోతాయి. ఏ విధముగానైనా, పదవులను పట్టుకొని ఊగులాడనే ఉద్దేశ్యముతో తోడి కాంగ్రెసువారితో కీచులాడటము, పరస్పర అవిశ్వాసము, వైరము మొదలైనవన్నీ నశించుతాయి. సామ్రాజ్యవాదముతో ఢీకొంటున్న వీరులు, ఒక్క జాతిగా-ఒక్క సైన్యముగా-ఒక్క కుటుంబమువారుగా భావిస్తారు.

కాని, నేడు కాంగ్రెసు హింసా పూరితముగా ఉన్నదని మహాత్ముని వాదన. నేడు వ్యక్తిగత హింసా వాదాన్ని ఎవరూ ఒప్పుకొనుటలేదు. పూర్వమువలె, నేడు టెర్రరిస్టులులేరు. వారు ప్రజా సంఘాలలోనే, ప్రజా పోరాటాలలోనే నేడు విశ్వసిస్తున్నారు. హింసా వాదులనే చెప్పబడే కమ్యూనిస్టులు సైతము ఏమంటారు? "రాజకీయాధికారము చేజిక్కినప్పుడు, ప్రతిశక్తులు దాన్ని నాశనము చేయడానికి హింస సవలంబిస్తే, అహింసను హింసతోనే అణచాలి" అంటున్నారు. ఈనాడు రాజకీయాధికారము చిక్కకముందే శత్రువులు మతకక్షలను రేకొల్పి, హింస చేబట్టినప్పుడు "లా అండ్ ఆర్డర్"ను కాపాడటానికి కాంగ్రెసు మంత్రులకు హింసపూనక తప్పినదికాదుకదా? కమ్యూనిస్టులు చెప్పినదానిలో క్రొత్త ఏమున్నది? పోనీ అది ఎప్పటిదోమాట? ఆ విషయములు, ఆ పరిస్థితులు వచ్చినప్పుడే ఆలోచింపవచ్చును. కాని నేడు మహాత్ముడు ఇంత హృదయావేదనపడుచున్నదెందుకు? ఆయన అనుచరులు చెప్పినట్లు రాంపూర్, రాందుర్గ, గంగాపూర్ సంస్థానాలలో జరిగిన దౌర్జన్యాలా? ఈ సంస్థానాలలో జరిగిన దౌర్జన్య కృత్యాలు ఏమి తెల్పుచున్నాయి?

సంస్థాన ప్రజల ఓర్మికి ఒక హద్దు ఉన్నదనీ, సంస్థానాలలో జరిగే ఆందోళనకు కాంగ్రెసు స్వయముగా నాయకత్వము వహించక తాటస్థ్యము వహించడము వలన కల్గిన ఫలితాలే ఈ దౌర్జన్యాలని మహాత్ముడు గ్రహించాలి. నాయకత్వము లేని ప్రజలు, ప్రతికక్షులు రెచ్చగొట్టడమువలన, సహజముగా ఇలాంటి ఘటనలు సంభవింపవచ్చు. ఇంతమాత్రాననే మహాత్ముడు "కాంగ్రెసు సత్యాగ్రహములాంటిది కొనసాగించడానికి తయారుగాలేదని" అనవలసిందేనా? మహాత్ముని ప్రధాన అనుచరుడు వల్లభభాయి పటేల్ "సత్యాగ్రహ ఉద్యమము ప్రారంభించడానికి స్వేచ్ఛ నిచ్చే పరిస్థితులలో దేశము లేదు" అని అనవలసిందేనా?

మహాత్ముని రాజకీయ జీవితములో ఇది క్రొత్తగాదు. చౌరీచౌరా దురంతాలు జరిగినవని ఆనాడు తలపెట్టిన ఉద్యమాన్ని ఆపివేశాడు. 1932 సత్యాగ్రహాన్ని మాన్పించి—చివరకు వ్యక్తిగత సత్యాగ్రహాన్ని కూడా మాన్పుతూ - నా సత్యాగ్రహ తత్వాన్ని ఎవరూ గ్రహించలేవని దేశముపై ఒక పెద్ద రాయి విసరి ఉద్యమాన్ని వెనుకకు నెట్టారు. నేడు రాజకోటలో 'ఎక్స్పెరిమెంటు' (పరిశోధన) కోసము సంస్థానాల ఉద్యమాన్నంతా మాన్పించివైచాడు. ఇపుడు-"కాంగ్రెసు పోరాడేస్థితిలో లేదనీ", "పోరాటము లేకుండానే అధికారాన్ని వశపరచుకోవాలనీ" మహాత్ముడు నినాదము లేవదీశాడు.

కాని నేటి పరిస్థితులేమిటి? ఉత్తరాన కాశ్మీర్ మొదలుకొని, దక్షిణాన తిరువాన్కూరు వరకును, తూర్పున ఒరిస్సాలోని చిన్ని చిన్ని సంస్థానాలు మొదలుకొని పడమటి కధియవారు సంస్థానాలవరకూ, సంస్థాన ఉద్యమము ప్రబలింది. ఎన్నడూ లేని అత్యున్నతస్థాయికి కర్షకోద్యమము హెచ్చింది. కార్మికులలో ఐకమత్యమూ, బలమూ నేడు ఇదివరకుకంటె హెచ్చింది: కాని, ఈ మూడింటినీ సమన్వయించి, కాంగ్రెసును విజయవంతముగా ముందుకు సాగించే విధానమే లేదు.

పైగా, నేడు కార్మిక కర్షకులలో ప్రబలిన చైతన్యమే, జరుపుతున్న ఉద్యమాలే హానికరమని మితవాదులు భావించుతున్నారు! అట్టి దృక్పధమే సుభాసును రాజీనామా నిప్పించునటుల చేసింది. కాంగ్రెసులో చీలికలు గల్గించింది. అతివాదులు లేని వర్కింగు కమిటీ నేడు బలహీనమైపోయింది.

యుద్ధచ్ఛాయలు క్రమ్ముతున్నాయి. మనం యుద్ధము వద్దంటున్నాము, కాని యుద్ధము మనమీద రుద్దబడినపుడు, యుద్ధంలో మన అమాయక ప్రజలను లాగి ఆహుతి చేయాలని, మన ధనాన్ని దోపిడి చేయాలని చూస్తున్నపుడు, "కాంగ్రెసు పోరాడే స్థితిలో" లేదని చేతులు ముడుచుక కూర్చోడమేనా? ఇదే మహదవకాశం. ఈ అవకాశంలోనే మన పారతంత్ర్యానికి తుదిమాట చెప్పాలి.

అతివాదులను తరిమి, కాంగ్రెసును గాంధీవాదుల కూటమిగామార్చి, అహింస ప్రబలుతున్నదను వంకతో పోరాటానికి స్వస్తిచెప్పి, రాజీలకు సిద్ధమౌతున్నారు మితవాదుల. ఈ బలహీనతను గుర్తెరిగి, మతకలహాలను దేశమంతటా రెచ్చగొడుతున్నారు సామ్రాజ్యవాదులు. ఈ సామ్రాజ్యవాదుల ఆట నరికట్టాలంటే మితవాదులను పోరాటంలోకి లాగాలి.

ఇందుకు ఒకటే మార్గము. సుభాసుబాబుపై, అతని అనుచరులపై ఎన్ని అనుమానాలున్నా, కాంగ్రెసు సోషలిస్టులు జయప్రకాశ చెప్పినట్లు 'మనకార్యక్రమంతో సరిపోయినంతవరకు' ఫార్వర్డు బ్లాకు కార్యక్రమముతో చేతులు కలపాలి. అతివాదులందరూ సమావేశము కావాలి. సోషలిస్టులు, కమ్యూనిస్టులు, బోసు స్నేహితులు— అందరూ, తీవ్రవాదులందరూ కలిసి, జాతీయవాంఛా తీర్మానము, యుద్ధవ్యతిరేక తీర్మానము దేశమంతా ప్రాకునట్లు కార్యక్రమాన్ని ఏర్పరచాలి. ఈప్రచారమే మితవాదులను రక్షిస్తుంది! ఇదే దేశాన్ని రక్షిస్తుంది!!

రాజకీయాలు

రాజకీయ ఖైదీలు

కలకత్తాలో జరిగిన అఖిలభారత కాంగ్రెసు సభ్యుల సమావేశంలో కాంగ్రెసులో ఐక్యత! సమకూరక పోయినా రెండు మూడు మూడు ముఖ్యమైన తీర్మానాలు మాత్రం చేయబడ్డాయి. వాటిలో రాజకీయ ఖైదీలవిడుదల సమస్యనుగూర్చి చేసిన తీర్మానం ఒకటి. బెంగాల్ పంజాబ్ రాష్ట్రాలలోని రాజకీయ ఖైదీల విడుదలను అఖిలభారత సమస్యగా చేయాలని ఆతీర్మానంలోవుంది. ఈవిషయమై కాంగ్రెస్ ఇదివరకే ఈ శ్రద్ధవహించి వుండవలసింది. ఎందుచేతనంటే, వారివిడుదల విషయమై గాంధి చేసిన ప్రయత్నాలు ఆ ప్రభుత్వాలతో జరిపిన రాయబారాలు అన్నీ విఫలమై చాలా కాలమైంది. ఇంతవరకు కూడా కాలయాపన చేయకుండా వెనువెంటనే ఈ ఆందోళన లేవదీసి యుండవలసింది.

ఈనెల 21 వ తేదీ ఆదివారంనాడు ఈ రాజకీయ ఖైదీల విడుదల దినోత్సవం భారత దేశమంతటా జరపాలనీ ప్రతి మీటింగులోను వారి విడుదలను కోరుతూ తీర్మానాలుచేసి దేశమంతటా ఆందోళన చేయాలనీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటన చేశాడు. సంయుక్త రాష్ట్రీయ కాంగ్రెసు తరపున జవహర్లాల్ నెహ్రూకూడ ఈ దినోత్సవాన్ని జరపవలసినదంటూ హెచ్చరించాడు. ఇతర రాష్ట్రీయ కాంగ్రెసు సంఘాలవారు కూడ ప్రకటనలు చేశారు.

బెంగాలు, పంజాబు రాష్ట్రాల ప్రభుత్వాలు తమ రాష్ట్రాలలోనున్న రాజకీయ ఖైదీల విషయములో చాల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాయని చెప్పక తప్పదు. ఖైదీలందరు తమకు హింసా పద్ధతులలో నమ్మకము పోయినదని బహిరంగముగా ప్రకటనచేశారు. విడుదల అయినవారు కూడ దౌర్జన్యవిధానము వదలి కాంగ్రెసు కార్యక్రమాన్నే అచరిస్తున్నారు. మిగిలిన వారిని కూడ విడుదల చేయాలని దేశమంతా కోరుతూ వుంది. కాని ఆరాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం వారిని విడుదల చేసేటట్లు తోచదు రాజన్ బాబు చెప్పినట్లు ఈరెండు రాష్ట్ర ప్రభుత్వాలు (బెంగాల్, పంజాబు) ప్రజాభిప్రాయాన్ని లెక్క చేయడం లేదు.

దీనికికూడ వెనుక కీలకం లేకపోలేదు. ఒక్క బెంగాల్, పంజాబు ప్రభుత్వాలైతే వాటంతట అవి ఇంత ధైర్యంగా ప్రజాభిప్రాయాన్ని తృణీకరించజాలవు. వెనుక నుండి సామ్రాజ్యవాదుల ప్రోత్సాహంతోనే వారిట్లు చేయడానికి సాహసిస్తున్నారని రాజకీయాలు తెలిసిన వారి కెవరికి చెప్ప నక్కరలేదు.

కనుక, కాంగ్రెస్ ఆదేశానుసారం దేశమంతటా ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్ర మంతటా రేపు 21 వ తేదీని అఖిలభారత రాజకీయ ఖైదీల దినోత్సవాన్ని జరిపి, తమ ఆందోళనద్వారా బెంగాలు, పంజాబు రాష్ట్ర ప్రభుత్వాలకు ముఖ్యంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు ప్రజాభిప్రాయాన్ని పాటించవలసిన అవశ్యకతను గుర్తింపజేస్తారని కోరుతున్నాం.

యుద్ధం వస్తే?

ప్రపంచ యుద్ధం వస్తే ఇప్పుడు భారత దేశం ఏం చేస్తుంది అనేదిమనం నిర్ణయించుకోవడం పోయింది! పాపం! లండనులో రిటైర్డు సివిల్ ఉద్యోగి జె.టి. గ్వెయన్ అనే ఆయన మనం ఏం చేస్తా మోతెలియజేస్తూ మాంచెస్టరు గార్డియన్ పత్రికలో వ్యాసాలు వ్రాయడం ప్రారంభించాడు. "ప్రపంచంలో పశుబలానికి (ఫాసిస్టులకు) ధర్మానికి జరుగుతున్న పోరాటాన్ని భారతీయులు గమనిస్తే 1914 లో ఐరోపా సంగ్రామంలో చేసినదానికంటె ఇంకా ఎక్కువ మనస్ఫూర్తిగా వారు బ్రిటిష్వారికి సాయంచేస్తారు" అంటాడు. మనదేశంలోవున్న ఫాసిస్టువ్యతిరేకతను ఆధారంగా తీసుకొని మళ్ళీ యుద్ధం వస్తే ఉపయోగించుకోవాలని కాబోలు ఈ ధర్మ పన్నాలు!

అంతే కాకుండా, కాంగ్రెస్ ఇప్పుడు యావద్భారత ఉద్యమాన్ని తీసుకొని రాలేదని, దానికి కారణాలుగా (1) కాంగ్రెస్ నాయకులకు కార్మిక-కర్షకులలో సోషలిజం వ్యాప్తిచెందడం హిందూ ముస్లిం తగాదాలు ఎక్కువ కావడం ఇష్టం లేకపోవడమనీ, (2) పోరాటం లేకుండానే పేరమౌంటు పవర్ (కేంద్ర ప్రభుత్వం) అధికారాన్నంతటిని బుద్ధిపూర్వకంగా ప్రజలకిచ్చి వేస్తుందని గాంధిగారినమ్మకమనీచెప్పాడు దీనిని ఋజువుచేయడానికి ఆయనసంస్థానాధీశులకిచ్చిన కిచ్చిన సలహాను "భారతదేశానికి అనుకూలమైన పరిస్థితులు వాటంతట అవే వస్తున్నాయనీ దేశమంతా సంస్థానాలు సహా, సత్య-అహింసల వల్లనే తాము సరియైన బలం సంపాదించగలమని గుర్తించితే, అధికారమంతా దానంతటదే ప్రజలచేతుల కివ్వ బడుతుంద"నీ ఉదహరించాడు.

అయితే ఈ బ్రిటిషు రాజకీయవేత్త ఇలా సాహసించి ఎట్లు చెప్పగలిగాడు అని కొందరికి ఆశ్చర్యం కలుగవచ్చు. మనం ఆశ్చర్యపడ నవసరం లేదంటాము. ఇదంతా, యుద్ధసమయంలో మనలను, మన సాధన సంపత్తిని ఇదివరకు కంటె ఎక్కువగా ఉపయోగించుకోడానికి బ్రిటిషుప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను సూచిస్తుంది. పోరాటము అక్కర లేకుండ స్వాతంత్ర్యాన్ని సాధించవచ్చునని గాంధివాదులు చేసేప్రకటనలు, దాని ఫలితముగా కాంగ్రెసులో వస్తున్న ద్విధావిధానం దీన్ని అరికట్టనికిడా ఉద్యమం తీసుకు రావాలని, కాంగ్రెసులో ఐక్యతకావాలని కోరే అతివాదుల ప్రయత్నాలకు మితవాదులు సుముఖత చూపడము లేదని, సామ్రాజ్యవాదులు చక్కగా పరిశీలిస్తున్నారన్నమాట!

పటేల్ ఉపన్యాసం

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మనలను గురించి చెప్పే జోస్యాలు ఎట్లా వుంటున్నాయో దురదృష్టవశాత్తూ మన మితవాద నాయకులు చేసే పనులుకూడా అట్లాగే వుంటున్నాయి. వల్లభభాయి పటేల్ బెనారస్లో ఉపన్యసిస్తూ "ఇప్పుడు మనము సత్యాగ్రహోద్యమాన్ని తీసుకొని రాలేము. దేశములో హిందూ ముస్లిం కొట్లాటలు, దౌర్జన్యము, సంస్థానాలలో బ్రిటిష్ ప్రభుత్వపు జోక్యము ఎక్కువైపోతున్నాయి. ఈ సమయంలో సత్యాగ్రహోద్యమంతెస్తే అరాజకత్వం (అనార్కీ) వస్తుంది. మనం బలహీనంగా వున్నాం. దానిని తట్టుకోలేం." అంటూ, కాంగ్రెసును ముందు చక్కబెట్టడం (వ్యతిరేకాభిప్రాయాలు గలవారిని వెళ్ళగొట్టడం) అత్యవసరమనీ చెప్పాడు. ఈ ఉపన్యాసం లండనులోని, అరిటైర్డు సివిల్ ఉద్యోగి చెప్పిన జోస్యానికి తిరీమని సరిపోతుంది. మన మితవాద నాయకులు జాతీయైక్యతను, కార్మిక కర్షక అతివాద శక్తులతో కాంగ్రెస్ ఐక్యతను ప్రదర్శించక ఇటువంటి ప్రకటనలు చేయడం వలన మన శత్రువుకు మరింత అవకాశాన్ని ఇచ్చిన వారవుతున్నారు.

రాయ్ ప్రవర్తన

కాని జాతీ యైక్యతను కాపాడవలసిన బాధ్యత మన మితవాద నాయకులపై ఎంత వుందో ఉద్యమాన్ని తీసుకు రావాలని కోరే అతివాదులపైకూడ అంతే వుంది. అనవసర విషయాలలో కూడ మితవాదులను రెచ్చగొట్టకుండా ప్రవర్తించాలి మొన్న యం. యన్. రాయ్ చేసినప్రకటన ఇటువంటిదే నని చెప్పాలి. త్రిపురీ కాంగ్రెస్ అనంతరం తాను ఏర్పాటుచేసిన "కాంగ్రెస్ రాడికల్ లీగు" లోనివారందరికీ వారివారి స్థానాలలో సాధారణ కాంగ్రెసు సభ్యుల సమావేశాలు జరిపి; మొన్న కలకత్తా ఎ. ఐ. సి. సి. మీటింగులో జరిగిన కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక అక్రమమైనదనీ, దానిని రద్దుచేసి, కాంగ్రెసు డెలిగేట్లందరు కలసి తిరిగి అధ్యక్షుని ఎన్నుకొనేటట్లు చేయాలనీ, గత అధ్యక్ష ఎన్నికలో (సుభాష్ ఎన్నికలో) వర్కింగుకమిటీ అభ్యర్థి ఓడిపోయి వుండడం చేత కాంగ్రెసు జనసామాన్యంలో దానిపైని విశ్వాసంపోయిందనీ, ఇప్పుడు తిరిగి ఆవర్కింగు కమిటీయే వుండుట అక్రమం అనీ, అందుచేత అదికూడ రద్దుకావాలి, అనీ, ఈ విధంగా ఎ. ఐ. సి. సి. చేయక పోయినట్లయితే ప్రత్యేక కాంగ్రెసు మహాసభను పిలచి కాంగ్రెసులో డెమాక్రసీ వున్నదని రుజువు చేయవలసి వుంటుంది అని తీర్మానాలు చేయించాలని హెచ్చరిక పంపాడు. కాంగ్రెసు చేసిన జాతీయ వాంఛాతీర్మానము మొదలైనవి ప్రచారము చేయడానికి బదులు ఇటువంటి వృథాకార్యక్రమాల్లో కాంగ్రెసు సభ్యులందరి శక్తిని కాలాన్ని వ్యయపర్చడానికే ఇది తోడ్పడుతుంది కాని వేరు కాదు.

కలకత్తా మున్సిపల్ బిల్లు

హిందూ ముస్లిం కలహాలు జాతీయోద్యమం తీసుకు రావడానికి ఆటంకమని మన నాయకులు భయపడుతున్నదానికి తగినట్లుగానే బెంగాల్లోని హక్ మంత్రివర్గం వాటిని మరింత రెచ్చగొట్టే బిల్లులు ప్యాసు చేస్తోంది. మొన్న బెంగాల్ ఎస్సెంబ్లీలో ప్యాసయిన కలకత్తా మునిసిపల్ బిల్లు ఇందుకు తార్కాణం. దీనికి కాంగ్రెసు పార్టీ, ఇండిపెండెంటు షెడ్యూల్డు వర్గం హిందూ నేషనలిస్టు పక్షాలు దీనిని వ్యతిరేకించాయి కృషక్ ప్రజాపక్షం వారు ఒకసారి ఈబిల్లుకు ప్రాతికూల్యం చూపుతూ లాకౌటు చేశారు. కాని ఓటింగులో తాటస్థ్యం వహించారు.

ఈ బిల్లులో అభ్యంతరకరమైన అంశాలు ముఖ్యంగా మూడు ఒకటి సంయుక్త నియోజక వర్గాలకు బదులుగా ముస్లింలకు, హిందువులకు వేరువేరు నియోజక వర్గాలను ఏర్పాటు చేయడం. దీనిని సమర్థిస్తూ ప్రధానమంత్రి ఫజ్లుల్హక్, బెంగాలులో వివిధమతాలవారు పరస్పరంగా ఏకీభావం కుదుర్చుకొని ఈప్రత్యేక నియోజకవర్గాలకు బదులుగా ఇంకో పద్ధతి ఏదైనా నిర్ణయించుకునేవరకు ఇది వుండాలని. బెంగాలులోనే కాక దేశమంతటాకూడా నూటికి 99 ముస్లింలు ప్రత్యేక నియోజకవర్గాలే కావాలంటున్నారనీ చెప్పాడు. నిజానికి సంయుక్త నియోజక వర్గాలు ఏర్పాటు అయినప్పటినుండి, సుమారు 10 సంవత్సరాలనుండి, కలకత్తా కార్పొరేషను వ్యవహారాలు పరిశీలిస్తే మహమ్మదీయులకు జరిగిన నష్టాలకంటే లాభాలే ఎక్కువ. హెచ్చు వుద్యోగాలు, గ్రాంట్లు, లభించడమే కాక ఒక ముస్లిం సభ్యుడు మేయరుకూడా అయాడు. ఇటువంటప్పుడు హిందూ మహమ్మదీయులకు సఖ్యత లేదని ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటుచేయడం, లేనిపోనిమతోద్రేకాన్ని రెచ్చగొట్టడంకాకమరేమిటి?

రెండవది ఇందుమూలంగా సహజంగా అధిక సంఖ్యాకులైన హిందూ సభ్యత్వాన్ని తగ్గించడం.

మూడవది ప్రభుత్వం కొందరు సభ్యులను నామినేటుచేసే పద్ధతిని ఖాయం చేయడం.

ఇదిగాక ఈ బిల్లు చర్చలలో వుండగా ఫజ్లుల్హక్ ఒక ముస్లింలీగ్ సభలో ఉపన్యసిస్తూ "మహమ్మదీయులు ఒకప్పుడు హిందూదేశాన్ని పరిపాలించారు. ఇప్పుడు కూడా మీరంతా తల్చుకుంటే అపని చేయగలరు. మనమంతా ముందుగా బెంగాలులోనే మనరాజ్యాన్ని స్థాపించుకోవచ్చును. కనుక సోదరులారా, మీరంతా మేల్కొ-వాలి" అని, హెచ్చరించాడు, ప్రభుత్వ ఉద్యోగాలలో కూడ కమ్యూనల్ రేషో నిర్ధారణకు సమాలోచనలు చేస్తున్నాడు. ఇవన్నీ చూస్తే కాంగ్రెసేతర రాష్ట్రాలలో మతకక్షలను ఏవిధంగా రెచ్చగొడుతున్నారో బోధపడుతుంది. దీనికంతకు వెనుక సామ్రాజ్యవాదుల ప్రోత్సాహముపదన్న విషయం మనం మరచిపోకూడదు.

కమ్యూనిస్టు పార్టీ

మన దేశంలో కమ్యూనిస్టుపార్టీ మీద నిషేధాన్ని తొలగించాలంటూ కావలసినంత ఆందోళన జరుగుతూ వుంది. కమ్యూనిస్టుపార్టీ పైనున్న నిషేధాన్ని తొలగించే అధికారం కేంద్ర ప్రభుత్వానికే వున్నా ప్రజాస్వామ్య హక్కులను కాపాడే కాంగ్రెసు మంత్రివర్గాలు తమ తమ రాష్ట్రాలలో తీర్మానాలు చేసియైనా కేంద్ర ప్రభుత్వంమీద ఒత్తిడి తీసుకు రావచ్చునని, కనీసం పౌరసత్వ హక్కులను కోరుతున్నామనీ ప్రపంచానికి వెల్లడియైనా చేయవచ్చునని కాంగ్రెసు మంత్రివర్గాలకు కూడా విజ్ఞప్తులు చేయబడ్డాయి. మొన్న యు. పి. కాంగ్రెసు ప్రధాని గోవిందవల్లభ పంతు అ ఎస్సెంబ్లీలో కమ్యూనిస్టుపార్టీపై నిషేధం తొలగించాలని ఒక తీర్మానాన్నిగురించి కూడ ఆయన ఎంతో చక్కగా మాట్లాడు.

"మనకు సంబంధించి నంతవరకు మనం ప్రజాస్వామ్య సూత్రాలకు కట్టుబడి వుంటాం. అందుచేత కమ్యూనిస్టుపార్టీ పైనున్న నిషేధాన్ని తొలగించడం చాల మంచిదని నా అభిప్రాయం" అన్నాడు.

యు. పి. రాష్ట్ర ప్రభుత్వంచేసిన ఈ పని మిగిలిన అన్ని కాంగ్రెసు ప్రభుత్వాలు అనుసరింప దగినది. ముఖ్యంగా మాటిమాటికి కమ్యూనిస్టు పెనుభూతాన్ని గూర్చి కలలు గంటూ వుండే మన రాజాజీ చిత్తగించవలసిన విషయం.

ఏ రాజకీయ పార్టీవలన అయినా భయం ఏర్పడుతుందంటే దానిని నిషేధించి అణచి పెట్టి వుంచడంవల్లనే ఏర్పడుతుంది. మన దేశంలో కమ్యూనిస్టు పార్టీ అంటే అంత భయపడవలసిన అగత్యం ఏమీ కనబడదు. ఈ రోజున కమ్యూనిస్టులు కూడ ఇతర కాంగ్రెసువారి వలెనే కాంగ్రెసు కార్యక్రమాన్ని తీర్మానాలను అమలు జరుపుతున్నారు. వారివలన ప్రజాశాంతికి ఎట్టి ప్రమాదం సంభవించలేదు. అందుచేత యు. పి. కాంగ్రెసు మంత్రివర్గం చేసినట్లుగానే ఇతర కాంగ్రెసు మంత్రివర్గాలవారు కూడా చేసి కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికను అమలు జరుపుతారని ఆశిస్తున్నాం.

వడ్డీ వ్యాపారులకు లైసెన్సు

మద్రాసు ఎస్సెంబ్లీలో కొలది కాలములోనే వడ్డీవ్యాపారుల చట్టాన్ని ప్రవేశ పెట్టబోతున్నారు' దీనికి అప్పుడే ఒక మెమొరాండమును తయారుచేసి వుంచారనీ కూడ తెలుస్తోంది. ఈ మెమొరాండమును గురించి ఈ నెల 15 వ తేదీని మద్రాసులో సమావేశమైన కో-అపరేటివ్ కమిటీవారు చర్చించారు. ప్రభుత్వానికి వారు కొన్ని సూచనలు చేసారు. అవి (1) వడ్డీవ్యాపారం చేసే వారందరికి లైసెన్సు వుండితీరాలి. అక్కవుంట్లు ఆడిట్ చేయాలి. (2) వడ్డీరేట్లు నిర్ణయింపబడాలి. (3) ప్రతమూలకమైన నోటుగాని ఉత్తరంగాని లేని బాకీలకు వడ్డీయే వుండకూడదు. (4) బాకీదార్లను వడ్డీవ్యాపార్లు మోసము చేయకుండ దానికి అట్టి డాక్యుమెంట్లు వ్రాయడం, డబ్బు ఇవ్వడం ఒక పబ్లిక్ ఆఫీసరు సమక్షంలో జరగాలి.

బెంగాల్ శాసన సభ్యుల హక్కులు

అసెంబ్లీ సభ్యుల హక్కుల విషయమై విచారించడానికి బెంగాల్ అసెంబ్లీ గత సంవత్సరం ఫిబ్రవరిలో నియమించిన కమిటీయొక్క రిపోర్టు అసెంబ్లీ యెదుట పెట్టబడింది.

బిల్లుయొక్క ఉద్దేశాలు, కారణాలు ఈ క్రింది విధంగా చెప్పబడి వున్నవి:

"ఇండియా గవర్నమెంటు చట్టం 81 సెక్షను క్రింద యిప్పుడు శాసనసభ స్వంత హక్కులను నిర్ణయించుకొనడానికి అధికారం పొందివున్నది. కాని, అట్టి హక్కులను మించిన సందర్భంలో శిక్షణ విధించడానికి హక్కులేదు. కాబట్టి హక్కులమీరిన కేసులన్నీ కోర్టులచే విచారింపబడవలెనని బిల్లు సూచిస్తున్నది. అసెంబ్లీ సభ్యుడు అసెంబ్లీ సంబంధమైన పనులు నిర్వహించడానికి యెట్టి ఆటంకం లేకుండా వుండడం కోసం, అసెంబ్లీ సమావేశ కాలంలో యెట్టి సివిలు కేసులలోను అరెస్టు చేయకూడదనిన్నీ, జైలులో నిర్బంధించ కూడదనిన్నీ అసెంబ్లీ సమావేశమునకు రెండు వారాలు ముందు, వెనుక మధ్యకాలములో యే సివిలురేక రివిన్యూ కోర్టులకున్నూ హాజరుకాకుండా వుండవచ్చుననిన్నీ, బిల్లు సూచిస్తున్నది.

ఒక శాసనసభలో యే సభ్యుడైనా శాసనసభ అనుమతి లేకుండా అన్ని సమావేశముల నుండి 60 రోజులవరకు హాజరు కాకుండా వుంటే ఆతనిస్థానం ఖాళీ పడినట్లు భావించబడవచ్చునని ఇండియా గవర్నమెంటు చట్టములో వున్నది. గనుక యే సభ్యుడయినా ఒక క్రిమినల్ కేసు సందర్భమున అరెస్టు చేయబడినా, లేక జైలులో నిర్బంధింపబడినా, ఆ విషయం అసెంబ్లీకి ముందుగా తెలియపరచబడాలని బిల్లు సూచిస్తున్నది. ఈ సూచనలో క్రిమినల్ లా పరిపాలనమునకు ఆటంకం కలిగించే ఉద్దేశంలేదు. కాని అట్టి సభ్యుడు అసెంబ్లీ సమావేశానికి హాజరు కావలసిన అవసరముండవచ్చును గనుక ఇట్టి సభ్యుడు తగిన కావలాక్రింద వుంచబడి అసెంబ్లీ స్పీకరు యెదుటకు తేబడి అవసరమైనంత కాలము వుంచబడడానికి బిల్లు సూచిస్తున్నది.

జామీనుమీద విడుదలకు వీలయినట్టి నేరమునకై నిర్బంధించబడిన సభ్యుడు శాసన సభకు సంబంధించిన పనులు నిర్వహించడానికి వీలుగ వుండుటకై, తన విచారణ జరిగే రోజులలో తప్ప జామీనుమీద విడిచిపెట్టబడవలెనని కూడా యీబిల్లు సూచిస్తున్నది.

ఒక సభ్యుడు తన రాష్ట్రంలోపున తిరుగుచుండడానికి క్రిమినలు చట్టము ప్రతిబంధకం కలిగిస్తేనే తప్ప, స్వేచ్ఛవుండాలి.

స్పీకరు యే కోర్టులోనూ స్వయంగా హాజరు కాకుండా వుండవచ్చును. న్యాయచట్టం క్రింద శిక్షితుడైతేనే తప్ప, యే క్రిమినలు నేరారోపణమునకైనను అరెస్టు చేయబడకూడదు. జైలులో నిర్బంధింపబడకూడదు. శాసన సభయొక్క పనికి ఆటంకం లేకుండడానికి యిది అవసరం.

తీవ్రమైనట్టి కొన్ని నేరముల విషయములో ప్రత్యేక విచారణపద్ధతి సూచింపబడింది యిట్టి కేసులను స్పీకరు ఫిర్యాదుచేస్తేనే తప్ప కోర్టు అంగీకరించకూడదు. అట్టి కేసులను ఉపసంహరించుకొనడానికి స్పీకరుకు అధికారం యివ్వబడింది. శాసన సభకు సంబంధించిన పనులలో లంచములు పుచ్చుకోవడం యీ నేరములలో చేర్పబడింది.

అత్యవసరమైన ముఖ్యవిషయములలో హైకోర్టు విచారణచేయడానికి శాసనసభ తీర్మానము మూలమున కోరినప్పుడు, ఇంగ్లండులో అనుసరింప బడుతున్న ఆచారం ప్రకారము హైకోర్టు జడ్జీల ట్రిబ్యునల్ యేర్పరచబడవలెను. చాల ప్రాముఖ్యమైన సమస్యలు అప్పుడప్పుడు ఉదయిస్తూ వుంటాయి. అట్టి సందర్భాలలో జుడీషియల్ విచారణ జరపడం ఉత్తమమార్గం కొంతకాలము క్రిందట ఇంగ్లాండులో బడ్జెట్టుకు సంబంధించిన అక్రమములు జుడిషియల్ విచారణకు పెట్టబడ్డాయి. అనేవిధమైన పద్ధతి అనుసరించబడడానికి యీబిల్లు సూచిస్తున్నది."

గడ్డిపరక

శ్రీ శ్రీరంగం నారాయణబాబు

పూజా సమయాల
పూవును
దూర్వాంకురాన్ని!
అవసరం
తీరాక
అవతల
కనబడితే
మొక్కనగ
మాచేటి
గడ్డిపరకను!
గడ్డిపరకను!
నడవండి
నడవండి
నామీంచి
నడవండి!

పశువుల
నోటికి
పాయసాన్ని!
మీ సుకుమార
పాదాల
మకరికను!
గడ్డిపరకను!
గడ్డిపరకను!
నడవండి
నడవండి
నామీంచి
నడవండి!

పల్లకి
దిగనట్టి
పెళ్ళికొడుకులు
మీరు
పట్టు తివాసీని
నేను
నడవండి
నడవండి
నా మీంచి
నడవండి!
గడ్డిపరకను!
గడ్డిపరకను!

మీ పైడి
పాదాల
మృదురజో
లేశమే
నా ప్రాణపు
రేఖలలో
ఉల్కలా
పాతము!
నడవండి
నడవండి
నా మీంచి
నడవండి!
గడ్డిపరకను!
గడ్డిపరకను!

మాతృ
వర్గంవారు
మా అన్న
వన్నగమ్ముల
చవి
ఉత్తరించిన
మిన్న
నేటికి
మీసితృ
కార్యంనాడు
పొరణమీద
మీచేతిమీద
మరకత
అంగుళీకమ్ము!
గతులు
కల్పించేటి
గడ్డిపరకలము!
నడవండి
నడవండి
నామీంచి
నడవండి!
....

ఆగండి!
ఆగండి!
మిన్నువిప్పిన
రక్తవరాకం
మన్ను నక్షత్రవే
తెలిపింది!
ప్రాభాత
పశ్చిమానిలము
పాడిన పాట
కాకాసురుని కథ
జ్ఞాపకం తెచ్చింది
నన్ను నే
తెలుసుకున్నాను!
ఆగండి!
ఆగండి!

["రుధిరజ్యోతి" లోని యదార్థగీతమిది.]



రైతు సత్యాగ్రహుల మీద దారుణ నిర్బంధ విధానం

బిహార్ రాష్ట్రంలో బాడాహియా తాల్ రైతు సత్యాగ్రహుల్ని అణచడానికి ప్రభుత్వము యింతవరకు 60,000 రూపాయలు మిలిటరీకి, పోలీసు సిబ్బందికి ఖర్చు చేసింది. 500 మంది రైతులకు గాయాలు తగిలాయి. నవంబరు 16 వ తేదీని 75 రైతు సత్యాగ్రహుల్ని పోలీసులు క్రూరముగా బాదమోదారు. కొద్ది రోజుల తరువాత, రేపూరా గ్రామములో జమీందారు నౌకరులు రైతులపై గావించిన దౌర్జన్య ఫలితముగా, 75 సంవత్సరాల వయస్సు గలిగిన ఒక పురుషునికీ, 70 సంవత్సరాల ముసలి స్త్రీకీ, తీవ్రమైన గాయాలు తగిలాయి. సంపూర్ణ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భములో యిద్దరు రైతుల్ని యిదేవిధముగా బడాహియా తాల్ కోర్టుమీద తుంటరులు గాయపరిచారు. ఫిబ్రవరి 17 వ తారీఖున, పాళీగ్రామంలో, మేజస్ట్రేటు సమక్షములో స్త్రీ, పురుష సత్యాగ్రహుల్ని, శిశువుల్నీ లాఠీలతో మోది, వారి ఆస్తిని నదిలో పారవేసి, పశువుల్ని తెమలుగా నిలబడాలనీ; (2) జైలుకుపోయి, జైలు తిండితోనే సంతృప్తి పడడానికీ; (3) లేక, తమ తమ యిండ్లకి తిరిగి వచ్చేలోపల ప్రభుత్వంవద్దనే తిండి, గుడ్డ, తెచ్చుకొనడానికీ—కార్యానందశర్మ యీ రైతు యాత్రను నడిపించారు. మే 1 వ తేదీని తాల్ గ్రామస్థులు మాంఘీర్ పట్టణానికి ప్రయాణమయారు. టిక్కెట్లు కొనకుండా రైలు ఎక్కారు. రెండవ దళములో 100 మందికి పైగా ఉన్నారు. మే 3 వ తేదీని కార్యానందశర్మను రైల్వే పోలీసులు ఎరస్టుచేసి కేసు పెట్టారు. ఈ విధముగా సత్యాగ్రహులు ప్రజల దృష్టిని తమవైపుకు తిప్పుకొన్న తరువాత, కొన్ని రోజుల అనంతరము యీ పద్ధతిని మానివేశారు.

అంబరీ రైతు సత్యాగ్రహ సందర్భములో 6 నెలల కఠిన శిక్ష విధించబడిన పండిత రాహుల్ సంకీర్త్రాయన్ మే 1 వ తేదీన జైలులో రెండవసారి నిరశనవ్రతం



కాశీపట్నం రైతు సభ.

—గొర్రెలనూ దావ బావి వెళ్ళిపోయారు. ఏప్రిలు 3 వ తేదీని 4 గురు రైతుల్ని యిదేవిధముగా జమీందారీ రౌడీలు కొట్టారు. మరొక సంవత్సరంలో 10 మందికి ప్రమాదకరమైన గాయాలు తగిలాయనీ, వారిలో ఒక గర్భిణీ స్త్రీకి తగిలిన దెబ్బలవల్ల శిశువు బయటికి వచ్చి మరణించినదనీ, పండిత కార్యానందశర్మ గారు ప్రకటన గావించారు. రైతులు ఈఅమానుష కృత్యాలన్నింటినీ శాంతియుతంగా ఎదుర్కొంటూన్న సమయములో జమీందారు నౌకరులు వారి పంట లన్నింటినీ పోలీసుల సహాయంతో దోచుకుపోయారు. గవర్నమెంటుచే జప్తు చేయబడినవని చెప్పబడే వేలకొద్దీ పుట్ల ధాన్యం జమీందార్ల గాదెల్లోకి వెళ్ళి పడ్డాయి. రైతులూ, రైతుల పశువులూ, తిండిలేక మలమల మాడుతున్నారు. ఇట్టి పరిస్థితులలో రైతులు మాంఘీర్ జిల్లా కలెక్టరు కోర్టుకు యాత్రగా బయలుదేరారు. ప్రభుత్వ యంత్రాన్ని వారు గడ గడ లాడించదలచుకున్నారు. (1) ఈ పాడు ప్రపంచాన్నుండి విముక్తిని పొందడానికి తుపాకీగుండ్ల ప్రారంభించారు. రైతు సత్యాగ్రహులనందర్నీ రాజకీయ ఖైదీలుగా పరిగణించాలి అని ఆయన పట్టుదల. కాంగ్రెస్ పార్లమెంటరీ కార్యదర్శి ఎంత బ్రతిమాలినా, ఆయన నిరశనవ్రతం మానలేదు. చివరికి ప్రభుత్వం విడుదల చేసింది.

షాహాబాద్ జిల్లాలో జమీందార్లు మధ్యవర్తిత్వ పరిష్కారానికి నిరాకరించడమువల్ల మూడియార్ గ్రామస్థులు సత్యాగ్రహం ప్రారంభించారు — ఏప్రిల్ 24 వ తేదీని వ్రజనందనశర్మగారి నాయకత్వాన తమ పంటను కోసుకొనడానికి వెళ్ళితే 150 మంది పోలీసుల సహాయముతో వారిని నిరోధించారు. వ్రజనందనశర్మగారిని దరిమిలాను ఎరస్టు చేశారు. వెంటనే రైతులు యినుమడించిన ఉత్సాహంతో ఎర్రజండాల ఊరేగింపుతో వెళ్ళి పంటల్ని కోసుకొనబోతూంటే, వారందర్నీ పోలీసులు ఎరస్టు చేశారు. స్త్రీ సత్యాగ్రహులు మిలిటరీ మధ్యనుండి తోసుకొనివెళ్ళి, ధైర్యంతో పంటకోసుకొని తెచ్చుకున్నారు.

పంజాబులో 1000 మంది రైతుల ఎరస్టు.

లాహోర్ రైతు సత్యాగ్రహ సందర్భంలో యింతవరకు సుమారు 1000 మంది రైతుల్ని పోలీసులు ఎరస్టు చేశారు. వీరిలో 136 గురు స్త్రీలుకూడా ఉన్నారు.

* * *

సర్దార్ పటేలు రాష్ట్రింలో 26 ఎరస్టులు

సర్దార్ వల్లభభాయి పటేలు రాష్ట్రిం అయిన గుజరాతులో పంచమహల్ జిల్లాకు చెందిన ఈరాల్ గ్రామములో ఏప్రిలు 8 వ తేదీన 26 గురు రైతుల్ని పోలీసులు అన్యాయముగా ఎరస్టు చేశారు. ఆగ్రామానికి చెందిన రైతు తన చెరుకుతోట నీటి సప్లయి కొరకు పక్కనున్న మరొక రైతు నూతిగుండా నీరు తెచ్చుకోవడం చాలా సంవత్సరాల నుంచీ రివాజు. కాని, జమీందారు కొడుకు ఏప్రిలు 3 వ తేదీని ఆనూతివద్దకు కొందరు రౌడీలతో వచ్చి, నీరు తోడకుండా ఆటంకపరిచారు. నీటి తొట్టెను కూడా పగులగొట్టించారు. గ్రామస్తులంతా అక్కడికి వచ్చి, జమీందారు కొడుకుతో శాంతియుతముగా వాదించారు. కాని, లాభం లేకపోవడంవల్ల తిరిగి వెళ్ళిపోయారు. ఇది జరిగిన నాలుగైదురోజుల తర్వాత, పోలీసులు ఈరాల్ గ్రామం వచ్చి, అనేకమంది రైతుల యిండ్లను సోదా చేసి, రైతాంగానికి ఉపకరించే సాధనాలను తీసుకువెళ్లారు. ఏప్రిలు 8 వ తేదీని 26 గుర్ని ఎరస్టు చేసి కేసులు బనాయించారు.

* * *

రైతాంగ విద్యాలయం తునికిపాడు

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల "నర్థము చేసుకొని అన్నిటి సారాంశమును ప్రజాసామాన్యానికి తెలుపగల్గు ప్రచారకులు కావలెను. వారికి తరిబీయతు అవసరము గదా! ఆ తరిబీయతులో ఆర్థిక రాజకీయ శాస్త్ర సూత్ర పరిగ్రహణ మొక ముఖ్యావసరము. అలాంటి "శిక్షణ"ను అఖిల భారత దేశమందు వెల్లివిరియుచున్న వివిధ రైతాంగ, రాజకీయ పాఠశాల లీనాడు వందల కొలది యువకులకు ప్రసాదించుచున్నవి. వీటికి తలమాణిక్యము రైతాంగవిద్యాలయము. ఆద్దానిని నైజాం, నందిగామ, తిరువూరు యిలాకా రైతు కూలీ యువకుల కొరకై "తునికిపాడు"లో సుప్రసిద్ధ రయితు సేవక నాయకులయిన శ్రీ పేట బాపయ్య, సుంకర వీరభద్రరావు, ములుకుట్ల వెంకటప్పయ్య, పొట్లూరు సుందరం, క. అప్పయ్య, జి. వెంకయ్య, పైడిల్లి హనుమయ్య ప్రభృతులు ప్రయత్నించి స్థాపించుచున్నారు. అత్యవసరమైన అలాంటి విద్యాలయానికి ప్రధాన పండితుడుగా వచ్చుటకంటె నాకు కోరుకొనదగిన గౌరవమేమి! వివిధ ప్రాంతాల యువకులు విరివిగా వత్తురనియు తర్ఫీయదుపొంది రైతు కూలిసేవకు స్వరాజ్య సంపాదనకు యినుమడించిన శక్తితో పూనుకొందురుగాక!అని" ఆచార్య రంగాగారు వ్రాస్తున్నారు.

జైలు ఖానా: ముగ్గురు ఖైదీలు; మొదటివాడు వర్తకుడు; రెండవవాడు ఆస్తికుడైన కవి; మూడవవాడు కూలివాడు. తెల్లవారుయీడు ఎప్పుడౌతుందోనని దిగాలుపడి వేచియుంటారు. ఆ సమయాన వారు ఉరితీయబడతారు. వారు గడుపుతున్నది వారికి అంతిమ నిశి. అప్పుడు నిశీధం, సుప్రశాంతంగా ఉంది. "మినుకు మినుకు"మంటూ మాత్రం గ్రుడ్డిదీపం వారి కొట్లులో వెల్గుతూంటుంది మాజిక్‌లాంతరు బొమ్మ లాగినట్లుగ గాఢంగా, నిశ్చలంగా ఉన్న చిత్తరువు మీదనుండి తొలగించినట్లుగ తెరవైకిపోతుంది. కొంచెము సేపున్న తర్వాత - కావలివాని అడుగుల చప్పుడు - తుపాకీ మీటినశబ్దం - -తిరిగి కఠినమైన లోహ శబ్దపు అడుగుల చప్పుడు. కావలివాడు తుపాకీతో నీడలాగ కనువిస్తాడు. నీడమాదిరి సంచరిస్తాడు. ఏదో విషాదమును ప్రేక్షకులకు జ్ఞప్తికి తెస్తూన్నట్లు వెంటాడుతాడు. కూలివాడు సిగరెట్టును వెలిగించి, లోపలకు బాగా పొగపీల్చి, వర్తకుని కందిస్తాడు. (ముగ్గురిలోకి బాగా విసిగిపోయినవాడు వర్తకుడు. అతను అదో ధోరణిలో కాలుస్తూ కవికి తిరిగి అందిస్తాడు.)

కూలివాడు:- (సుడులు తిరుగుతూన్న పొగవైపు చూపుతూ) దీనితోటి ఆఖరు; మనము పొగ త్రాగుట!

వర్తకుడు:- (మిగతా ఇద్దరి కళ్ళల్లోకీ తీక్షణంగ చూస్తూ, హఠాత్తుగ పిచ్చివానిలా నవ్వటం మొదలుపెట్టి, మరల నవ్వటం మానివేస్తాడు.)

కూలివాడు:- పిచ్చివాని నవ్వు!

కవి:- చనిపోయినవారి నవ్వు!

కూలివాడు:- చనిపోయినవారు శాంతంగ ఉన్నారు! వారలెప్పుడూ నవ్వరు!

రా! కామ్రేడ్ ధైర్యంగా ఉండు!

వర్తకుడు:- మానవసృష్టికారు డెవ్వడు!

కవి:- దే....ము....డు

వర్తకుడు:- ఉరికంబాన్ని ఎవరు సృష్టించారు!

కూలివాడు:- మ....ని—షి

వర్తకుడు:- దేముడు మనిషిని సృష్టించాడు, మనిషి ఉరికంబాన్ని సృష్టించాడు........ (వ్రేళ్ళమీద లెక్కపెడుతూ) అందుచేత.... దేముడు ఉరికంబాన్ని సృష్టించాడన్న మాట.... ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు (క్రిందకి, పైకి పచారు చేయును)

కవి:- రేపు! మనకు రేపటితోసరి........ నక్షత్రాలతో, స్వచ్ఛమైన స్వేద తారకలతో ప్రియురాలి కన్నీటి కణాలలాగున్న తారకలతో, నిశిఎంత శోభాయమానంగా ఉంది!

కూలివాడు:- చెమట బిందువులు, నా కోటానకోట్ల సోదరుల చెమటబిందువులు!

కామ్రేడ్! రేపు, ఎల్లుండి, అవతలఎల్లుండి, ఈ సమయానికే రాత్రి మరల వస్తుందని అనుకొనటం........కాని, నీవు, నేనూ మాత్రం, తిరిగి చూచేటందుకు, ఇక్కడుండము.

కూలివాడు:- నిన్నుగురించి, నన్నుగురించి రాత్రి 'కాతరు' చేస్తుందేమిటి!

కవి:- ఓహో! విశ్వకంపిత సౌందర్యము! మనలను ఎటుల విడిచిపోవునో!

కూలివాడు:- మనలను విశ్వ సౌందర్యము విడిచి పోతుందా! అబద్ధం! అది అంత సుందరమైనదని పిలవటానికి బాగా బలిసిన ఆత్మాభిమానికే తగును! మనిషి సౌందర్యమంతా బాగానే ఉంది!-కాని అదంతా క్రూరత్వంతో వివిడీకృతం!

★ ఏకాంక నాటిక

పహరావాని లాంతరు

హరీంద్రనాథ ఛటోపాధ్యాయ ప్రణీతం

అనువాదం: జనమంచి "మఘపాళి"

కవి:- నీ జీవితానికి అవసానకాలం సమీపిస్తూన్నా సౌందర్యాన్ని ఎందుకు దూషిస్తావు!

కూలివాడు:- నా జీవితానికి అవసాన దశా!

కవి:- రేపు మృతినొందుతాననే విచారమైనా లేదా నీకు!

కూలివాడు:- రేపు చనిపోవటానికి విచారమా! .... కవీ! నేనునూ కూలివాణ్ణి, జీవంలేని కోటానకోట్లలో నేనొకణ్ణి. మేము పుట్టినప్పటినుండీ జీవచ్ఛవాలమే! జీవిత మంటే ఏమిటో ఎరిగి యుండనప్పుడు, నీకున్నట్లుగ, నాకు స్వాభిమానము ఎట్లాగ ఉంటుంది! నీకు అలవాటైపోయిన తీయని ప్రాణాన్ని విడిచివేయటమంటే కష్టంగానే ఉంటుంది. కాని నాకు ప్రాణమంటే ఏమిటో తెలియదు.

కవి:- ఓ! కారుమొయిలు గాఢంగా అల్లుకుని రాచ ఏనుగులలా పర్వతాలమీదకి వచ్చుట తల్చుకుంటే ఎంతేనా దుర్భరంగా ఉంటుంది; నాజీవితపు ప్రతివత్సరోత్సవము చూచుట ఎంత ఇష్టముగా ఉండేది! నాశైశవవోద్యానవనములలో నెమళ్లు, తమ, విశాలమైన రంగు రంగుల పింఛములను విప్పి వరుణ దేవతల ముందు నాట్యమొనరించునని అను కొనటము; ఓ! మరి పాదపచ్ఛాయలు, సున్నితంగా, చల్లగా, సుకుమారంగా, దార్శివక్కన నిదురిస్తాయి. గువ్వలు "కూ" అనుతూ నిర్జన వనమార్గాల్లో ప్రేమిస్తూంటాయి. ఫలాలు, మన తోటలలో కొమ్మల నుండి వ్రేలాడుతూంటాయి. ఓ! కామ్రేడ్!

కూలివాడు:- ఇదే నీ కడసారి పద్యమనుకుంటా?

కవి:- విశ్వ సౌందర్యానికి నా అంతిమ నిర్వేద గీతిక! వారు నాపై మార్షల్ లా (Martial Law) క్రింద నేరము మోపి బంధించగల్గి ఘోరమైన శిక్షకు నేనేమి చేసినాను! ఓ! పరమేశ్వరా! నిర్దోషుల్ని ఈ విధంగా బాధలపాలు చేయటానికి నీకు తగునా, ఇంత అన్యాయంగా?

కూలివాడు:- (నవ్వును) ఇప్పుడు దేముడు కావలసి వచ్చాడు—వెర్రికవీ! అవున్నుడు ఎవడు తారకలనీ, చంద్రుణ్ణి— (దూరాన నక్కకూత వెడుతుంది) మరి స్మశాన వాటికల్లో సంచరించు నక్కని సృష్టించిన అతనిని!

కవి:- (భయముతో వణకును) ఓ!

కూలివాడు:- కాని, అవును. వెలవెలబారే చంద్రకాంతిలో, దానితోక చాదీ వెండికింద మారుతుంది! హా! కవీ! జీవితమంతా ఎటువంటి స్వప్నానుభూతి నొందుచున్నావు!.... .... రేపటితో నీ కలంతు స్వస్తి!

కవి:- ఉహూ! ఎప్పటికీకాదు! నేను పునర్జన్మ ఎత్తుతాను!

వర్తకుడు:- (కొద్దిగ నిర్వేదపాటుతో) నేనుకూడా పునర్జన్మ ఎత్తుతానా? నేనింకా ఐదులక్షలు సంపాదించాలి! వడ్డీకి ఇంకా ఎక్కువ ఇవ్వాలి—ఎక్కువ— ఓ! డబ్బు! డబ్బు!! డబ్బు!! నేను డబ్బును ప్రేమిస్తాను— ప్రాణంకంటె ఎక్కువగా!

కూలివాడు:- పునర్జన్మఅంటే నమ్మకముందన్నమాట! మంచిది!

కవి:- నేను మరల తిరిగి వస్తాను. ప్రపంచములోని సమస్తాన్ని గుర్తు పట్ట గల్గుతా. పక్షుల, నీళ్ళకొండల అందము.

కూలివాడు:- నీకు మరణమాసన్న మవుతూన్నప్పటికీ, సానుభూతేచ్ఛ చూచుకుని నీవు సంతోషపడే విధము చూస్తే, నీ మీద నాకు ఎంతేనా జాలి కల్గుతూంది. నీ వెప్పుడూ సుఖమనుభవించినట్లుగ కనబడుచున్నావు; జీవితం పూర్తిగ, నీ కొక అలవాటైపోయింది — మరి నీకవిత్వం ఒక ఔషధం! కవీ, నాసుట్టుకు — ఎప్పుడూ చనిపోతూనవాణ్ణి నా కెప్పటికీ పునర్జన్మవుండదు! కాని జ్ఞాపక ముంచుకో, నే నమరుణ్ణి!

కవి:- నా వాక్యాలు విలుస్తాయి - మరి వాటిద్వారా నేను!

కూలివాడు:- గతించిన మానవ ప్రమత్త స్వప్నముల స్మృతి చిహ్నములుగా నీ పద్యాలు నిలుస్తాయి. కాని, నేనుమాత్రం బ్రతికిఉంటాను —ఒకే భావన కవిగా—ఒకే లోతైన, విస్తరమైన భావముతో — మేఘాలనుగూర్చి, చంద్రకిరణాలను గూర్చి, నెమళ్లనుగూర్చి వ్రాసిన కవిత్వం కంటె మహత్తరమైనది — ఒక్కటే, భావన కత్తిమొన్నరుగ పదునైనది. కన్నీటి బొట్టువలె స్వచ్ఛమైనది! ప్రజాస్వామిక విరంకుశత్వం! హ్హా! హ్హా! హ్హా!

(గంట ఐదు గంటలు కొడుతుంది)

కవి:- ఒక గంట తరువాయి — తర్వాత — పారిపోయే ప్రత్యూషం — అంతిమది.

కూలివాడు:- అరుణోదయము! ఎన్నో అరుణోదయములలో ప్రథమముది!

వర్తకుడు:- అవి నాట్యకత్తెల గజ్జెల మ్రోతలా! అహో! అద్భుతం! రేపునాకొడుకును వర్తకుని రాకుమార్తెకిచ్చి పెండ్లి చేయాలి—నా జీవితమంతా దారపోసి నేనుసహాయముచేసిన రాజును ఆహ్వానించాలి— బంగారము సంచులతో నిచ్చాను—అతను నాకొక బిరుదు నొసగాడు. మరి ఇప్పుడు ఇంకొకటి ఇస్తాడు రేపు మరొకటి—అట్లాగ ఎన్నో ఇస్తాడు.

కవి:- కామ్రేడ్, మృత్యువంటే, మనం, భయపడకుండగ ఉండటం ఆశ్చర్యంగాలేదూ! మరణశిక్ష విధించిన దినంనుండి నాలో ఏదో మృతినొందింది! కాని, ఆ భావనకు ఎంత అలవాటు పడ్డానంటే, నాలో అది ఉత్సుకత కల్గిస్తూంది—ఒకవేళ దానినిగూర్చి వ్రాయవలసివస్తే ఎంతేనా ఉండేదనుకుంటా.

కూలివాడు:- నీకలా, ఒక సాధువైన ప్రభుత్వత కల్గిఉన్నది (మళ్ళా, కావలివాని తుపాకీ మీటిన శబ్దమవుతుంది— నిశ్శబ్దత—కావలివాడు ప్రక్కనుండి పోతాడు).

వర్తకుడు:- (కేకలిడుతూ పాడుతాడు), ఆ! ఓ కావలివాడా! రేపటి వివాహానికి గుడారము, ఎలక్ట్రిక్ దీపాల సంగతేమిటి! కలల్లలాగ ఉండాలి సుమా దీపాలు—ఎర్రగ, నీలరంగ తెల్లగ ఇకతలికి పొడిచుకొనివస్తూ! ప్రత్యేకమైన ముగ్గురు నాట్యకత్తెలను, ఇద్దరు పాటకులనూ వచ్చేటందుకు, కలకత్తాకు తంతి పంపించాలినీవు! పది మద్దెలలు నాల్గు సితారులు మరి పూలదండలమాట మరచిపోకుమీ—బాబూ—దండలు.

కవి:- కామ్రేడ్స్! ఎందుచేత మీకండ్లు అట్లా అలిసిపోయినాయి!

కూలివాడు:- శూన్యంలోకి చూచుటచేత—అక్కడ నాకామ్రేడ్స్ చూసేదే నేను చూస్తాను బ్రహ్మాండమైన సమరం — అంతిమసమరం — తర్వాత (బాకా ఊదిన శబ్దము)

వర్తకుడు:- పెండ్లికూతురుకోసమై పెండ్లికొడుకు సంసిద్ధుడగు చున్నాడు. వారెంత నవయవ్వనులు! ఆమె ఎంత సిగ్గుపడుతూంది! ఆచిన్నిపెండ్లికూతురు పడ్డా పొడుగూగల ఆమెను కొంతమట్టుకు సగము నగ్నతలోను, క్రిందకు వ్రేలాడుతూన్న పొడుగాటి జడలోను చూడగల్గుచున్నా. ఆమె ఒక్క పలుకైనా పలుకదు. పెండ్లికొడుకును కౌగిలించుకొనుటకై చేచియున్నా ఆమె నుదిటిమీద పెద్ద ఎ....ర్రని బొట్టున్నది. రక్తంలాగ—రక్తం మాదిరిగ—ఓ పెండ్లికూతురా! ఎవరునీవు— ఎవరెవునీవు! ఉరికంబము— ఉరికంబము! త్రాళ్ళు! త్రాళ్ళు! రక్తం, రక్తం! పొండి! అవతలికిపో! నీవంటే నాకిష్టంలేదు! నాకోడలుగ నిన్ను తీసికొనను. నాభార్యగాకూడ నిన్ను తీసికోను—(నవ్వును).

కవి:- కామ్రేడ్! నావెర్రి కామ్రేడ్! శాంతించు త్వరలోనే అధికాస్తా అయిపోతుంది. ఓ జీవితమా! ఎంత గాఢంగా నిన్ను ప్రేమించాను— ఎట్లాగ నిన్ను నాకలలతోను ఉత్సాహముతోను, బాధలతోను, ప్రేమతోను, కోర్కెలతోను, ఆశలతోను, ఉద్రేకముతోను, నాధమంతోను, నింపాను! ఎన్నిసార్లు నీతో కయ్యానికి కాలు తవ్వుచుండేవాణ్ణి! నాప్రాణమా! కాని ఎన్నిసార్లు మనం మంచిగా మైత్రి మరల నిల్పుకునేవాళ్ళము నాజీవితాధారమా!జ్ఞాపకముంచుకో నేనుమాత్రము నిన్నెడ బాయటములేదు—నీవే నన్ను విడిచి పెడతున్నావు—నన్ను—ఎంతో చిన్నవాణ్ణి — యువకుణ్ణి—ఓ పరమేశ్వరా! ఇది నీఇచ్ఛయేనా!

కూలివాడు:- కాదు! స్వామిగా కాక సేవకునిగ భగవంతుని నియమించిన ప్రభుత్వపు ఇచ్ఛ! అవును. నేననేది, పరమేశ్వరుని నియమించింది, తన అవసరము గడుపుకోటానికే కాని, నీ,నా అవసరములు తీర్చటానికి మాత్రము కాదు! వెర్రికవీ! జీవితమంతా నిన్ను నోరు ఎత్తనివ్వకుండగ చేయుటానికి, —వివిధరూపకములైన వాటిని నీపైవైనతోసి నిన్ను మూర్ఖుణ్ణి చేసింది—వెర్రివాడా!

కవి:- ఇప్పటికైనా దేముడున్నాడని ఒప్పుకొనవా!

కూలివాడు:- గుండె నిబ్బరం లేని మనిషి సానుభూతి కొరకై పిలుచుకునే దేముణ్ణి అసలు ఉన్నట్టుగ ఒప్పుకొనను నా దివ్వేనా ద్వేషం! నా మిత్రమా, ఒకవేళ ఖర్మంచాలక పరిణామ శాస్త్ర ప్రకారం, నీవే పునర్జన్మ ఎత్తినట్లయితే, నీవు శాస్త్ర (మిగతా 18వ పేజీలో)

★ సోవియట్ రెడ్ ఆర్మీ ★

కామ్రేడ్ కొంపాటి పట్టాభిరామయ్య.

"దోపిడీగాళ్ల అధికారాన్ని తిరిగి లేవనీయకుండా చేయాలంటే, పాటక ప్రజలచేతుల్లోనే రాజ్యాధికారము స్థిరముగా ఉంచాలి అంటే, పనిచేసే ప్రతివానిచేతా ఆయుధాన్ని ధరింపచేయాలి. కార్మిక, కర్షకుల సైన్యాన్ని ఏర్పరచాలి. ధనికవర్గాన్ని పూర్తిగా నిరాయుధుల్ని చెయ్యాలి" అని 'లెనిన్' సోవియట్ సైనిక నిర్మాణాన్ని గురించి చెప్పిన మాటలు ప్రతిసోవియట్ యువకుని రక్తమాంసాల్లోనూ ప్రతిధ్వనిస్తున్నాయి.

రష్యాలో గత 21 సం॥ల నుంచీ, లక్షలకొద్దీ యువకులు, సోవియట్ సైనికవిధానంలో శిక్షణ పొందేరు. అద్భుత చాతుర్యంగల యుద్ధవీరులుగా తయారయ్యేరు. వైజ్ఞానికముగా ఎంతో ముందుకొచ్చేరు. సోవియట్ అధికారాన్ని స్థిరముగా నిలిపేందుకు తమ రక్తాన్ని, జీవితాన్ని అర్పించడానికి సోవియట్ యువకులు సంసిద్ధు లయ్యేరు.

సోవియట్ సైన్యము 'లెనిన్' 'స్టాలిన్'ల కృషిఫలితముగా ఎంతో పట్టుదలతోటీ, దీక్షతోటీ, పాటకపు వర్గపు క్షేమము కోసము ఏర్పడింది దేన్నీ కూడాలెక్కచెయ్యని 'వరోషిలోవ్' 'బడియోనీ' 'ఫ్రూన్సు' 'కిరోవ్' 'ఆర్డ్‌షోనికిడ్సే' మొదలయిన బోల్షివిక్ నాయకులు, వీరవతంసులయిన 'చాపయేవ్' పర్కొమెనకో 'స్కార్స్' 'లాసో' లతో కలసి విజయపరంపరలతో సోవియట్ సైన్యాన్ని ముందుకు నడిపించి ఆసామ్యవాద దేశం నుంచి ధనిక వర్గపు దొంగసైన్యాల్ని, దోచుకునేందుకు కలుగ చేసుకున్న టోపీదొంగ(?) సైన్యాల్ని తరిమివేశారు. జీవిత ముఖ్యావసరాలైనా లేని సమయాల్లో కూడా పోరాడేరు. ఎన్నో అపాయకరమైన పరిస్థితుల్లో, అనేక అగ్నిపరీక్షలకు నిలబడి యుద్ధము చేశారు. 'కాకేషియన్' యుద్ధ రంగమునుంచి 1919 సం॥ జనవరినెలలో 'ఆర్డ్‌షోనికిడ్సే' 'లెనిన్‌'కిచ్చిన తంతిలో యిలావుంది. "మాదగ్గర తుపాకి గుళ్లుగాని, తూటాలు గాని లేవు. మాదగ్గర ధనముకూడా లేదు. ఆరునెలల నుంచి, యెంతో కష్టముపైన అయిదేసి రూబుల్సుకి (రూబుల్. రు 1-9-0 లు) కొన్ని తూటాలు చొప్పున కొంటూ యుద్ధాన్ని సాగిస్తున్నాం. వ్లాడిమిర్ యిలిచ్! (లెనిన్ అసలు పేరు) మేము యిలా చెప్పుతున్నామంతే యింకోలా అర్థం చేసుకోవద్దు. ఈ హెమ్మతగ్గుల ఆయుధబలముతో, పోరాడడం సామాన్య విషయముకాదు. అయినా గాని యుద్ధరంగములో మేము చావనైనా చస్తాంగాని, వెనక్కి పరుగెట్టి మనగౌరవాన్ని పాడుచెయ్యము. 'గాస్నీ' లోనూ, "వ్లాడికావకాస్' లోనూ, పనివారు ఎంతయినా పోరాడతామనే అంటున్నారు కాని వెనుకంజేమో వెయ్యరు. కొండజాతులన్నీ మన పక్షాన్నే ఉన్నాయి. ప్రియమైన వ్లాడిమీర్ యిలిచ్! మేము మృత్యుముఖ సమీపంలో ఉన్నాం. అయినా మా జేజేలు అంద జేస్తున్నాం. సహాయాని కెదురు చూస్తున్నాం."

సోవియట్ అధికారము అమలులో కొచ్చిన మొదటి నెలల్లో రష్యన్ ధనిక వర్గము సైన్యంతో కలుగ జేసుకొని, సోవియట్ అధికారాన్ని నాశనము చెయ్యడానికి యుద్ధానికి దిగినప్పుడూ, గొప్ప బందిపోటుగాళ్లయిన జపాన్ సైన్యాధికారులు సోవియట్ ప్రదేశాన్ని దొంగిలించే ప్రయత్నంలో, 1938 సం॥ అగస్టునెలలో 'కస్సాన్ సరస్సు' దగ్గర పోరాటానికి దిగినప్పుడు సోవియట్ సైనికులు ప్రథమ శ్రేణిలో ముందంజవేసి పోరాడేరు. అన్ని యుద్ధరంగాలోనూ బోల్షివిక్కులు విజయం పొందేరు. జయము పొందితీరుతామనే ధైర్యమూ, శ్రామిక విప్లవమందలి దీక్ష, వాళ్లలో అంతులేకుండా యుండబట్టే యిన్ని యుద్ధరంగాల్లోనూ జయం పొందేరు. తమ దేశముతో కలుగజేసుకున్న 14 పెట్టుబడిదారీ దేశాల సైన్యాల్నీ, తమ శతృవర్గములో చేరిన స్వదేశ ధనికవర్గములోని సైన్యాల్నీ, సోవియట్ సైన్యం చివరకంటా వోడించి, అద్భుతమైన విజయ పరంపరలు పొందిందంటే, దానికి మూలకారణం, కష్టపడుతూన్న కార్మిక కర్షక వర్గాలు, తమకోసమూ, తమ వర్గక్షేమం కోసమూ, తమ స్వదేశం యొక్క సేచ్ఛా స్వాతంత్ర్యాల కోసమూ, పోరాడేయి.

సోవియట్ సైన్యంలో పని చెయ్యడం ప్రతిసోవియట్ యువకుడు తన కర్తవ్యంగాను, గౌరవంగాను భావిస్తాడు. స్టాలినిస్టు రాజ్యాంగ ప్రణాళికలోకూడా యిలాగే ప్రకటించ బడింది. సైనిక శిక్షణ 19 సం॥ తో ప్రారంభమయి, సాధారణంగా రెండు సంవత్సరాలదాకా ఉంటుంది. ఎప్పుడైనా అవసరంవచ్చి 'రిక్రూట్సు'ని పిలిస్తే అది వాళ్ళకి నిజంగా గొప్ప పండుగ. వాళ్ళ కుటుంబంలో వాడు సోవియట్ సైన్యంలో చేరుతున్నాడంటే, అతని తల్లిదండ్రులకీ, సోదరీ సోదరులకు ఎంతో గౌరవం. అందుకై ఆకుటుంబమంతా గర్వపడతారు. చాలా పెట్టుబడిదారీ దేశాల్లోనూ, ఫేసిస్టు దేశాల్లోనూ సైనిక శిక్షణ యువకుల్ని పాడల గొడుతుంది. వ్యక్తి స్వాతంత్ర్యనిరోధనమూ, తన క్షేమానికి, తన శ్రేయస్సుకి కాని కార్యాల్లో తమ ప్రాణాల్ని పోగొట్టుకోవడమూ, యివి ఆదేశాల సైనికుల జీవితాల్ని పెద్ద నరకంగా మార్చి వేస్తాయి.

కాని సోవియట్ సైనిక విధానలో సైనికుని వ్యక్తి స్వాతంత్ర్యం యేమాత్రం అణచివేయబడదు. సైనికుడు తన మానవత్వాన్ని నశింపు చేసుకోనక్కరలేదు. అంతేగాకుండా సైనికుడు బాగా అభివృద్ధి పొందేందుకు అనేక అవకాశాలున్నాయి. ఈవిధానం సైనికునికి అనేక విషయాలు చెప్పే విద్యాలయం. ప్రపంచానికల్లా మొదటి సోషలిస్టు దేశం అయిన తన దేశాన్ని రక్షించు కొనేందుకూ, తన జీవితానికి కావలసిన జ్ఞానాన్ని పొందేందుకూ సోవియట్ సైనిక శిబిరంలో అనేక అవకాశా లీయబడతాయి. నిజానికి యీశిబిరాలు సైనికులకు గొప్ప విశ్వ విద్యాలయాలు. సైనిక శిబిరాలకు, 'బేరక్సు'కు గొప్ప గొప్ప శాస్త్రజ్ఞులూ, ప్రొఫెసర్లు అతిథులుగా వస్తూ అనేక విషయాలమీద ఉపన్యాసాలిస్తారు. భూమిమీద జీవంయొక్క పరిణామమూ, ఫాసిస్టు రాజ్యాల్లో జాతివాద ప్రచారము, సూర్య గ్రహణానికి కారణాలూ యిల్లాంటి విషయాలుమీద సైనికులకు ఉపన్యాసాలిస్తారు.

రైతుబిడ్డగాని, కూలీబిడ్డగాని సైనిక శిక్షణ పొంది బయటికి రావడంతోటే అతనిలో గొప్ప మార్పు కనబడుతుంది. సైన్యంలో పనిచేసినందువల్ల, ఆ విధానం, అతన్ని ఒక క్రొత్త మానవునిగా మార్చివేస్తుంది. రాజకీయ జ్ఞానంతో, వైజ్ఞానిక శిక్షణతో, పరిపూర్ణ వికాసాన్ని పొందుతాడు సోవియట్ సైనికుడు. ఈ విజ్ఞానాన్ని అభివృద్ధి చెయ్యడానికి సోవియట్ సైన్యంలో రాజకీయ వేత్తలుంటారు. ఈ తర్ఫీదును గురించి రక్షణ విధానంయొక్క 'పీపిల్సు కమిస్సార్' అయిన 'వరోషిలోవ్' సోవియట్ సైన్యంయొక్క 20 వ వార్షికోత్సవ సందర్భములో యిలా చెప్పేడు "సోవియట్ సైనికుడు మంచి తర్ఫీదు పొందినందువల్ల, జ్ఞాన శిక్షణ పొందిన పనివాడుగనూ, తన దేశపు సోషలిస్టు విధాన నిర్మాతగనూ, మానవ సౌభాగ్య కర్తగనూ, తయారయి బయటికొస్తున్నాడు."

దేశంలో నాలుగు మూలలా అల్లుకు పోయిన పఠన మందిరాలూ, యివన్నీ, సోవియట్ సైనికుడు వ్యక్తిగతంగా అభివృద్ధి పొందేందుకు ఎక్కువగా సహాయ పడుతూన్నవి. సోవియట్ సైనిక శిబిరాల్లో సైనికులకనీ, సైన్యాధికారులకనీ వేరు వేరు అంతరువులలో భోజన శాలలుగాని, బసలలుగాని లేవు. ఇవి సైనికులకూ, అధికారులకూ ఎల్లాంటి అడ్డంకులూ అంతరువులూలేని విజ్ఞాన కేంద్రములు.

సోవియట్ సైనిక విధానంలో సైనికునికీ, సైన్యాధిపతికీ మధ్య పెద్ద అఘాత లేవీలేవు. సైన్యాధికారులు, సైనికులూ వొకే వొక వర్గానికి చెందిన సోదరులు. ఒకేఒక కుటుంబానికి చెందిన వాళ్ళలా, ఉంటారు. వీళ్ళంతా వాళ్ళ కందరికీ ప్రధానమైన వొకేవక కార్యంకోసం, అంటే సోషలిస్టు సమాజ నిర్మాణం కోసం, పనిచేసే సోదరులు. సోవియట్ సైనిక విధానం యెంతోత్యాగాన్ని శిక్షణ కోరుకుంది. కాని అదినిరాడంబరంగా యుంటుంది. పనినుంచి బయటికొచ్చిన తరువాత సైనికులు, సైన్యాధికారులూ సమానమైన సమాజ స్వేచ్ఛని అనుభవిస్తారు. ఇద్దరిలోను మానవత్వం నశించిపోదు. సమయం వచ్చినప్పుడు యిద్దరూ, కామ్రేడ్సులాగ పరస్పర సహాయానికి సిద్ధంగా యుంటారు. సోవియట్ పౌరులలాగే సోవియట్ సైనికునికికూడా సమస్త పౌరసత్వ హక్కులూ వుంటాయి

ఎన్నుకుందుకూ, ఎన్నుకో బడేందుకూ సోవియట్ సైనికుడికి హక్కుంది. 'సుప్రీమ్ సోవియట్'లోనూ, 'సోవియట్ యూనియన్'లోనూ, 'నేషనల్ రిపబ్లిక్సు'లోనూ సోవియట్ సైనికులచేత ఎన్నుకోబడ్డ ప్రతినిధులున్నారు. సంఘ నిర్మాణానికి, సమావేశాలు జరుపుకునేందుకు సైనికులకి పరిపూర్ణ హక్కులున్నవి. అతడు బహిరంగ పత్రికల్లోనూ, వార్తాపత్రికల్లోనూ వ్యాసాలు వ్రాస్తాడు. ఏవిధంగానూ ప్రజాహిత జీవనానికి సోవియట్ సైనికుడు దూరముగా ఉండడు.

సోవియట్ సైనిక విధానము యొక్క సైనికాజ్ఞల్లో ఒక్క తీవ్రి స్వభావము మాత్రమే కాకుండా మానవస్వభావము కూడా ఉంటుంది. తమ రాజ్యము మీదికి విరుచుకుపడే శత్రుసైన్యాన్ని సోవియట్ సైన్యం వోడించి నిర్మూలించాలి. కాని అలా విరుచుకుపడే ఫాసిస్టు రాజ్యాల సామాన్య ప్రజలను శతృవులుగా యేమాత్రము ఎంచకూడదు. ఆ ప్రజా సామాన్యంతో దగ్గర సంబంధము యేర్పరచుకునేందుకు ప్రయత్నించాలి. దౌర్జన్యముగా విరుచుకుపడే ఫాసిస్టు సైన్యాలతో విధిగా యుద్ధము చెయ్యాలి. యుద్ధ పిపాసులయిన యీ దోపిడీ ముఠాల్ని పూర్తిగా అంతం చేసే దాకా పోరాడాలి. సోవియట్ సైనికాజ్ఞలు యిలా యుంటాయి. (1) "జయము పొందడానికి ముందుగా శత్రురాజ్యాలలోని ప్రజానముదాయాన్నీ, కార్మిక కర్షకుల్నీ శ్రామిక విప్లవ పోరాటంలోకి ఆకర్షించాలి" (2) "ఖైదీ అయిన శత్రువుని ఎంతో ఆదరముగానూ, గౌరవముగానూ చూడాలి. ఖైదీ తన ప్రాణాన్ని రక్షించుకునే నిమిత్తం, సోవియట్ సైనికుడు, సర్వవిధాలా అతనికి సహాయం చెయ్యాలి. సోవియట్ సైనికులూ సైన్యాధికారులూ తమకు ఖైదీలయిన శతృవుల్ని, యుద్ధరంగానికి దూరముగా పంపి, వారికి విషవాయువులనుండి కాపాడుకునేందుకు రక్షణ కవచాలు యివ్వాలి."

సోవియట్ సైన్యం దౌర్జన్యంగా పరదేశాలమీదికి విరుచుకుపడదు. ఫాసిస్టు దేశాల్లో, దౌర్జన్యానికీ, దోపిడీ పద్ధతులకీ సైనికులు బలి అవుతూన్నట్టుగా సోవియట్ సైనికుడు ఏదుర్మార్గ విధానానికి బలి కానక్కరలేదు. శాంతి స్థాపనకే, సోవియట్ సైన్యంపాటు పడుతుంది. అంతేగాకుండా తాము సోషలిజంద్వారా పొందిన అభివృద్ధినీ, ఫలితాన్నీ రక్షించుకునేందుక్కు తమ శక్తినంతా వినియోగించేందుకు సోవియట్ సైనికులు తయారుగా ఉంటారు. సోవియట్ సైన్యం సాంకేతికంగా (Technically) ఎంతో శక్తివంతంగా తయారయి యుంది. దాన్ని గురించి 'వరోషిలోవ్' యిలా చెప్పాడు.

"లెనిన్, స్టాలిన్లు తలపెట్టిన ఘనకార్యమయిన సోషలిజం కోసం, పోరాడే 170 మిలియన్ల సైన్యాన్ని ముందుకు నడిపించుకుపోయే అగ్రగాములు (Vanguard) మన సోవియట్ సైనికులు" సైన్యమూ, ప్రజాసామాన్యము యివి వకదానికింకోటి వ్యతిరేకించే భిన్న భిన్న వర్గాలు కావు. ఈరెండూ ఒక కేంద్రీకృతమైన ఏకైకశక్తి.

సోవియట్ యువకులు సైన్యంలో పనిచేస్తున్నారంటే అదివాళ్ళ జీవితాల్లో వాళ్ళు కోరుకున్న ఆదర్శాల కోసం పని చెయ్యడం అన్నమాట.

"నాదేశాన్ని, సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్కుల యూనియన్నీ రక్షించేందుకూ, కార్మిక కర్షక ప్రభుత్వాజ్ఞల్ని స్వీకరించడానికి, ఎప్పుడూ సిద్ధంగా యుంటాను" అని ప్రతి సోవియట్ సైనికుడు ప్రమాణంచేస్తాడు. ఈప్రమాణమేమీ వాళ్ళ కర్థంకాని ఆచారం మట్టుకి కాదు. వాళ్ళక్షేమం కోసం, వాళ్ళు స్వభావికంగా నెరవేర్చే కార్యంయిది. వాళ్ళక్కు ఆనందాన్నీ, స్వేచ్ఛనీయిచ్చే పితృదేశంకోసం వాళ్లు యీప్రమాణాన్ని చేస్తారు.

23-2-1928 వ తేదీని మాస్కో సోవియట్ సమావేశంలో కామ్రేడ్ స్టాలిన్ సోవియట్ సైన్యాన్ని గురించి యిలా చెప్పేడు.

"మన సోవియట్ సైన్యం, విముక్తి పొందిన కార్మిక, కర్షక ప్రజకి చెందినది. ఈ సైన్యమే అక్టోబరు విప్లవాన్ని జయప్రదముగా సాగించింది. శ్రామిక నియంతృత్వాధి కారానికి అండగా నిలిచింది.

"ప్రపంచములో ఉండే సైనికదళాలన్నీ అవి యే వర్గాలతో కూడుకొని ఉన్నా, అవన్నీ పెట్టుబడిదారీ అధికారాన్ని నిలబెట్టేవే. రాజకీయముగా యీ సైన్యాలు తాటస్థ్యంగా ఉంటాయని ధనికవర్గం అబద్ధం చెపుతుంది. ధనికవర్గము రాజ్యము చేస్తుంటే దేశాల్లో సైనికుల కెట్టి రాజకీయ హక్కులులేవు. ధనిక ప్రభుత్వము యీ సైన్యాల్ని రాజకీయరంగానికి దూరముగా ఉంచుతుంది. అంత మాత్రముచేత యీ సైనిక దళాలు తాటస్థ్యముగా ఉంటాయి అని అర్థము చేసుకోవడము పొరపాటు. ధనిక వర్గము అధికారములో యుండే దేశాల్లో రాజకీయ పోరాటాల్లో కార్మిక వర్గాన్ని అణచి వేసేందుకు యీ సైనిక దళాలు ధనికవర్గానికి పనిముట్లుగా ఉపయోగపడతాయి. పెట్టుబడిదారీ దేశాల్లో సైన్యము శ్రామిక వర్గాన్ని అణచివేస్తూండడమూ పెట్టుబడిదార్లని బలపరుస్తుండడమూ మనం చూస్తూనే యున్నాము.

"మన సోవియట్ యూనియన్‌లో ప్రజలూ, సైనికులూ ఒకే ఒక కుటుంబములోని వారుగా కనబడతారు. ప్రపంచకములో, యేయితర దేశపు సైనికులకూ, ప్రజలకూ లేని అత్యంత దగ్గరసంబంధమూ, పరస్పర ప్రేమా, మన దేశపు సైనిక దళాలకీ ప్రజలకీ ఉంది. మన దేశములో ప్రతివ్యక్తి సోవియట్ సైన్యాన్ని ప్రేమిస్తాడు, గౌరవిస్తాడు, జాగ్రత్తగా చూస్తాడు. ఎందుకంటే ప్రపంచ చరిత్రలోకల్లా మొదటిసారిగా మన దేశములో కార్మిక కర్షకాలు తమ సైన్యాన్ని నిర్మించుకున్నారు. ఈ సైన్యం భూస్వాములకీ, పెట్టుబడిదార్లకీ కాకుండా ఒకప్పుడు బానిసత్వాన్నీ దారిద్ర్యాన్ని అనుభవించి యీనాడు విముక్తినీ, స్వేచ్ఛనీ పొందిన కార్మిక కర్షకుల రక్షణకోసము పాటుపడుతుంది. ఇందులోనే మన సైన్యంయొక్క బలము ఉంది. నిజంగా సైన్యాలకి వెనుక ప్రజాభిమానమూ, ప్రజాబలమూ ఉన్నట్లయితే అవి చాలా బలము కలవిగా ఉంటాయి. మంచి బలమైన ఆయుధసంపత్తీ, శిక్షణాకలిగి ఉన్నప్పటికీ, ప్రజాసామాన్యంలో ఆదరణాభిమానాలులేక పోవడము మూలన్నే, పెద్ద పెద్ద సైన్యాలు ముక్కముక్కలు క్రింద చితికిపోయాయి. మన సోవియట్ సైన్యానికి మాత్రమే, ప్రపంచములో యితర సైన్యాలికి లేని ప్రజాభిమానమూ, బలమూ ఉంది. అందువల్లే మన సైన్యం చాలా శక్తివంత మయింది.

"వెనుకటి కాలములో సైన్యాల్ని కొల్లగొట్టుకొనే ఉద్దేశాలతోనూ, పరదేశాలను దౌర్జన్యముగా ఆక్రమించుకొని, దోచుకొనే ఉద్దేశాలతోనూ తర్ఫీదుచేశారు. అందువల్లే అల్లా తర్ఫీదయిన సైన్యాలు వలసదేశాలని దోచుకునేవిగా యుంటున్నాయి. ఈవిధంగా తర్ఫీదు పొందడమనేదే యీ సైన్యాలయొక్క బలహీనత, ఇలాంటి సైన్యాలికీ, మన సోవియట్ సైన్యాలికీ ఎక్కడా పోలికలేదు. సోవియట్ యూనియన్‌లోని అన్నిసోషలిస్టు రిపబ్లిక్కుల స్వేచ్ఛాస్వాతంత్ర్యాల రక్షణకోసము, అణచివేయబడ్డ ప్రజాసామాన్యపు విముక్తికోసము, దేశంలో ప్రజాసామాన్యంలో సోదర భావము పెంపొందించేందుకూ, యీ భావాలతో మన సైనిక విధానానికి పునాదులు వేశాం. ఈభావాలే మన సైన్యంయొక్క స్వభావం, నిర్మాణము అయి ఉంది. అందువల్లనే విశాలమైన మనదేశములో ఉండే మిలియన్ల కొద్దీ ప్రజలయొక్క బలాన్నీ, ఆదరణాన్నీ ఎల్లాంటి క్లిష్టసమయాల్లో నయినా పొందగలమనే ధైర్యమూ, ఆశ, మన సోవియట్ సైనికులకి ఉంది.

"పెట్టుబడిదారీ దేశాల్లో సైనికులికి యితర దేశాల ప్రజలనీ, పాటక జనాన్నీ అసహ్యించుకునే విద్యనిస్తారు. ఎందుచేతంటే యితర దేశాలతో పోరాటము వచ్చినప్పుడు యీ సైన్యాల్ని గొర్రెల్లా ఉపయోగించుకోవచ్చు. ఇందులోనే పెట్టుబడిదారీ దేశాల సైనిక బలహీనత ఉంది. మన సైనిక విధానముయొక్క పునాదులు వీటికిభిన్నం. మన సోవియట్ సైనిక విధానము పుట్టుకతో, మన సైనికులకు యితర దేశాలంటేనూ, ఆదేశాల ప్రజాసామాన్యమంటేను గౌరవించే విద్యను బోధించి తయారు చేశారు. విదేశాల శ్రమ జీవుల్ని ప్రేమించేవారుగా మనవారు తయారయ్యే ప్రబోధాన్ని మన సైనికుల కియ్యబడింది. అంతర్జాతీయ భావములోను, ప్రపంచ శ్రమజీవులంతా ఒకటే అనే ఐక్యభావంలోనూ ముఖ్యముగా మనవారు తర్ఫీదుపొందేరు. అందువల్లనే మన సైన్యం ప్రపంచ శ్రమజీవుల స్వాతంత్ర్యంకోసం పోరాడుతుంది. ఇదే మన సోవియట్ సైన్యం యొక్క బ్రహ్మాండమైన బలం. ఏదేశపు ధనికవర్గమయినా సరే, మన దేశము మీదికి యుద్ధానికి దిగించా, యీసంగతిని తప్పకుండా ప్రపంచ ధనికవర్గము గ్రహిస్తుంది. ఎందువల్లనంటే మన సోవియట్ సైన్యానికి 'న్యూయార్కు' నుంచి 'షాంగే' వరకు 'లండను' నుంచి 'కలకత్తా' వరకు ప్రపంచములో ఎక్కడ బడితే అక్కడ లెక్కలేనంత మంది స్నేహితులున్నారు.

"ఇతర దేశాల సైనికుల్లాగాకుండా, మన సోవియట్ సైనికులికి ఎందుకు పోరాడుతున్నారో, ఆపోరాటము వారినెక్కడికి తీసుకుపోతుందో అవగాహన చేసుకునే నేర్పుఉంది. సైన్యము తాను ఎందుకు పోరాడుతుందో తెలుసుకున్నయితే చాలాబలముగా ఉంటుంది. ఇందుచేతే మన సోవియట్ సైన్యము ప్రపంచంలోని సైన్యాలన్నింటికంటె ఉత్కృష్ఠమయిందని, బలమయిందని అనిపించుకునేందుకు కావలసిన లక్షణాలన్నీ ఉన్నవి.

సోవియట్ సైన్యం వర్ధిల్లాలి.

గాంధీ — బోసు లేఖలు

[సుభాస్‌బాబు రాజీనామా ఇచ్చుటకు పూర్వం, గాంధి సుభాసుల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలలో ప్రధాన భాగాలను క్రింద ప్రకటించుతున్నాం.]

బోసుగారి జాబు

జీల్గోరా, మార్చి 25.

మహాత్మా!

ఈ వేళ నేను చేసిన ప్రకటనను మీరు చూచి ఉంటారని నా నమ్మకము. కాంగ్రెసులో ప్రతిష్టంభన కలిగించానని నన్ను కొందరు నిందించారు. వారి ప్రకటనలకు జవాబుగనే నా ప్రకటనను చేశాను.

ఇప్పుడు మనం తక్షణం పరిష్కరించవలసిన సమస్య వర్కింగుకమిటీసమస్య. వర్కింగుకమిటీ సమస్యను తృప్తికరంగా పరిష్కారం చేయగాలంటే ముందుగా మరికొన్ని పెద్ద సమస్యలను గురించి ఆలోచించాలి. కాని ఇప్పుడు మొదటి సమస్యను గురించే వ్రాస్తాను.

ఈ దిగువ విషయాలనుగురించి మీ అభిప్రాయాలను తెలియజేస్తే మీకు చాల కృతజ్ఞుణ్ణవుతాను:-

1. ఇప్పుడు వర్కింగుకమిటీలో ఎవరెవరు ఉండాలని మీ అభిప్రాయము? వర్కింగుకమిటీ సభ్యులందరూ ఒక్క పక్షానికిచెందినవారే అయి ఉండాలా? లేక కాంగ్రెసులోని వివిధపక్షాల ప్రతినిధులందరూ వర్కింగుకమిటీ సభ్యులుగ ఉండాలా? రెండవ పద్ధతిప్రకారం వర్కింగుకమిటీ కాంగ్రెసు మహాసంస్థ అంతటికి ప్రాతినిధ్యం ఇస్తుంది.

2. ఒక్క పక్షంవారే వర్కింగుకమిటీ సభ్యులుగా ఉండాలని ఇంకను మీ అభిప్రాయమయినయెడల-నావంటివారు, పటేలువంటివారు కలసి ఒకే కమిటీలో ఉండజాలరు. (వర్కింగు కమిటీ సభ్యులందరూ ఒక్కపక్షంవారే అయి ఉండాలన్న వాదనను నేను మొదటినుండి ప్రతిఘటిస్తున్నాను.)

3. వివిధ వర్గాలవారికందరికి వర్కింగు కమిటీలో ప్రాతినిధ్యం ఉండాలని మీరు ఒప్పుకున్నట్లయితే ఏ యే వర్గానికి ఎందరెందరు ప్రతినిధులుండాలి?

కాంగ్రెసులో రెండు ముఖ్యమయిన పక్షాలున్నాయని నా యభిప్రాయము. ఈ రెండూ ఇంచుమించు సరిసమానంగానే ఉన్నాయి. అధ్యక్ష ఎన్నికలో మాకు మెజారిటీ వచ్చింది. కాని త్రిపురిలో అంతా తాపమారయి మాకు మైనారిటీ వచ్చింది. త్రిపురిలో ఇలా జరగడానికి కాంగ్రెసు సోషలిస్టుల వైఖరే కారణము.సోషలిస్టులు తటస్థంగా ఉండకపోతే, ఎన్ని అవాంతరాలున్నప్పటికి మాకు మెజారిటీ వచ్చియుండేది. ఈ అవాంతరాలనుగురించి తర్వాత వ్రాస్తాను.

4. వర్కింగుకమిటీ సభ్యులలో నేను ఏడుగురి పేరులను, సర్దారుగారు ఏడుగురి పేరులను సూచిస్తే బాగుంటుందని నాఅభిప్రాయం.

5. నేనే అధ్యక్షునిగాఉండి సరిగా పని చేయాలంటే జనరల్ సెక్రటరీ (కార్యదర్శి)ని నేనే ఎన్నుకొనుట అవసరము.

6. కోశాధిపతిని సర్దారుపటేలుగారు ఎన్నుకొన వచ్చును.

పండిత పంతుగారి తీర్మానంలోని ముఖ్యమయిన రెండు గూఢాభిప్రాయాల్లో ఒకదానిని గురించి ఇపుడు చెపుతాను.

(మరొక జాబులో ఈ విషయాన్ని గురించి పూర్తిగా వ్రాస్తాను) మొదటి విషయం పంతుగారి తీర్మానం నాపైని విశ్వాసరాహిత్య తీర్మానమని మీ అభిప్రాయమా? నేను రాజీనామా నివ్వాలని మీరు సలహా ఇచ్చెదరా? ఈ తీర్మానానికి అనేకులు అనేక విధాలుగ అర్థాలు చెప్పారు. తీర్మానాన్ని బలపరచిన వారుకూడా తలకొక విధంగా అర్థం చెప్పారు. అందుచేతనే పై ప్రశ్నలను మిమ్మల్ని అడుగవలసి వచ్చింది.

రెండవవిషయం — పంతుగారి తీర్మానం ఆమోదింపబడింది.ఇప్పుడు అధ్యక్షునిస్థితిఏమిటి? కాంగ్రెసు నిబంధనావళిలో 15 వ నిబంధన ప్రకారం వర్కింగు కమిటీ నియామకం విషయంలో అధ్యక్షునికి కొన్ని హక్కులు ఉన్నాయి. ఈ నిబంధనలో ఇంతవరకు ఏలాంటి మార్పులు జరుగలేదు. అందుచేత అధ్యక్షునికి ఆ హక్కులు ఇప్పటికికూడ ఉన్నవన్నమాట.

ఇప్పుడే పంతుగారి తీర్మానం ప్రకారము మీ ఇష్టప్రకారం నేను వర్కింగు కమిటీని ఏర్పాటు చేయాలి. దీని పర్యవసానం ఏమిటి? నేను ఒకలెక్కలోనికి వస్తానా? మీ యిష్టం ప్రకారము వర్కింగుకమిటీ సభ్యులను మీరు నామినేటుచేస్తే, నేను వారిపేరులను ప్రకటించవలసినదేనా? అంతేనా నాపని? ఇలా చేయడం

> “కాంగ్రెసు యిపుడున్న స్థితిలో సత్యాగ్రహం చేయలేదు”
>
> — గాంధీజీ.

వల్ల కాంగ్రెసు నిబంధనావళిలోని 15 వ నిబంధనను సవరణ చేయకుండానే తుడిచివేసినట్లగును.

పంతుగారి తీర్మానంలోని పై అంశము చట్ట విరుద్ధమయినదని ఈ సందర్భములో నేను చెప్పవలసి ఉంది. నిజానికి పంతుగారి తీర్మానమే క్రమ విరుద్ధము. ఆ తీర్మానాన్ని చాల ఆలశ్యంగా నాకు అందజేశారు. స్వరాజ్య తీర్మానాన్ని గురించి శరత్ చంద్రబోసుగారు ప్రతిపాదించిన సవరణ తీర్మానాన్ని మౌలానా ఆజద్‌గారు త్రోసివేసినట్లు పంతుగారి తీర్మానాన్ని పూర్తిగ త్రోసివేయడానికి నాకుహక్కు ఉన్నది. పంతుగారి తీర్మానాన్ని ప్రతిపాదించడానికి అనుమతి నిచ్చినప్పటికి, కాంగ్రెసు నియమావళినిబట్టి ఆలోచిస్తే తీర్మానంలోని కడపటి నిబంధనను (వర్కింగు కమిటీ నిర్మాణానికి సంబంధించినవి) నేను త్రోసివేసియుందును. ఈకడపటి నిబంధన కాంగ్రెసు నియమావళిలోని 15 వ నిబంధనకు విరుద్ధంగా ఉంది.

కాని, నేను స్వభావసిద్ధంగా ప్రజాస్వామ్యవాదిని. అందుచేత నేను శాస్త్రసంబంధమయిన లోటుపాటులను పట్టుకొని ప్రాకులాడను. పైగా ఈతీర్మానాన్ని ఓటుకు విడిచే నాకు వ్యతిరేకముగా ఓటు జరిగే అవకాశము ఉన్నప్పుడు శాస్త్రరీత్యా ఆక్షేపణ తెలుపుట మగతనము కాదనుకున్నాను.

ఈ జాబును ముగించేముందు మరొకవిషయాన్ని గురించి వ్రాస్తాను. ఎన్ని అవాంతరాలు చిక్కులు కలిగినప్పటికి నేను ఇంకా అధ్యక్షునిగా ఉండాలంటే, నన్నెలా పనిచేయుమని సలహా ఇస్తారు?

నేను వట్టి కీలుబొమ్మ అధ్యక్షునిగా ఉండకూడదని, నిజమయిన అధ్యక్షునిగా ఉండి నాఅధికారాన్ని వినియోగించుట మీకు ఇష్టమని గడచిన సంవత్సరములో మీరు నాతో చాలా సార్లు చెప్పినట్లు నాకు జ్ఞాపకం ఫిబ్రవరి 15 వ తేదీని వార్ధాలో మిమ్మల్ని కలుసుకున్నాను. అప్పుడు నాకార్యక్రమాన్ని మీరు ఆమోదించలేదు. ఇక నాకు రెండే రెండుమార్గాలు లున్నాయని అప్పుడు మీతో చెప్పాను. రంగంనుండి తొలగిపోవుట ఒకమార్గం. రెండవది, త్రికరణశుద్ధిగా నమ్మినటువంటి ఆశయాలకోసం పోరాడుట. ఇవివిని మీరు నాకొకవిషయం బోధించారు. మీ అభిప్రాయాలను నా అంతట నేను అంగీకరించని పక్షంలో నేను రంగంను డి తొలగిపోవుట నన్ను నేనే అణగద్రొక్కుకొనుటతో సమానమని నాతో చెప్పినట్లు జ్ఞాపకము. ఆత్మనిరోధం అంటే మీకు ఇష్టంలేదని చెప్పారు. కీలుబొమ్మ అధ్యక్షునిగా ఉండవద్దని యిదు నాకు సలహా ఇచ్చారు. ఇప్పుడు కూడా ఇదే సలహా ఇస్తారా?

అధ్యక్ష ఎన్నికలు జరిగిన తరువాత, ముఖ్యంగా త్రిపురిలో అనేక విషయాలు జరిగాయి. ఇన్ని జరగినప్పటికి కాంగ్రెసులోని అన్నిపక్షాలవారు కలసి ఐకమత్యంతో పనిచేయడానికి ఇంకా వీలున్నదను నమ్మకంతోనే పై విషయాలన్నీ వ్రాశాను.

★ ★

మహాత్ముని జాబు

బెయినులో-బిర్లాగృహం అడ్రెసు,
న్యూఢిల్లీ, మార్చి 24.

ప్రియమైన సుభాస్:

క్రమంగా మీకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుచున్నదని ఆశిస్తున్నాను.

శరత్ బోసువ్రాసిన జాబుయొక్క ప్రతిని, దానికి నేను వ్రాసిన జవాబుయొక్క ప్రతిని ఈజాబుతో చేర్చి పంపుచున్నాను.

శరత్ బోసుగారి అభిప్రాయాలు మీ అభిప్రాయాలు ఒకటే అయినపక్షంలోనేనా సూచనలు ఆచరణయోగ్యములగును. ఏది ఎలా గున్నా కాంగ్రెసు మూలస్థానంలో కలిగిన అరాజకాన్ని తొలగించాలి.

కాంగ్రెసు ప్రతిష్టంభననుగురించి నా అభిప్రాయాన్ని తెలుపవలసిందని చాలమంది అడుగుతున్నారు. కాని మీకోరిక ననుసరించి నేనేమీ చెప్పడం లేదు.

పంతుగారి తీర్మానాన్ని నేను అలహాబాదులో నుంచాను. ఆ తీర్మానాన్ని చూడానికి అదే మొదటిసారి. అది స్పష్టంగానే ఉన్నదన్ని నాకు తోచింది. ఇక మీరే మొదట ఉపక్రమించాలి. జాతీయ కార్యక్రమానికి మీ ఆరోగ్యం ఎంత వరకు తగి యున్న దో నాకు తెలియదు. అమహాకార్యానికి తగినస్థితిలో మీరు లేనట్లయితే చట్టంప్రకారము మీరు అనుసరించగల మార్గం ఒకటే ఉన్నది. మీరు దానినే అనుసరించాలని నా అభి యము. మరికొన్నాళ్లు నేను ఢిల్లీలో ఉంటాని.

“ప్రేమతో బాపు.”

★

మహాత్ముని జవాబు

న్యూ ఢిల్లీ, మార్చి 3.

సుభాస్ బాబు:

పండిట్ పంతు తీర్మానం సక్రమంగా లేదని, వర్కింగు కమిటీగురించి దానిలో ఉన్నభాగం అధికార అతిక్రాంతమని మీరు భావిస్తున్నారు. అప్పుడు మీరు చేయవలసింది ఒక్కటే. మీ ఇష్టం వచ్చినవారిని కమిటీగా ఏర్పాటు చేయడమే.

కాబట్టి, మీరు వ్రాసిన సంగతులకు నేను ప్రత్యేకించి ఏమీ బదులు వ్రాయనక్కరలేదు.

ఫిబ్రవరిలో మనం కలుసుకొని మాట్లాడినప్పుడు ముఖ్య సూత్రాలలో అభిప్రాయ భేదం వుందని మనం అంగీకరించాము. అలాంటప్పుడు రెండుశాఖలు కలిసి కలగలుపు వర్కింగు కమిటీ ఉండడం చాల ప్రమాదకరమన్న అభిప్రాయం నాకు ఇప్పు డెక్కువగా ఉంది. మీకు ఏ. ఐ. సి. సి. లో సంఖ్యాబలం వున్నప్పుడు, మీ అభిప్రాయాను సారంగా ఉండే వారినే వర్కింగు కమిటీగా ఏర్పాటుచేయడం మంచిది.

అవును; నాకు ఫిబ్రవరిలో చెప్పినట్లు నాది ఒక్కటే ఉద్దేశం: మీ యంతట మీరు మానుకుంటే నాకు అభ్యంతరం లేదుగాని నావల్ల మీరు ఆత్మనిరోధం చేసుకోడానికి మాత్రం నేను అంగీకరించను. అది తప్పు. దేశానికి ఉపకరిస్తుందని మీరు బాగా నమ్మిన విషయం మానుకోవడం అన్నది నిజంగా ఆత్మరోధనమే అంటాను. కాబట్టి మీరు అధ్యక్షుడుగా ఉండాలంటే మీకు స్వేచ్ఛ ఉండాలిగాని చేతులు కట్టివేస్తే ఎట్లా? ప్రస్తుత పరిస్థితుల్లో మరేదీ మధ్యమార్గం లేదు.

గాంధేయుల (ఇది ఒక తప్పు పేరు) విషయము? వారు ఏ విధంగానూ మీకు అడ్డురారు. వీలయినప్పుడు సహకారం చేస్తారు. వీలు లేనప్పుడు ఊరుకుంటారు. వారే అల్ప సంఖ్యాకంగా ఉన్నట్టయితే, మరిమీకు ఎలాంటి చిక్కూ ఉండదుకదా? వారే అధిక సంఖ్యాకులుగా ఉంటే వారు తమ బలాల్ని చూపించక తప్పదుకదా?

నాకు మనస్సు బాధిస్తూ వున్నది ఒక్క విషయమే. ఈ కాంగ్రెసు నియోజక వర్గం అంతా పట్టిబూటకం. దానిలో అల్పసంఖ్య అధికసంఖ్య అనడంలో అర్థం లేదు. ఇది శుభ్రపడేవరకు, ఇప్పుడున్న సరుకుతోనే మనం వేగక తప్పదు.

మరొక సంగతికూడ నామనస్సు నొప్పిస్తుంది: మనలో మనకే విశ్వాసంలేదు. ఒకరియందు ఒకరికి నమ్మకం లేనప్పుడు కలిసి పని చేయడం అసాధ్యం.

ఇవితప్ప నేనుమీకు బదులు వ్రాయవలసిన విషయాలు ఏమీ లేవనుకుంటాను.

అన్నిటియందు మీకు భగవంతుడు సాయపడునుగాక. దాక్షిణ్యమాటవిని త్వరగా స్వస్థులు కండి! ఆశీస్సులు.

బాపు.

ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు ప్రకటింప వలసిన అవసరం నాకేమీ కనబడదు. కాదంటే మీరు ప్రచురించవచ్చును. నా అభ్యంతరంలేదు.

★

బోసు లేఖ

జీల్‌గోరా పి. ఓ., మనభూమిజిల్లా
బీహారు. మార్చి 31

ప్రియమైన మహాత్మాజీ,

నాజబ్బువల్ల రాజీనామా యివ్వవలసిన అగత్యము ఏమీ కనబడదు. సిన్న నేనువ్రాసిన లేఖలో (మీకువ్రాసిన రెండవలేఖ) ఏ మధ్యక్షతకుకూడ దీర్ఘకాలము జైలులో ఉన్నప్పటికికూడ రాజీనామా యియ్యలేదను సంగతి గురించి వ్రాశాను. ఏలాగైనా నేను రాజీనామా యియ్యక తప్పదేమో—అటువంటిది ఒకవేళ యియ్యవలసివస్తే, ఇతరకారణాలచేత అయి వుంటుంది.

నా రెండవలేఖలో ఒకసంగతి స్పష్టంగా వ్రాశాను అనుకొంటాను. నేను రాజీనామా చెయ్యాలని నామీద ఒత్తిడి కలిగిస్తూ వున్నప్పటికిన్నీ నేనెలాగో తట్టుకొంటూనే యున్నాను. నేను రాజీనామా యిస్తే కాంగ్రెసు రాజకీయాలలో క్రొత్తగొడవ ప్రారంభమవుతుంది అటువంటిది రానీయకుండా చేయాలని నా తలంపు. మన విధానాలు తెగుతెంపులు చేసికొంటే, ఇంకొక అంతఃకలహం ప్రారంభమవుతుంది దాని ఫలితమేమైనప్పటికిన్నీ కొంతకాలంవరకు కాంగ్రెసు దుర్బలం చెందక తప్పదు; దీనివల్ల బ్రిటిషు ప్రభుత్వం లాభం పొందుతారు.

మన దేశానికి కాంగ్రెసుకుకూడ ఇటువంటి విపత్తు రాకుండా కాపాడాలి అంటే అది మీ చేతులలోనే వున్నది. సర్దారు పటేలుగారి యెడల వారి బృందంయెడల కూడ తీవ్ర ప్రాతికూల్యం చూపేవారు మీయందు విశ్వాసం చూపుచున్నారు. మీరు నిష్పక్షపాతంగా, పార్టీ దృష్టి లేకుండా పరిశీలిస్తారన్ని వారి నమ్మకం. వారంతా మిమ్మల్ని జాతీయ మహాపురుషుడుగా పార్టీలకు, పక్షాలకు అతీతుడైన మహావ్యక్తిగా చూస్తున్నారు. కలహమాడుచున్న శక్తులలో ఐకమత్యము, సామరస్యము కూర్చగలశక్తి మీలోవున్నదన్ని వారు భావిస్తున్నారు. మరి యే కారణముచేతనైనా అటువంటి విశ్వాసం కొంచెం చెడింది అనుకొందము (భగవత్కృపవల్ల అటువంటిది రాకూడదు). మిమ్మల్ని పారియభిమానిగా చూస్తారనుకొందాము. అట్టి సందర్భములో కాంగ్రెసుకు మాకుకూడా శరణ్యం భగవంతుడే.

కాంగ్రెసులోని రెండు ముఖ్యపక్షాలకు చాలా పెద్ద చీలిక ఏర్పడిపోయినదనుటలో సందేహం ఏమీలేదు. అయినప్పటికీ యా చీలికలు తీసివేయ వచ్చును. అది మీ వల్లనే కావాలి. మా రాజకీయ ప్రతికక్షులమనస్తత్వము గూర్చి నేనేమీ చెప్పలేను. వారితో త్రిపురిలో చాల చెడ్డ అనుభవం కలిగింది. మా పక్షాన నేను మాటలాడగలను; మేము కార్పణ్యం పూని, కక్ష వహించేవాళ్లముగాము. మేము క్షమించి మఱచిపోవడానికి సిద్ధంగా ఉన్నాము—భారతదేశం యొక్క రాజకీయ ఆర్థిక విముక్తి కొరకు మళ్లి కలిసి కట్టుగా పనిచేయడానికి సిద్ధంగా వున్నాం.

పంతుగారి తీర్మానముగురించి నా యభిప్రాయమెట్టిదో మీరు సులభంగా ఊహించుకోగలరు నా వ్యక్తిగతాభిప్రాయాలతో నిమిత్తం లేదు. రాజకీయాలలో వ్యక్తిగతాభిప్రాయాల కంటే బహుజనాభిప్రాయాలకే ప్రాధాన్య మివ్వవలెను. నే సిదివరకొకసారి వ్రాసినట్లు కాంగ్రెసు నిబంధనలప్రకారం పంతుగారి తీర్మానము విషయమై ఎవరేమనుకొన్నను,కాంగ్రెసు దానిని ఆమోదించెను. కాబట్టి దానికి నేను బద్ధుడనై యుంటానని తెలియజేశాను.

ఆతీర్మానం నామీదల అవిశ్వాస ప్రకటనమని మీరు భావిస్తారా? దాని ఫలితముగ నేను రాజీనామా యియ్యాలంటారా? ఈ విషయమై మీ అభిప్రాయం నాకుచాల తోడ్పడుతుంది ఈతీర్మానంలో కొన్నిమార్పులుచేస్తే కాంగ్రెసు ఏకగ్రీవంగా ఆమోదించగలదన్ని నేను సూచించాను. సవరించిన తీర్మానభాగంకూడ పటేలుగారికి నేను పంపించాను. అయనమాత్రం దానికి ఏమీ చెప్పలేదు. వారు, తు, చ పోకుండ, తీర్మానం ఉన్నదున్నట్లు ప్యాసుకావాలి, అన్నారు. రాజకుమారి అమృతకౌరు సవరించిన తీర్మానంమీకు చూపి ఉంటుందనుకొంటాను. అధ్యక్షుని ఎన్నికక్షిద పగనే సాధించాలని వుంటే, ఈ సవరించిన తీర్మానం సరిపోదు.

పంతుగారి తీర్మానము, మీ సూత్రాలమీద నాయకత్వముమీద బోధకత్వముమీద విశ్వాసం తెలుపాలని ఉద్దేశిస్తే, అది సవరించిన తీర్మానములో ఉండనే వున్నది పగ సాధించాలంటే తీర్మానం సరిపోకపోవచ్చు. మీ పేరు ప్రతిష్ఠలు మాక్షిద కక్ష సాధించడానికి ఉపయోగించేరు. అందుచేత మీ ప్రతిష్ఠ హెచ్చుచేయడానికి బదులు వారు అత్యంత నీచంగా తయారుచేసేరు-త్రిపురిలో మీకు, మీయనుచరులకును పెద్ద మెజారిటీ ఉన్నప్పటికిన్నీ మీకు పెద్ద ప్రాతికూల్యమున్నదని ఇపుడు ప్రపంచాని కంతకు తేటపడింది.

పంతుగారి తీర్మానమునుగూర్చి నేనెట్లు భావించానో తెలుపుటకు మీకుచాల చెప్పాను అనుకొంటాను. మీరు ఎలాగు భావించేరో తెల్పితే చాల కృతజ్ఞుణ్ణి.

పంతుగారి తీర్మానం మీరు ఆమోదిస్తారా, లేక అది సవరించినప్రకారం ఏకగ్రీవామోదం పొందటానికి ఒప్పుకుంటారా?

మీ కార్యక్రమం

ఈ లేఖలో మరొక్క సంగతి చెప్పవలసియున్నది. అది మన కార్యక్రమం గురించి. వార్ధాలో ఫిబ్రవరి 15 వ తేదీని నా యభిప్రాయాలు మీకు తెలియజేశాను. అప్పటినుండి జరిగిన విషయాలన్నీ, నా విశ్వాసాన్ని మరింత దృఢపరచాయేమో! అంతర్జాతీయ పరిస్థితులు, మన వ్యవహారాలుకూడ ఈ కడచిన 8 నెలలలోను పరిశీలించి చూస్తే పూర్ణస్వరాజ్య సమస్యగూర్చి గట్టిగా పట్టుపట్టవలసిన సమయ మే తెంచినట్లు కనబడుతోంది. కాని మీరు నాతో ఏకీభవించలేదు. కాంగ్రెసులో దుర్నీతి అనేమాట మీకు బాగా పట్టిపోయింది. దౌర్జన్యమనే పీడ మిమ్మల్ని భయపెట్టుతుంది. కాంగ్రెసులో క్రుష్ట తొలగించాలనే దీక్షలో మీతో నేను ఏకీభవించినా, భారతదేశము మొత్తముపైద పరికించి చూస్తే మునుపున్నంత అవినీతి ఇపుడు లేదేమో! దౌర్జన్య విషయం తీసుకుంటే, మునుపు ఉన్నంత ఇపుడు లేదనాలి. ఇదివరకు బెంగాలు, పంజాబు, యు. పి. రాష్ట్రాలలో దౌర్జన్య విప్లవము కట్టుగా సాగింది? అప్పట ఇప్పుడు అహింసా తత్వమే ఎక్కువ కనిస్తూ వున్నది. మరికొన్ని కారణాలచేతను బ్రిటిషు ప్రభుత్వాన్ని కడసారి కోరిక కోరి ఏదో ఒకటి తేల్చుకోవడానికి ఇంతకంటె మంచి సమయము లేదేమో! ‘తుదిమాట’ అనే ఉద్దేశం మీకుగాని జవహర్లాలుగారికి గాని నచ్చినట్లు తోచదు. అయితే మీరు రాజకీయాలలో ప్రవేశించిన తరువాత అధికారులకు అనేక విషయాలు ‘కడపటి గడువు’ యిచ్చేరు. ఆ విధంగా ప్రజోద్యమానికి జయములు చేకూర్చేరు. రాజకోటలో కూడ మీరు అటువంటి పనే చేశారు. అందుచేత మనకోరిక, ‘తుది గడవు’గా చెప్పుటకు అభ్యంతర మెందుకు? మీరు అలాగుచేసి, రాబోయే యుద్ధానికి వెంటనే సిద్ధపడితే, మనం త్వరలోనే పూర్ణ స్వరాజ్యం సంపాదించగల మనుకొంటాను. బ్రిటిషు ప్రభుత్వము మనం కోరినదానికి పోటీలేకుండా ఒప్పుకొనియైనా తీరాలి లేక పోరాటం సంభవిస్తే ప్రస్తుత పరిస్థితుల్లో అది చాలాకాలం వుండదు. దీని విషయంలో నాకు చాలా ధైర్యము, ఉత్సాహము కనుపిస్తూనే వున్నది. మనం ధైర్యంపూని పనిచేస్తే 18 నెలలు దాటకుండా స్వరాజ్య రాగలదని నా పూర్తి నమ్మకం.

ఈ సందర్భములో ఎటువంటి త్యాగమైనా సరే చేయడానికి తగినంత తీవ్రత నాకు తోస్తూ వున్నది - మీరీ పోరాటం నడిపిస్తే, నా శక్తి కొలది మీకు సాయంచేస్తాను. కాంగ్రెసు, మరొక ప్రసిడెంటుతో అయితే సరిగా పోరాడగలదని తోస్తే నేను సంతోషంతో తప్పుకొంటాను. మీరు కోరిన వర్కింగు కమిటీతో కాంగ్రెసు మరింత పట్టుగా పోరాడగలదని తోస్తే, మీకోరిక ప్రకారము నేను ప చేస్తాను. నేను కోరేది ఏమిటంటే, మీరే ఈ క్లిష్ట పరిస్థితులలో స్వరాజ్యసమరం సాగించాలని కోరుతూ వున్నాను. నాయంతట నేను తొలగి పోవుట వల్ల జాతీయోద్యమమునకు బలం చేకూరుతుంది. అంటే, పూర్తిగానే మానడచుకొన్నానని మీకు వాగ్దానం చేస్తున్నాను. ఈమాత్రం చేయుటకు తగినంత దేశభక్తి నాయందున్నది.

మీ పద్ధతులు

క్షమించండి: మీరు సంస్థానప్రజల ఉద్యమము నడుపుతూవున్న పద్ధతి నాకేమీ నచ్చలేదు. అమూల్యమైన మీ ప్రాణాలను రాజకోట కోసం ఒడ్డేరు.రాజకోట ప్రజలకోసం పోరాడుతూ మిగతా అన్ని ఉద్యమాలను అపివేశారు, అలాగు ఎందుకు చెయ్యాలి? ఇండియాలో 600 సంస్థానాలపైగా వున్నవి. వాట్లల్లో రాజకోట ఒకటి. రాజకోటసమరం చేసుకాటా అంత చిన్నవిషయమని చెప్పుట అతిశయోక్తికాదు. దేశమంతటా ఒక్కసారి పోరాడి, దానికి ఒక నిర్దిష్ట కార్యక్రమం ఎందుకు ఏర్పరచకూడదు? మీ దేశీయులలో అనేకులు ఈ విధంగా అనుకొంటున్నారు; మీమీద ఉన్న వ్యక్తిగౌరవంవల్ల, వారు బహిరంగంగా చెప్పలేక పోయినా యిలాగే తలుస్తారు.

రాజకోట రాజీ షరతుల గూర్చి అస్మదాదులు చాలమంది అంత ఉత్సాహం చూపుట లేదనే సంగతి మీతో చెప్పవలసియున్నది. మేము, జాతీయ పత్రికలతో పాటు ఇది మహత్తర విజయ మని పొగడినాము. అయితే, మనకు వచ్చిన గెలుపు ఏమిటి? సర్ మారిస్ గ్వాయరు మనవాడు కాదు, స్వతంత్ర ప్రతినిధి అసలేకాడు.,ఆయిన ప్రభుత్వపు మనిషి. అటువంటివానిని తీర్పరి చేయుటలో అర్థమేమున్నది? పైగా సర్ మారిస్ గయరు మనము నిరాకరింపదలచిన ఫెడరలు స్కీముగో భాగము. బ్రిటిషు ప్రభుత్వముతో వచ్చిన తగాదా తీర్పు చెప్పడానికి హైకోర్టుజడ్జి లేక సెషన్సు జడ్జిని తీర్పరిగా చేస్తే, మనకు బ్రిటిషు ప్రభుత్వంతో రాజీలు చాల సులభములే, అటువంటి పరిష్కారాలవల్ల మనకు లాభమేమి? వైస్రాయిగారితో సంప్రదించినతర్వాత మీరు ఢిల్లీలో వేచియుండవలసిన దెందుకో చాలమందికి బోధపడలేదు. మీ ఆరోగ్యస్థితి, నిరసంబట్టి చూస్తే, మీదీర్ఘ ప్రయాణానికి బయలు దేరడానికి ముందుమీరు విశ్రాంతి తీసికోవలసింది. బ్రిటిషు ప్రభుత్వానికి, వారిపక్షమువారికి, మీరు ఫెడరలు ప్రధాన న్యాయమూర్తికి లేని ప్రాముఖ్యమిచ్చి వారి ప్రతిష్టను హెచ్చుచేస్తున్నారనే రీతిని తోస్తూవున్నది.

మీ ప్రియమైన
సుభాస్.

> “కాంగ్రెసులో కుళ్లుపోవాలంటే, పోరాటానికి తయారు కావాలి”
>
> — బోసు.

★

గాంధీగారి జవాబు

బిర్లాహవుస్, న్యూఢిల్లీ 2-4-39

ప్రియమైన సుభాస్,

మార్చి 31 వ తేదీని మీరువ్రాసిన లేఖ చేరింది. మీ అభిప్రాయాలు, నాయభిప్రాయాలు ఇతరుల అభిప్రాయాలు చుక్కెదురుగా ఉన్నవి. ఈ రెండూ కలపడాని వీలు ఏమీ లేదనుకొంటాను ఏ వాదానికి ఆ వాదంవారు తమ అభిప్రాయాలను కల్తీ లేకుండా దేశంమొదుట వివేదించాలి. ఇది సక్రమంగా జరిగితే, ద్వేషభావం రావడానికిగాని, తన్మూలంగా అంతఃకలహాలు పుట్టడానికిగాని తగిన కారణాలు కన్పించవు.

ఇప్పుడు మనకు వచ్చిన పేచులాట ఏమిటంటే, మనలోని అభిప్రాయ భేదాలు కావు మనలో మనకు పరస్పర గౌరవ విశ్వాసాలు పోవుటే ఈ చెడ్డకంతకు కారణమేమో! ఇది కాలక్రమేణా సర్దుబాటు కావచ్చును. మనలో సరియైన అహింసవుంటే అంతఃకలహాలుగాని ద్వేషభావముగాని ఉండ నగత్యం లేదు.

అన్ని విషయాలున్నూ పరిశీలిస్తే, మీరు వెంటనే మీ అభిప్రాయాలను ఆమోదించే మంత్రివర్గాన్ని ఏర్పాటుచాలని, మీ కార్యక్రమాన్ని స్పష్టంగా నిర్ణయించి వచ్చే ఏ. ఐ. సి. సి. సమావేశంలో ప్రతి (మిగతా 14 వ పేజీలో)

తల్లిదండ్రుల ఇష్టము లేకుండా శేఖరుడు లలితను వివాహం చేసుకోలేనిమాట నిజము; కాని గిరీనుని వివాహం చేసుకోపోవటానికి కారణమేమిటో లలిత వెల్లడిచేస్తే తను ఇంట్లోగానీ బయటగానీ ముఖం ఎలా చూపిస్తాడు?

౧౦

తల్లిదండ్రులను ఒప్పించటము అసంభవమని ఎంచి శేఖరుడు లలిత ఆశను పూర్తిగా త్యజించాడు. మొదట కొన్నాళ్లు భయపడేవాడు లలిత ఎప్పుడు వచ్చి కూర్చుంటుందో, ఏనిముషాన వెల్లడిస్తుందో, అంతటికి సంజాయిషీ యిస్తూ తిరగవలెనే! అని. కాని అతన్ని ఎవరూ ఏమీ అడగలేదు. అసలు, సంగతి వెల్లడయిందో లేదో కూడా తెలియలేదు. ఒకరి ఇంటికి ఒకరు రావటం పోవటం లేదు. శేఖరుని గదిముందు కాశీస్థలములోకి పోయి నిలబడితే గురుచరణుని మిద్దె అంతా కనపడుతుంది. ఒకవేళ లలిత కనపడుతుందేమో ననే భయంతో శేఖరుడు కొన్నాళ్లు గదిముందుకూడా నిలబడేవాడుకాడు. కాని ఒకమాసం నిర్విఘ్నంగా గడిచిపోయిన తర్వాత ఒక్క నిట్టూర్పువిడిచి:—"ఆడ నూరుకానీయి. ఆడపిల్లలకు సిగ్గు అనేది ఉంటుంది. వాళ్లు ఇలాంటి సంగతులు వెల్లడించలేరు" అనుకున్నాడు. హృదయము పగిలిపోతున్నా వారు నోరు తెరవరని ఇదివరకు విని ఉన్నాడు. ఇప్పుడది సత్యమని విశ్వసించాడు. వారి దేహంలో ఈమృదులత్వాన్ని ప్రసాదించి నందుకు సృష్టికర్త బుద్ధిని ప్రశంసించాడు. కాని అతనికి శాంతిలేదు. ఎందుకు? ఇక భయమేమీ లేదని తెలుసుకున్నప్పటినుంచి ఇదివరకు ఎన్నడూ లేనిబాధ హృదయంలో కలుగుతున్న దెందుకు? ఉండి ఉండి అతని హృదయాంతరాళము నిరాశతో, వేదనతో ఆశంకతో కంపిస్తున్న దెందుకు? అయితే, లలిత ఇక ఈసంగతి వెల్లడించదా? వివాహం అయ్యేటంతవరకూ మౌనంగా ఉంటుందా? ఆమెకు పెళ్లి అయింది, భర్త ఇంటికి కాపురం చేయడానికి పోయింది, అని తలచుకోగానే అతని లోపలా బయటా అగ్నిజ్వలిస్తున్న దెందుకు?

ఇదివరకు శేఖరుడు సాయంత్రం షికారుకు వెళ్లేవాడుకాడు. గదిముందు పచారుచేసేవాడు. ఇవ్వాళకూడా అలానే చేస్తున్నాడు. కాని ఒక్కనాడుకూడా ఆ ఇంటివారెవరూ మిద్దెమీద కనుపించలేదు. అన్నాకాళీ మాత్రం ఒకనాడు ఏదో పనిమీద పైకి వచ్చింది. కాని ఇతన్ని జూడగనే తలవంచుకున్నది. శేఖరుడు ఆపిల్లను పిలుద్దామా, వద్దా అని స్థిరపరచుకోకముందే త్వరున మాయమైంది. వారు వచ్చేదోవను, గోడ పెట్టి, బంధించటంలో ఉన్న అర్థం కాస్త జ్ఞానంలేని కాళీకూడా గ్రహించిందని శేఖరుడు తెలుసుకున్నాడు.

ఇంకోమాసం గడిచింది.

భువనేశ్వరి ఒకనాడు మాటలసందర్భములో - "ఈమధ్యని నువ్వెప్పుడైనా లలితను చూశావా శేఖర్?" అని అడిగింది.

"లేదు, ఎందుకు?"

"దాదాపు రెండుమాసాలకుగాను మొన్న మిద్దె మీదికి వస్తే పిలిచాను. పిల్లంతా ఏదోవిధంగా మారిపోయింది. జబ్బుపడ్డ దానికి మల్లే ముఖమంతా వాడిపోయింది. చూస్తే ఎంతో వయస్సు మిగిలిన దానిలాగా కనిపించిది. కాని ఎంత గంభీరత - దాన్ని చూసినవారు పద్నాలుగు సంవత్సరాల పిల్ల అని ఎవరు చెప్తారు?" - భువనేశ్వరి కళ్లలో నీరు తిరిగింది. చేత్తో కళ్లు తుడుచుకొని భారీస్వరంతో - "కట్టుకున్న గుడ్డలు మాసిపోయినై. ఇప్పుడు కమ్ముల చీరెలు కట్టుతూ ఉన్నది - నీకు గుడ్డలులేవా తల్లీ?" అని అడిగాను. 'ఉన్నవి' అని చెప్పింది. కాని నాకు నమ్మకం కలగలేదు. అది ఎప్పుడు కూడా వాళ్లమామ యిచ్చిన గుడ్డలు కట్టుకుని ఎరగదు. నేనే ఇస్తూ ఉండేదాన్ని. ఈ ఆరుమాసాలనుంచీ నేను ఒక్క పీలికకూడా ఇవ్వలేదు." ఇక ఆమె ఏమీ చెప్పలేకపోయింది. చెరగుతో కళ్లు తుడుచుకో నారంభించింది. ఆమెకు నిజముగా లలితమీద చాలా ప్రేమ.

శేఖరుడు మాట్లాడకుండా ఒకవైపుకు చూస్తూ కూర్చున్నాడు. కొంచెం సేపు ఉండి ఆమె మరల మొదలు పెట్టింది.

"నన్ను తప్ప ఏనాడూ ఎవ్వరినీ ఏమీ అడిగి ఎరగదు. వేళగాని వేళ ఆకలి అయినా ఆ ఇంట్లో ఎవ్వరినీ అడగదు. నన్నుకూడా అడగదు- నాచుట్టూ తిరుగుతూ ఉండేది. నేను దానిముఖంచూడగానే గ్రహించేదాన్ని. ఈసంగతే నాకు ఎప్పుడూ జ్ఞాపకం వస్తూ ఉంటుంది శేఖర్! ఇప్పుడుకూడా అలాగే ముఖం వ్రేలాడవేసుకొని తిరుగుతూ ఉండవచ్చు. కాని అదెవరూ కనిపెట్టరు, ఆఖరికి అడగనుకూడా అడగరు. లలిత నన్ను తల్లీ అని పిలవటమేకాదు, తల్లిని ప్రేమించినట్లుగా ప్రేమించేది!"

శేఖరుడు సాహసించి తల్లి ముఖమువంక చూడలేక పోయాడు. తాను చూస్తూ ఉన్న వైపునుంచి దృష్టిమరల్చకుండ "సరే, అమ్మా! దానికి ఏమి అవసరమో పిల్చి ఎందుకు అడగవు?" అని అన్నాడు.

"ఎందుకు తీసుకొంటుంది? వచ్చేపోయే దోవనుకూడ మీనాయన బంధించె! నేనుకూడా ఏముఖంతో ఇవ్వబోతాను? మరది కష్టంలో, ముందూవెనకా ఆలోచించకుండా ఏదో పొరపాటు చేశాడనుకో! దాన్ని మనం సవరించుకొని, మనవాళ్లకు చేసినట్లుగా ఏదో ప్రాయశ్చితం గీయశ్చిత్తము చేసి కమ్మివేయడములేదు. ఒక్కమాటే వేరుచేసి పారవేశాడు. అదికూడా నీరిపోరు పడలేకనే! ఎప్పుడూ వత్తిడి - ఒకేసు ఒత్తిడి! మనస్సులో ఏవగింపు కలిగిందంటే మానవుడు ఏపని చేయలేడు? అసలు మరది మంచిపనే చేశాడని నేనంటాను. మనకంటే ఆగిరీనే వాళ్లకు చాలా మేలొనర్చేవాడు. అతని కిచ్చి పెళ్లిచేస్తే లలిత సుఖపడుతుందని నేను పట్టిగా చెప్పగలను. వచ్చేమాసంలోనే పెళ్లి అవుతుందట."

శేఖరుడు చప్పున ముఖము త్రిప్పి - "వచ్చేమాసములోనే అవుతుందా?" అని ప్రశ్నించాడు.

"అలాగే విన్నాను."

శేఖరుడు ఇక ఏమీ అడగలేదు. తల్లి కొంచెంసేపుఉండి అన్నది.

"వాళ్లమామ వంట్లో ఏమీ బాగాలేదని మొన్న లలిత చెప్పింది. బాగా ఎలాఉంటుంది? అసలు వారికి మనశ్శాంతేలేదు. పైగా రోజు ఇంట్లో ఏడ్పులూ మొత్తుకోళ్లూ - ఒక్కనిముషము కూడా వారికి ఇంట్లో స్వస్థత ఉండదు!"

శేఖరుడు మాట్లాడకుండా వింటూ ఉన్నాడు. ఏమీ అడగలేదు. కొంచెముసేపు ఉండి తల్లి లేచిపోగానే అతను పక్కమీదకు వెళ్లి పండుకొని లలితను గురించి ఆలోచింప నారంభించాడు.

వీరి ఇంటిముందు గల్లీ చిన్నది. రెండుబళ్లు స్వేచ్ఛగా తప్పుకోవడానికి వీల్లేదు. ఒక బండి బాగా ప్రక్కకు వత్తి నిలబెట్టింది రెండోది పోవటానికి వీలుండదు. సుమారు పదిరోజులు గడిచినాక శేఖరుడుఆఫీసునుంచి బండిమీద వస్తున్నాడు. గురుచరణుని ఇంటిముందు ఇలాంటి ఆటంకమే రావటముచేత బండిఆగింది. శేఖరుడు బండిదిగి కనుక్కుంటే డాక్టరు వచ్చాడని తెలిసింది.

అతను కొన్నిరోజుల క్రిందట తల్లిదగ్గర గురుచరణుని వంట్లో బాగాలేదని విన్నాడు. అదే జ్ఞాపకమువచ్చి ఇంటికి పోకుండా గురుచరణుని ఇంట్లోకి వచ్చాడు.

విన్నసంగతి సత్యమే. గురుచరణుడు నిర్జీవివలె మంచముమీద పండుకొని ఉన్నాడు. లలితాగిరీనులు ఒక్క ప్రక్కన విచారముతో కూర్చుని ఉన్నారు. డాక్టరు ఎదురుగా కుర్చీలో కూర్చుని రోగాన్ని పరీక్షిస్తున్నాడు. గురుచరణుడు అస్ఫుటస్వరంతో "కూర్చో"మని అన్నాడు. లలిత నెత్తిమీదకు ఇంకా కాస్త ముసుగులాక్కొని ముఖం తిప్పుకు కూర్చున్నది.

డాక్టరు ఈపేటలోనివాడే. శేఖరుని ఎరుగును. రోగిని పరీక్షించి మందురాసి శేఖరునివెంట బెట్టుకొని బయటకు వచ్చి కూర్చున్నాడు. గిరీన్ వెనుకనేవచ్చి డాక్టరుకు డబ్బు ఇచ్చాడు. డాక్టరుపోయేముందు - "రోగము ఇంకా అసాధ్యస్థితిలో లేదు. ఈసమయములో గాలిమార్పు చాలా అవసరము" అని హెచ్చరించాడు. డాక్టరు వెళ్లిపోగానే ఉభయులూ ఒక్కమాటుగా గురుచరణుని గదిలోకి వచ్చారు.

లలిత గిరీనును చేతితో సైగచేసి పిలిచి, కొంచెము ఎడంగా తీసుకుపోయి మెల్లగా ఏదో ఆలోచన చేయనారంభించింది. శేఖరుడు డాక్టరు వదిలిపోయిన కుర్చీలో స్తబ్ధుడై కూర్చుని గురుచరణుని వంక చూడనారంభించాడు. గురుచరణుడు ఇంతకు ముందే గోడవైపుకు తిరిగి పండుకున్నాడు - శేఖరుడు మళ్లీ వచ్చింది ఎరగడు.

కొంచెముసేపు అలానే నిశ్శబ్దముగాకూర్చుని శేఖరుడులేచి బయలు

పరిణీత

శరశ్చంద్రచటర్జీ

వివిధం

దేరాడు. లలితాగిరీనులు యింకా మాట్లాడుతూనే ఉన్నారు. ఇతన్ని ఎవ్వరూ కూర్చోమనలేదు; మళ్లీవస్తావా అని అడగలేదు. అసలు పలకరించనే లేదు!

ఇవ్వాళ, లలిత తన్ను ఒక కఠినబాధ్యతనుంచి చిరవిముక్తునిచేసిందని శేఖరుడు గట్టిగా తెలుసుకున్నాడు. ఇక అనుమానంలేదు. తను నిర్భయంగా శ్వాసవిడవవచ్చును. లలిత ఇక తన్ను అంటిపెట్టుకోదు.

ఇంటికి వచ్చి దుస్తులు మారుస్తుంటే అతనికి అదే తలుపుకు వస్తున్నది. అక్కడ చూసిన సంగతులే జ్ఞాపకము వస్తున్నవి. గిరీనే వాళ్లకు పరమమిత్రుడు; అతనే వాళ్లందరికీ ఆధారము; అతనే లలితకు భవిష్యదాశ్రయముకూడా! తానేమీకాడు. ఇలాంటి ఆపత్సమయములో కూడా లలిత నోరు తెరచి తన్ను ఒక్కమాట అడగలేదు!

శేఖరుడు 'ఉఫ్' అని ఒక సోఫాలో కూలబడ్డాడు. లలిత తన్ను చూడగానే ముసుగువేసుకొని ముఖము త్రిప్పుకుంది. తాను పరాయివాడయినట్లు! అపరిచితుడయినట్లు! ఇటు తనకళ్లముందే గిరీన్ను చాటుకు పిలిచి ఎంత పరామర్శచేసింది! ఈవ్యక్తి వెంట నాటకము చూడటానికి పోతానంటే ఒకప్పుడు తాను పోనివ్వలేదు!

ఒకవేళ తనతో ఉన్న గుప్తసంబంధము జ్ఞాపకమువచ్చి, లలిత సిగ్గుతో ఆలా వ్యవహరించి ఉంటుంది, అని శేఖరుడు మనస్సును సరిపెట్టుకోవాలని చూశాడు. కాని అదెలా సంభవము? ఇంతకాండ జరిగినప్పుడు - ఒక్కమాటకూడా, ఇన్నాళ్లమధ్యని, తన్నడిగి తెలుసుకోవటానికి ప్రయత్నించిందా?

> "చక్రపాణి"
> ★ అనువాదం ★

వాకిటదగ్గర తల్లి కంఠస్వరము వినపడింది - "ఎక్కడనాయనా? - ఇంకా కాళ్లూ చేతులూ కడుక్కోలేదా - పొద్దుకూకింది!" అన్నది ఆశ్చర్యంతో.

శేఖరుడు తొట్రుపాటుతోలేచి కూర్చున్నాడు. తన ముఖము తల్లికి కనపడుతుందేమో ననేభయంతో పక్కకు త్రిప్పుకొని తొందరగా కిందకు దిగిపోయాడు.

ఇన్నాళ్లనుంచీ శేఖరుడు అనేకవిధాలుగా ఆలోచిస్తున్నాడు. కాని ఒక్క విషయం-తప్పు ఎవరిదనిమాత్రం అతను ఆలోచించలేదు. ఆశాపూరితమైన మాట ఒక్కటికూడా అతను లలితకు నేటివరకూ చెప్పలేదు. లేక చెప్పటానికి లలితకు అవకాశమివ్వలేదు. వెల్లడి అవుతుందేమో-దాన్ని ఏవిధంగానైనా కమ్మివేయాలి-అన్న భయంతో అతను కృంగిపోతున్నాడు. కాని అపరాధమంతా ఒక్క లలితమీదనేవేసి విచారణచేస్తున్నాడు. అతను కోపంతోనూ, ద్వేషంతోనూ, అవమానంతోనూ దగ్ధమైపోతున్నాడు. బహుశా ప్రపంచంలో ఉన్న పురుషులంతా ఇలాగే విచారణచేసి ఇలాగే దగ్ధమైపోతారనుకుంటాను.

ఇలా తపిస్తూ వారంరోజులు గడిపాడు. ఇవ్వాళ సాయంత్రం కూడా నిస్తబ్ధంగా తన్నగదిలో ఆ అగ్నినే రాజేసి కూర్చున్నాడు. అకస్మాత్తుగా వాకిలిదగ్గర అడుగులచప్పుడు విని తలఎత్తి చూచాడు. అతని హృదయం గంతువేసింది-కాళీ చేయిపట్టుకొని లలితగదిలోకి వచ్చి క్రింద తివాసీమీద కూర్చున్నది!

"శేఖరదా! మేమిద్దరమూ మీకునమస్కరించటానికివచ్చాము-రేపే మేము వెళ్ళిపోతాము!" అన్నది కాళీ.

శేఖరుడు మాట్లాడ లేకపోయాడు, చూస్తూ ఊరకున్నాడు.

"మీ పాదాలదగ్గర అనేక తప్పులుచేసి ఉంటాము శేఖరదా అవన్నీ మరచి పొండి!" అన్నది కాళీ మళ్లీ.

ఇందులో ఒక్కమాటకూడా కాళీదికాదనీ, చెప్పిన మాటలు వల్లిస్తున్నదనీ శేఖరుడు గ్రహించాడు."రేపు ఎక్కడికి పోతారు?" అని అడిగాడు.

"ముంగేరు. నాన్నను తీసుకొని మేమంతా గిరీన్‌గారింటికివెళ్తాము. అక్కడ నయమయినాకూడా మేమిక తిరిగిరాము. కలకత్తా గాలి నాన్నకు సరిపడదని డాక్టరు చెప్పాడు."

"ఇప్పుడు వారికెలా ఉంది?" అని శేఖరుడు అడిగాడు.

"కొంచెము నయమే." అని కాళీ చెరగుచాటునుంచి చీరెలు బయటకు తీసిచూపిస్తూ - "పెద్దమ్మ మాకివి కొనిచ్చింది." అన్నది.

లలిత ఇంతసేపూ మాట్లాడలేదు. ఇప్పుడు లేచి టేబిలుమీద తాళపుచెవి పెట్టి - "అల్మారీ తాళపుచెవి ఇన్నాళ్లనుంచీ నాదగ్గరే ఉన్నది" అని మందహాసముచేసి - "కాని, అందులో డబ్బేమీలేదు - అంతా ఖర్చయింది!" అన్నది.

శేఖరుడు మాట్లాడలేదు.

"పద, ఒదినా! ప్రొద్దుపోతూ ఉంది." అన్నదికాళీ.

లలిత సమాధానమేమీ ఇవ్వకముందే శేఖరుడు వ్యాకులపాటుతో - "కాళీ, క్రిందకుపోయి నాకు రెండు తమలపాకులు తెచ్చిపెట్టమ్మా!" అన్నాడు.

లలిత కాళీచెయ్యి గట్టిగా పట్టుకొని - 'నువ్వుకూర్చోకాళీ, నేను తెచ్చిస్తాను." అని గబగబా క్రిందకు వెళ్లిపోయింది. కొంచెము సేపటికి ఆకులుతెచ్చి కాళీకి ఇచ్చింది. కాళీ శేఖరునికిచ్చింది. శేఖరుడు ఆకులు చేతపట్టుకొని విస్తుపోయి కూర్చున్నాడు.

"పోతున్నాము, శేఖరదా!" అని కాళీ అతని కాళ్లదగ్గర కూర్చుని నమస్కారము చేసింది. లలిత తాను ఉన్నచోటనే కూర్చుని నమస్కారము చేసింది. తర్వాత ఇద్దరూ మెల్లగా బయటకు వెళ్లిపోయారు.

శేఖరుడు తన ఆత్మగౌరవమూ, మంచిచెడ్డలతో పాటు వెలవెలబోయిన ముఖముతో హతబుద్ధునివలె స్తబ్ధుడై కూర్చున్నాడు. లలిత వచ్చింది; చెప్పవలసిందేమో చెప్పింది; చిరకాలానికి సెలవుతీసుకొని, వెళ్లిపోయింది. కాని శేఖరుడేమీ మాట్లాడలేక పోయాడు. తాను చెప్పవలసిందేమీ లేదన్నట్టుగా, ఆపుణ్యకాలము కాస్తా వెళ్లబుచ్చాడు! లలిత కాళీని కోరి వెంటతెచ్చుకున్నది. ఈపరిసంగము మరల రావటము ఆమెకు ఇష్టము లేదనికూడా శేఖరుడు గ్రహించాడు. అతని శరీరమంతా జ్వలించిపోయింది. తలతిరుగుచు న్నట్లయింది. లేచి మంచమీదకు పోయిపండుకున్నాడు.

౧౧

గురుచరణుని అస్వస్థత. శరీరము ముంగేరు జలవాయువులకు కూడా మరల స్వస్థతచెందలేదు. కొంతకాలం జీవన్మృతునివలె గడపి, తన దుఃఖభారాన్ని దించి గురుచరణుడు ఈ లోకంనుంచి వెళ్లిపోయాడు. గిరీనుడు నిజంగా వీరిని చాలా ప్రేమించాడు. మృత్యువుడియవరకు తన శక్తికొలది ప్రయత్నించి చూసాడు.

చనిపోయే ముందు గురుచరణుడు గిరీనుచేయి పట్టుకొని గద్గద కంఠంతో ఈస్నేహ బంధనము ఇంతటితో తెంపవద్దనీ, దీన్ని చుట్టరికం క్రింద మార్చమనీ కోరాడు. తనజబ్బే ఈశుభకార్యానికి విఘ్నమయిందనీ, తావిదికంటితో ఇక్కడ చూడలేక పోయినప్పటికీ పరలోకంలో ఉండైనా చూచేటట్టు చేయవలసినదని ప్రార్థించాడు. గిరీనుడు సంతోషముతో మనస్ఫూర్తిగా వాగ్దానం చేశాడు.

కలకత్తాలోని గురుచరణుని ఇల్లు యిప్పుడు అద్దెకు యిచ్చిఉన్నది. అందులోఉన్న అద్దెవాళ్ళను అడిగి భువనేశ్వరి మధ్యమధ్య ముంగేరు సంగతులు తెలుసుకుంటూ ఉండేది. గురుచరణుని మరణ వార్తకూడా ఆమెకు తెలిసింది.

తర్వాత కొంత కాలానికి ఈయింట్లోకూడా గొప్ప దుర్ఘటన ఒకటి జరిగింది. నవీనరాయి హఠాత్తుగా చనిపోయాడు. భువనేశ్వరి ఈ దుఃఖాన్ని సహింపలేక పోయింది. పిచ్చిదానిలాగా అయిపోతుంది. సంసారం అప్పగించి కాశీ వెళ్ళిపోయింది. వచ్చే సంవత్సరం, శేఖరుని వివాహం స్థిరపడగానే వచ్చి వివాహంచేసి పోతానని చెప్పి పోయింది.

సంబంధం నవీనరాయే స్థిరపరచి పోయాడు. అసలు యింతకు పూర్వమే వివాహము జరగవలసింది. వీరి మృత్యువుమూలాన్నే ఒక్క సంవత్సరం ఆగిపోయింది.పిల్ల తరఫువారు ఇక ఎక్కువ రోజులు ఆగరు.అందుచేత నిన్ననే వారువచ్చి లగ్నం పెట్టుకు వెళ్ళారు. ఈమాసంలోనే వివాహం. ఇవ్వాళ శేఖరుడు తల్లిని తీసుకు రావటానికి ప్రయాణ సన్నాహాలు చేస్తున్నాడు. అలమారీలోనుంచి దుస్తులవీ తీసి సూటుకేసులో పెట్టబోతూ ఉండగా, చాలాకాలానికి మళ్ళీ లలిత జ్ఞాపకం వచ్చింది. పూర్వం ఈపని లలిత పంతు.

గురుచరణుని కుటుంబము ఇక్కడనుంచి వెళ్లిపోయి మూడు సంవత్సరాలకు ఎక్కువైంది. ఈ మధ్యవారి సంగతులేవీ ఇతనికి తెలియవు. తెలుసుకోవాలని ప్రయత్నించనూలేదు. అసలు కోరికకూడలేదు. లలితమీద ఇతనికి క్రమముగా ద్వేషము ఏర్పడింది. కాని ఇవ్వాళ, లలిత ఎలా ఉన్నదో తెలుసుకోవాలనే కోరిక ఇతనికి తలవని తలంపుగా కలిగింది. ఆమె గిరీన్ సంరక్షణలో ఉంటున్నది. తప్పక సుఖంగా ఉంటుందనికూడా తనకు తెలుసు. అయినా, ఎప్పుడు పెళ్లి అయింది? అతని దగ్గర ఎలా ఉంటున్నది? వీటివివరాలు తెలుసుకోవాలని ఇతనికి కుతూహలము కలిగింది.

గురుచరణుని ఇంట్లో పూర్వము అద్దెకు ఉండేవారు రెండుమాసాలక్రిందట ఇల్లుకాళీచేసి వెళ్లిపోయారు. "వారు తండ్రిని పోయికనుక్కుందాము. వారికి గిరీన్ సంగతులు తెలుస్తూ ఉంటవి." అని శేఖరుడు ఒకమాటు అనుకొన్నాడు.

ఒక్కక్షణకాలము పెట్టెలో గుడ్డలు సర్దటముమాని శేఖరుడు శూన్యదృక్కులతో కిటికీలోనుంచి బయటకు చూస్తూ ఈసంగతే ఆలోచిస్తున్నాడు. ఇంతలో దాసీది వాకిట్లోకివచ్చి - "చినబాబుగారూ! ఆయింటి అమ్మగారు మిమ్మల్ని ఒకమాటు పిలుచుకు రమ్మన్నారు," అని అన్నది.

శేఖరుడు దాసీదానివంక చూస్తూ - "ఏయింటావిడ?" అని ఆశ్చర్యంతో ప్రశ్నించాడు.

దాసీచేతితో గురుచరణుని ఇల్లు చూపించి - "ఆయింటి అమ్మగారండీ; చినబాబుగారూ. వారంతా రాత్రి వచ్చారుగా!" అన్నది.

"పద, వస్తాను." అని శేఖరుడు వెనువెంటనే దిగిపోయాడు.

అప్పటికి వేళచాలా మిగిలింది. శేఖరుడు ఇంట్లో అడుగు పెట్టగానే హృదయవిదారక మైన ఆక్రందనధ్వనులు చెలరేగినవి. శేఖరుడు విధవవేషములో ఉన్న గురుచరణుని భార్యవద్దకుపోయి, నేలమీదకూర్చుని నిశ్శబ్దంగా కళ్లు తుడుచుకోసాగాడు. ఇతను దుఃఖించేది ఒక్క గురుచరణుని కోసమేకాదు. పితృశోకముకూడా కలిసి ఉన్నది.

పొద్దుకుంకగానే లలిత వచ్చి దీపము వెలిగించి శేఖరునకు దూరముగా ఉండే నమస్కరించి, ఒక్కక్షణము ఎదురుచూసి నెమ్మదిగా వెళ్లిపోయింది. పదిహేడుసంవత్సరాల ప్రాయముగల వరస్త్రీవంక శేఖరుడు కన్నెత్తి చూడలేకపోయాడు. పిలిచి, మాట్లాడలేక పోయాడు. అయినా అతను వారగంట చూసినంతలో, లలిత చాలా పెరిగినదనీ, బొత్తిగా కృశించిపోయిందనీ గ్రహించాడు.

ఏడుపులూ ఓదార్పులూ అయిన తర్వాత గురుచరణుని భార్య చెప్పిన దానికి సారాంశమిది: ఈ ఇల్లు విక్రయించి ముంగేరులో అల్లుని వద్ద ఉండవలెనని ఆమె కోరిక. శేఖరుని తండ్రికి చాలా కాలమునుంచి ఈ ఇల్లు కొనాలని ఉన్నది. ఒకరు అడిగిన ధరకు వీరికే ఇస్తుంది. ఈ ఇల్లు వీరుకొంటే ఒకవిధముగా సొంతవారి దగ్గర ఉన్నట్లే ఉంటుంది. ముందు ఎప్పుడైనా ఈ దేశము వస్తే ఈ ఇంట్లో ఒకటి రెండు రోజులు ఉండి పోవచ్చును.

శేఖరుడు, తల్లిని కనుక్కొని తనచేతనైన సహాయము చేస్తానని చెప్పినమీదట ఆమె కళ్లు తుడుచుకొని - "అక్కయ్య ఇప్పట్లో రాదా శేఖర్?" అని అడిగింది.

ఇవ్వాళ రాత్రికే ఆమెను తీసుకురావటానికి పోతున్నానని శేఖరుడు చెప్పాడు. తర్వాత ఒక్కటొక్కటిగా చాలా సంగతులు అడిగి తెలుసుకొన్నది; శేఖరుని పెళ్లి ఎప్పుడు? ఎక్కడ? కట్నము ఎన్నివేలు? ఎంత నగకట్టు? నవీనరాయ్ ఎలా చనిపోయాడు? - ఈ ప్రశ్నలన్నిటికీ శేఖరుడు జవాబులు చెప్పాడు.

గాంధీ-బోసు లేఖలు

(11 వ పేజీ తరువాయి) పాదించాలనీ కోరుతూ వున్నాను కమిటీవారి కార్యక్రమం అంగీకరిస్తే అంతా తేటపడిపోతుంది. అల్పసంఖ్యాకులు అడ్డులేకుండా, మీరు మీ కార్యక్రమం నిర్వహించుకోవాలి. మీ కార్యక్రమం ఒకవేళ ఆమోదం పొందకపోతే, మీరు రాజీనామా యిచ్చి, కమిటీ యిష్టంవచ్చినవారిని ప్రెసిడెంటుగా ఏర్పఱుచుకొనే అవకాశ మియ్యాలి. మీరు మీతోటి పద్ధతులు ప్రజలలో ప్రబోధం కలిగించవచ్చును. పండిత పంతుగారి తీర్మానముతో నిమిత్తము లేకుండా, నేను మీకీసలహా యిస్తున్నాను.

ఇపుడున్నంతలమ్మువ అహింసా భావము నేవిధిగాను చూపలేదని మీరన్న మాటతో నేనంగీకరింపజాలను. నేను నీళ్ళు ఊపిరిలో చౌర్జన్యం పనికొట్టుతూ వున్నది. ఆ చౌర్జన్యం చాల గంభీర యాపం దాల్చింది. మనలో మనం ఒకరిపైన ఒకరము అవిశ్వాసం తెచ్చుకోవడం, చౌర్జన్యానికి చాల పెద్ద నిదర్శనం. హిందువులకు, ముసల్మానులకు మధ్య పెరిగిపోయిన పెచ్చు హింస ఇదే చూపుచూవున్నది. ఇటువంటి దృష్టాంతరాలు ఎన్నైనా నేను చూపగలను.

కాంగ్రెసులో అవినీతిగూర్చి, మీతో ఏకీభవింపను. అది అంతకంతకు హెచ్చుతూ వున్నదనే నా అభిప్రాయం. చాలా నెలలనుండి ఇది పూర్తిగా పరీక్షచేయాలని నేను వాదిస్తున్నాను.

ఈ పరిస్థితులలో అహింసా యుతమైన సత్యాగ్రహానికి తగిన వాతావరణం నాకు కన్పించుటలేదు బలమైన ప్రజామోదము లేని 'తుదికోరికలు' నిరర్థకములంటే హాని నిచ్చును. నేను మీతో తెలిపినట్లు కొంచెం అస్థైర్యము. విశేష జాగ్రత్త గూపుచూవున్నానేమో: మీరు పనిముదనము వున్నది: దానితోపాటుచ్చిన అలక్ష్యమైన వుత్సాహము వున్నది. మీదే నిజము, నాది పొరపాటు అని నేను తలుస్తున్నాను. కాంగ్రెసు ఇప్పుడున్న స్థితిలో మోక్షం చేకూర్చలేదనిన్నీ, చెప్పదగిన సత్యాగ్రహం చేయలేదనిన్నీ నా దృఢమైన విశ్వాసం. మీ జోస్యమే నిజమైతే నేను సత్యాగ్రహ నాయకుడుగా ఉండటానికి ఇంక తగను. వెనుకబడిపోయాను.

రాజకోట వ్యవహారం సంగతి మీరు ఎత్తుకొన్నందులకు సంతోషం. రాజకోటకోసం ఇతర సంస్థానాలలో నేను సత్యాగ్రహం ఆపలేదు. కాని రాజకోట నా కన్నులు తెఱచింది, నాకు దారి చూపింది. నేను ఢిల్లీకి ఆరోగ్యం కోసం పోలేదు. ఛీఫ్‌జస్టిస్ తీర్పుకు ఎదురు చూస్తూ ఇష్టం లేకపోయినా ఉన్నాను. వైస్రాయి నాకు పంపిన తంతివార్తలో చేసిన వాగ్దానంలో చెప్పిన పద్ధతులు జరిగేవరకు ఢిల్లీలో వుండుట నా విధియని తలచేను. ఇందులో ప్రమాదం ఏమీలేదు. నేను బ్రిటిష్ ప్రభుత్వాన్ని తన ధర్మం నిర్వహించాలని కోరితే అది పూర్తిగ నెరవేరేవరకు వేచియుండుట నా ధర్మముకదా: సర్ మారిస్‌గారు సదుపత్రాన్ని ఆయన ఛీఫ్ జస్టిస్ హోదాలో కాకుండా, వైస్రాయిగారి విశ్వాసము పొందిన అంతేరిన విచారణకర్తగా విచారించేరు.

★

బోసు లేఖ

జీల్‌గోరాపోస్టు.

ఏప్రిల్ 6.

మహాత్మాజీగారికి,

దేశము మిమ్ము ఏరీతి భావించుచున్నదో మీరు జ్ఞప్తికి తెచ్చుకోవలెనని మరొకమారు నేను మిమ్ము వేడుచున్నాను. మీరొక పక్షమునకు చెందినవారు కారు. కనుకనే వేరగుచున్న సమయములో ఒకటి చేయుటకు ప్రజలు మీ సాయము నింకను ఆపేక్షించుచున్నారు.

వర్కింగు కమిటీ నియామకముగూర్చి మీరొసగినది అంత్యకాలపు సలహా, కలయికమీద ఆశను మీ సలహా పడగొట్టుచున్నది. అది కాంగ్రెసులో చీలిక అపదు సరికదా, అట్టి చీలికలు ఏర్పడుటకు అవకాశము కల్పించును. ప్రస్తుత సందర్భమున ఒకటే పక్షమునకు చేరిన కేబినెటు సూచన వేర్వేరు పార్టీలను వేరుగ పోనిచ్చి సలహా యిచ్చుచే. కలిసి పనిచేయుటకు వీలుపడదని మీకు గట్టి నమ్మకమున్నదా? జరిగినది మరది మున్నంది. సమాన లక్ష్యము కొరకు దేశాలు కలిసి పనిచేయుటకు మేము సిద్ధముగ నున్నాము.

హరిపురాలో ఉన్నపుడు, కేబినెటులో పనిచేయుటకు సోషలిస్టులను ఆహ్వానింపుమని నేను సూచింపగా, నా సూచన సర్వవిధముల సరియైనదని మీరు గట్టిగ చెప్పలేదా?

కేబినెట్టులో ఏకపక్షమునకు చెందినవారే ఉండవలెనని మీరు చెప్పుటకు యింతలో అట్టి మార్పు ఏమి కలిగినది?

ఈ రెండుపార్టీలు పరస్పరము విరుద్ధములని మీ లేఖలలో మీరు తెలిపియుంటిరి. ఆ విషయమై మీరు వివరముగ తెలుపలేదు. ఆ విరోధము కార్యక్రమము మీదనా లేక వ్యక్తిగత సంబంధములు మీదనా? రెండవది తాత్కాలికమని నా ఉద్దేశము. మనము కలహించవచ్చును, పోరాడవచ్చును, మరల ఒకరికొకరు కలిసికొని సర్దుకొనవచ్చును.

అట్లుగాక మీ వ్యతిరేకత కార్యక్రమము గూర్చిన దందురా? మీ వాదన ఏమిటో నేను తెలుసుకొన గోరెదను. మన ఉభయుల కార్యక్రమములలో భేద మెచ్చుట వచ్చినదని మీ యూహ? కలిసి పనిచేయుట అసాధ్యమని యూహిగ చెప్పవలసినంత భేద మెచ్చుట ఏర్పడినది?

"గాంధైట్లు" బలపరిచి త్రిపురీ కాంగ్రెసులో ఆమోదించిన స్వరాజ్య తీర్మానమునే తీసికొందము. అందుమై, భావశూన్యములగు పదములను, హింసా ప్రతికూల వాచకములును కొన్ని అందున్నను, ఒక విధముగ నా ఉద్దేశమే ప్రకటనమైనది. అల్టిమేటంగూర్చియు, రానున్న సమరసన్నాహములగూర్చియు తీర్మానములో గలదు. అట్టి ఆ తీర్మానము మీకు సమ్మతమేనా? సమ్మతమే యయినచో, మరొకడుగు ముందుకు జనినా కార్యక్రమము మీరేల అంగీకరించరాదు?

పంతుతీర్మానముయొక్క యోగ్యతలగూర్చి మీరింకను ఏమియు చెప్పకపోతిరి. తీర్మానము మీకు సమ్మతమేనా? లేకున్న యించుమించుగ మాపద్ధతి ననుసరించిన మరొక తీర్మానమును మీరు ఏకగ్రీవముగ ప్యాసుచేయించి యుందురా? మీ ఆదేశములపై మరల నమ్మకమును కలిగించి, మినాయకత్వముపై విశ్వాసము కలిగించి, వాదనల కవకాశ మివ్వని వాక్యములుగల ఒక తీర్మానము చేసియుందురేమో.

ఈతీర్మానము పాసైన తర్వాత వర్కింగు కమిటీ నియామకములో అధ్యక్షుని జోక్యము ఎంతవరకు కలదు? ఈప్రశ్ననే నేను మరల వేయుచున్నాను. ఏల యనెదరా, ఈవిధమైన నియామకము మీరుచేయునది. ఈవిషయమై మీ అభిప్రాయము నాకు ముఖ్యమైనది.

ఇదే సందర్భమున మరొక ప్రశ్న అడిగెదను. ఇదివరలో కూడ అడిగి యుంటిని. ఈ తీర్మానము నాపై అవిశ్వాస తీర్మానమని మీ ఉద్దేశమా? అట్లే అయినచో ఎట్టి షరతులు లేకుండనే నేను వెంటనే రాజీనామా యివ్వగలవాడను.

పాతవారినే మరల అధికారములో పెట్టుట మీ ఉద్దేశముగాబోలు. అట్లయినచో మీరు మరల రాజకీయములలో జోక్యము కలిగించుకొని కాంగ్రెసులో నాలుగణాలసభ్యులై, వర్కింగు కమిటీవార్ని తీసికొనవలెనని వేడెదను. ఇట్లు చెప్పినందుకు క్షమించవలెను. ఎవరిమైనను నాకు దురుద్దేశము లేదు.

మీరు స్వయముగ వచ్చి బహిరంగముగ కాంగ్రెసు కార్యక్రమము నడిపించవలెనని కోరుచుంటిని. ఇందువల్ల చిక్కులు తీరును. పరిస్థితులు తేలికయగును. ఓల్డుగార్డుపట్లగల ప్రతికూలములో చాలభాగము — తప్పక ఉన్నది దానంతటదే తగ్గిపోవును.

ఇది మీరు చేయజాలనిచో మరొకసూచన చేసెదను. స్వాతంత్ర్యముకొరకు జాతీయసమరము యిన్నాళ్లవలెనే మరల సాగించవలెను. బ్రిటిషుప్రభుత్వమునకు అల్టిమేటం యిచ్చుటతో ఆరంభించవలెను. అట్లు చేసితిరేని, మేమందరము మా మా అధికారములను హృదయ పూర్వకముగ వదలుకొనెదము. మీ కిష్టమైనచో, ఈపదవులను, మీకిష్టపడిన వారికి మీరు యివ్వమన్నవారికి స్వాధీనము చేసెదను. ఒక్క షరతుమీదనే, స్వాతంత్ర్యసమరము మళ్లీ లేవదీయవలెను.

ఐక్య కమిటీ పనికిరాదని, ఏకపక్ష ప్రాతినిధ్య కమిటీయే మనకున్న మార్గము అని యింకను కడపటివరకు మీ ఉద్దేశమును వీడకున్నచో, నా యిష్టప్రకారము కేబినెటు ఏర్పాటుచేయమని మీరు నన్ను కోరినచో, మరుచటి కాంగ్రెసు సమావేశము వరకు మీరు దానిపై విశ్వాసప్రకటన చేయవలెనని నేను కోరెదను. ఇంతలోపున ఎందులోనైనను మేమునసమ్మత చూపజాలనపుడు కాంగ్రెసువాళ్లు మమ్ములను త్రోసివేయుటకు అంగీకరింతుము. మమ్ములను పదవులనుండి గెంటివేయ వలసినదే. ఇప్పుడు మీరిచ్చు విశ్వాసతీర్మానము ఏ. ఐ. సి. సి. యిచ్చినట్లే. మీరు విశ్వాసము ప్రకటించకనే ఏకపక్షప్రాతినిధ్య కమిటీ ఏర్పరచమని నన్ను కోరితిరేని పంతు తీర్మానమును మీరు బలపరచినట్లు కాదు.

మరొక మాట మిమ్ముల వేడెదను. కంపోజిట్ కేబినెటుకు గల మీ వ్యతిరేకము, మన ఆదర్శములను అనుసరించియా, లేక నేను మార్చి 25 తేదీన వ్రాసిన నా మొదటిజాబులో సూచించిన సంఖ్యకన్నను, పాతవారి ప్రాతినిధ్యము కేబినేటులో ఎక్కువ ఉండవలెననియా, అను విషయము తెలుపకోరెదను.

(ఈ లేఖ వ్రాసిన తరువాత, ఏప్రిల్ 7 వ తేదీని సుభాష్‌బోసు మహాత్మునితో టెలిఫోన్లో మాట్లాడుతూ, తాను డాక్టర్ల సలహాను ధిక్కరించి వర్కింగ్‌కమిటీ సమస్యను గురించి ముఖాముఖీ మాట్లాడటానికి న్యూ ఢిల్లీ బయల్దేరి వస్తున్నానని తెలియజేస్తే, ఆ రోజు రాత్రే తాను రాజకోటకు బయల్దేరుతున్నాననీ, బోసు యిష్టం వచ్చిన వర్కింగు కమిటీని తక్షణం నియమించవలసిందనీ, తాను అసహాయుడననీ మహాత్ముడు రెండుసార్లు ఫోన్‌లో జవాబిచ్చాడు)

బోసు లేఖ

జీల్‌గోరా పోస్టు

10 ఏప్రిల్ 39.

మహాత్మాజీ,

కాంగ్రెసులో ప్రస్తుతము అవినీతి, హింసా శక్తి ఎక్కువగావున్నవి కనుక, అంత్య సందేశ ప్రకటనము వెంటనే జాతీయ సమర ప్రారంభము కూడదని మీ భావ మట్లుగా నాకు తోచుచున్నది. ఈ యవినీతి విషయమై చాలా నెలలనుండీ మనము వర్కింగుకమిటీలో చర్చించుతూనే యున్నాము. అంతా యేకాభిప్రాయముగానే వున్నాము. కాని ఒక తేడా మట్టుకు వున్నది, ఏమంటే వెంటనే పూర్ణస్వరాజ్య సంరంభమునకు మనము పనికిరాకుండా పోయేటంతగా ఈ యవినీతి యున్నదని మాత్రం నేను తలచను. అయితే ఇంకా చట్ట విహిత మార్గమునే అనుసరిస్తూ, ఉద్యోగాల మది ఎక్కువగా మరిగితే మట్టుకు ఈ అవినీతి తప్పకుండా పెరిగిపోతుంది. అదిగాక, దేశ విముక్తి కోసం ఇంకా త్యాగంచేసి, బాధలుపొంద సిద్ధం కావాలని ఆజ్ఞకాగానే, అవినీతి అంతా పటాపంచలై పోతుంది. మనలో పైకెగబ్రాకి వచ్చిన అవినీతిపరులెవరైనా ఉంటే, నీరు విడచిన చేపలులాగా బయటపడిపోతారు.

మనలో చౌర్జన్యభావ మనే విషయమైకూడా నేను లోగడచేసిన ప్రకటనమునే మళ్ళీ ధృవపరుస్తాను కాంగ్రెసువారిలోనూ, తదితమానులలోనూ ఇదివరకు కంటే ఇప్పుడు హింసాస్వభావం తక్కువగా వుంది.

పండిత పంతుగా రుపపాదించిన తీర్మానము అది చివరకు పేసయిన రూపంగా వుండుట మీకు ఇష్టమో, లేక కొంచె మించుమించు మేము సూచించిన విధముగా ఏకగ్రీవముగా అంగీకరింప దగినట్లుండుట మీకు ఇష్టమో తెలుసుకొన గోరియుంటిని. మరియు పంతుగారి తీర్మానము నాపట్ల అవిశ్వాసప్రకటనము వంటిదేమో తెలుపగోరెదను

1. నా మొదటి సూచనయేమంటే, స్వాతంత్ర్య పోరాటమును తిరిగి ప్రారంభించుటకు పూనుకోవలసిందని, అపుడు మీరవసరమని తలచే ఎంతటి త్యాగమునైన మానుండి కోరవచ్చును. మీమిపుడు వహించియుండే అధికార పదవులను త్యజింపమనికూడా మీరు ఆదేశింపవచ్చును. స్వాతంత్ర్య సమరము ప్రారంభించినట్టయితే, మేమంతా యెట్టి షరతులు లేకుండ నడుము బిగించి తోడ్పడెదమని ఖరారు చేయుచున్నాను.

2. స్వాతంత్ర్య పోరాటం ఇపుడు ప్రారంభించుట వీలుగాదనియే మీరు తలచుచో, వృద్ధ నాయకులనే అధికారమున నిలుపగోరుచో, మీరు పావలా చందా సభ్యుడుగా కాంగ్రెసులోచేరి, ప్రత్యక్షంగా వర్కింగు కమిటీ ఆధిపత్యమును స్వీకరించవలెనని నా సలహా. ఇందువల్ల, వృద్ధనాయకులనే అధికారంలో వుంచి, మీరు దూరంగా వుండడంవల్ల కలిగే అనేక చిక్కులు తొలగిపోవును.

3. ఈ రెండో సూచనకూడా మీకు నచ్చకపోయి, ఇంకా ఏకవర్గీయుల కమిటీయే యేర్పరచ వలసిందిగా మీరు పట్టుదల వహిస్తారేమో అట్లే అయితే, మళ్లీ కాంగ్రెసు మహాసభ జరిగేవరకు నాకు మీ విశ్వాసప్రదానం చేయవలెనని కోరుతున్నాను. మీ విశ్వాసము నొసగినట్లయితే, ఎ. ఐ. సి. సి. లో మీ సనాతనానుచరుల తోడ్పాటుకు మరి చలనము వుండదు. కనుక చీలికరాదు

(మిగతా 19 వ పేజీలో)

కాకినాడ పీచు కార్మికుల సమ్మె చరిత్ర

కా ప్రేమ్ పార్థసారథి

కాకినాడలో ప్రప్రథమమున బళ్లవాళ్ళు తమకు శాస్త్రవిరుద్ధముగా (గ్రీన్ మైములోగానే) విధించబడిన రోజుకు అణాపన్ను దుర్వరమని తెలియజేస్తూ సమ్మెకుదిగి జయం పొందేరు. ఈవిజయమే కార్మికసంఘాల ఆవశ్యకతను గుర్తింపజేసి కార్మికలోకంలో నూతనశక్తిని పెంపొందించింది. పాకీవాళ్ళ సంఘంగా యేర్పడి తమకుజరిగే అన్యాయాలు అధికార్లకు విన్నవించుకొని కొద్దిపాటి లాభం పొందేరు. స్టీవ్‌డోర్‌వర్కర్లు సంఘంగా ఏర్పడి ముఠాలవల్ల తమకు జరుగుతున్న దోపిడిని అరికట్టడానికి సమ్మెచేసేరు. ఫలితంగా పగటిపనికి 0-8-0 రాత్రికి 0-12-0, లు 0-11-0, 1-0-0 లు రేటుగాను ఆరోగ్యకరమైన ఆహార సౌకర్యాల్ని పొందగలిగేరు. ఉప్పుమాల్ కూలీలు మండు టెండలో రాబోవు కళ్ళ రోగాలకు వెనుదీయక చేసే పనికి రోజు 1కి 0-4-6 చెప్పుదెబ్బలు కలసి సంపాదించే సంపాదనను చెప్పుదెబ్బలు వదులుకొని రోజు 1కి 0-6-0 లున్నూ సమ్మె చేసి రాబట్టేరు. బేలింగు ప్రెస్ సమ్మెలల్లలోపాయకారీ కమిషన్లు అంతరించినవి. అతరువాత ప్రారంభమయ్యింది పీచు కూలీల సమ్మె.

పీచుకూలీల సమ్మె

నాల్గు సంవత్సరాలకు పూర్వం పీచువర్తక సమూహమంతా ఏకైక ముఠాగా ఏర్పడి కూలీలకు అంతవరకూ యిచ్చుచూవచ్చిన 1-8-0 యిచ్చే ప్రమాణమునకు 0—6—0 మొదలు 0-9-0 వరకూ దింపేసేరు తమ తమలపాకులకూ తమపేర జరిగే దేవుని ధర్మాలకూకూడా యీ అత్యల్ప కూలులనుంచి మినహాయింపులు చేయసాగారు గతిలేక యీనాల్గు సంవత్సరాలూ కూడా తమ కర్మకాబోలు ననుకొని పనిలోనికి వెళ్లేరు. కాని యిప్పుడు కార్మికవర్గం ఐకమత్యమువలన తమకర్మ నివారణమగునని తెలిసివర్తకులకు తమ కనీసపు కోర్కెలను తెలిపేరు. రాజీ లేక పోగా సమ్మెకుదిగేరు శాంతంగా.

అక్రమ లాఠీచార్జి.

పికెటింగ్ యెంతో ప్రశంసనీయంగా, శాంతంగా ఒక పీచుకొట్టువద్ద జరుగుతూ వుంటే 4-4-39 తేదీని హఠాత్తుగా పోలీసు అధికార్లు వచ్చి సమ్మె నడుపుతున్న నాయకులను ఐదుగురినీ అరెస్టుచేసి కార్మిక సమూహముపై లాఠీలు విసరి సుమారు యెనభై మంది స్త్రీ బాల వృద్ధులను దారుణంగా హింసించేరు. ఈ అమానుషచర్య తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ సభలోనూ, విచారణద్వారా రుజువైన విమ్మటకార్యనిర్వాహకవర్గంలోనూ యితరచోట్ల కూడా తీవ్రంగా ఖండించబడింది. నాయకులు బెయిలుపై విడుదల అయ్యేరు.

144

వర్తకులంతా అధికార్ల చెవులుకొరకడం, నిదానంగా గుర్తించుకుంటానే అధికారవర్గం, పట్టణపు బహిరంగ ప్రదేశములలో సభలు, ఉత్సవములు, ప్రదర్శనములు నిషేధించుచూ కాంగ్రెస్ సోషలిస్టులనబడు వారందరిపైనా కొందరు ప్రత్యేక వ్యక్తులపైనా, 144 సెక్షను జారీ చేసింది. మరఫిరంగులుకూడా అణచలేని చైతన్యం పొందిన కార్మికవర్గాన్ని అణచడానికి చేయబడ్డ శాసనముల ధిక్కారంలో 250 మంది అరెస్టయ్యారు 30 మంది తప్ప మిగతావారు విడుదలయ్యేరు. 12 గురికి ఆరేసి నెలలు, ఒకనికి మూడునెలలు కఠిన శిక్షలు విధింపబడ్డాయి. తక్కినవారిపై కేసులు నడుస్తున్నాయి.

దారుణ శిక్షలు.

21-4-39 వ తేదీని మద్రాస్ మంత్రాంగం సమ్మె సందర్భమున అరెస్టయినవారి నందరినీ ఎట్టి షరతులు లేకుండా వెంటనే విడుదలచేసి కేసులుపసంహరింపజేయడానికి ఒప్పుకొని, తగవుపరిష్కార విషయంలో ఒక మధ్యవర్తిని ఉభయపక్షాల ఆమోదంపై యేర్పాటు చేసింది. వెంటనే అప్పటికే శిక్షింపబడ్డ వీరులందరినీ విడుదలచేసి, విచారణలో ఉన్న కేసుల నుపసంహరించుకోవలసిన బాధ్యతను ప్రభుత్వం ఏ కారణంచేతనో మరచిపోయింది, తరువాత విచారణకువచ్చు కేసులుకూడ ఆగలేదు. చావు బ్రతుకుల మధ్యనున్న ఒకరోగపీడితునికి ఆరునెలలు, తన భార్య ఎనిమిదవ మాసపు గర్భిణిగావుండి యిల్లు చక్కబెట్టుకునే దిక్కు లేకుండా వున్న ఒక సోదరునికి ఆరునెలలు, సమ్మెతో సంబంధములేని బ్రోకరునని ముద్రతున్న మరొకనికి ఆరునెలలు, కఠిన శిక్షలు విధించి ప్రభుత్వం దారుణంగా ప్రవర్తించింది.

నాయకుల నిరసన వ్రతం.

4-4-39 వ తేదీని అరెస్టయి జామీనుపై విడుచబడిన కామ్రేడ్స్ సి. వి కృష్ణరావు, కొరపాటి పట్టాభిరామయ్య, యం. వీరయ్య, పి వెంకటేశ్వరరావు, యస్. వెంకటరత్నంగార్లు అయిదుగురున్నూ 6-5-39 తేదీని ప్రొటెస్టుగా తమ జామీను రద్దుపరచుకుని సబ్‌జైలు ప్రవేశించేరు. ఆరోజున ప్రభుత్వాధికారులు వీరికి అటుకులు ఫలహారం యిచ్చి ఉపవాస వ్రతం చేయింపచూచింది. కాని అదివరకే ప్రభుత్వపు అక్రమ చర్యలకు నుందబుద్ధికి తమ తీవ్ర అసమ్మతి తెలుపుటకు అరెస్టయిన వీరులంతా విడుదల చేయబడేవరకు సాగించే ఉద్దేశంతో నిరశన వ్రతం ప్రారంభింపదలచుటచే ఈ యోధులు నిరశనవ్రతం ప్రారంభించేరు. నీరసస్థితిలో ఆసుపత్రి ప్రవేశం జరిగింది.

నాయకుల బాధలు

సబ్‌జైలులో అయిదుగురూ ఎలుకలవల్ల బాధపడ్డారు. ఆసుపత్రిలో దోమలు, నల్లులు, చీమలు బాధించేయి. నిరశనవ్రతంవల్ల ఆకలి బాధ, అవమానకరమైన చేతిసంకెళ్లు మంచానికి కట్టివేయడంవల్ల స్వేచ్ఛగా దొర్లడానికి వీలులేక నిద్రలేకపోయేది. ఈ పరిస్థితుల్లో నాయకులదీక్ష మరింత తీవ్రమయింది. వీరిలో వెంకటేశ్వరరావుకు గుండెల్లో పోటు ప్రారంభమైనది కోర్టులో దాహబాధ యెక్కువై మంచి నీళ్ళడిగినప్పుడు, అధికారవర్గం తాము త్రాగే నీళ్లివ్వక, ఒక సోదరుడు తెచ్చియిచ్చిననీళ్ళు త్రాగనివ్వక, చాల అమానుషంగా ప్రవర్తించి ఒక పెన్సినతకల కాన్స్టేబిల్‌ను ఆసుపత్రికి పంపించేరు. మందువేసవి. ఒంటిగంటకు కోరిన నీళ్ల విచారణ అయిపోయి కోర్టునుంచి పంపించే వరకూ రానేలేదు.

నిరసన సమ్మెలు

నాయకుల నిరశనవ్రతంతో గ్రామం గగ్గోలయి పోయింది. ప్రభుత్వపు అక్రమ చర్యలకు తమ అసమ్మతిని తెలుపుటకున్నూ, నిరశన వ్రతమునకు సానుభూతి చూపుటకున్నూ అన్ని రకాల కూలీలు 8 వ తేదీని సమ్మె ప్రారంభించేరు. 9 వ తేదీని సమ్మెలో 5 వేల కార్మికులు పాల్గొన్నారు. 10 వ తేదీని సమ్మె తీవ్రంగా విజృంభించి సుమారు 10 వేలమంది కూలీలు సమ్మెలో పాల్గొని నాయకులను విడిచేవరకు సమ్మెసాగిస్తామని ప్రకటించేరు. మునిసిపల్ కమీషనరు వగైరా పాకీపనివాళ్ళను సమ్మెనుంచి వేరుచేయడానికి చేసిన రివాల్వరు బెదిరింపులు కూడవ్యర్థమై పోయినవి.

కార్మికుల జయభేరి

కాకినాడలో విజృంభించిన కార్మికుల ప్రళయ జ్వాల భీకరంగా వ్యాపించింది. పెద్దలంతా కంగారుతో కలుగజేసికొని ప్రభుత్వాన్ని ఒత్తిడిచేసి వాగ్దానం నిలుపుకోమని కోరేరు. అప్పటివరకూ మందంగా ఊరుకున్న ప్రభుత్వం ఒక్కసారిగా కష్టం,తెరచి పొరపాటు సవరించుకొని అరెస్టయిన వారిని విడుదల చేయుట కొప్పుకొని వ్రతం మానిపించింది. బంధింపబడిన నాయకులు విడుదల పొందేరు.

పీచుకంపెనీ యజమానులు, కార్మిక ప్రతినిధులు మద్రాసులో కార్మిక మంత్రిఎదుట సమావేశమై, లేబరు కమీషనర్ యొక్క మధ్యవర్తిత్వాన్ని అంగీకరించారు, తదనుసారంగా లేబరు కమీషనర్‌గారు వర్తకుల చిఠాఅవర్జాలు తనిఖీ చేస్తున్నారు.

ఉప్పుమాల్ కూలీలకు యజమాని, రోజు 1కి 0-6-0 కూలి ఇవ్వాలని, లేబరు కమీషనర్ గారు నిర్ణయం గావించారు.

ప్రపంచ కార్మికులారా ఏకముకండు.
కార్మిక సంఘాలకు జై
విప్లవం వర్ధిల్లాలి.

రాబోవు అ॥ భా॥ రైతు మహాసభ ఎక్కడ జరపాలి?

ఆంధ్రరాష్ట్ర రైతు సంఘాధ్యక్షులు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారు ఇట్లు వ్రాయుచున్నారు :

ఈ సంవత్సరము జరుగనున్న 5 వ అఖిల భారత రైతు మహాసభను ఆంధ్రదేశమున జరుపుటకు గయలో జరిగిన అఖిలభారత కిసాన్ మహాసభవారు నిర్ణయించిరి. ఇట్టి సదవకాశమును కల్గించిన అ. భా. కి. సభవారికి ఆంధ్రదేశ రైతాంగము కృతజ్ఞులు. మన ఆంధ్రదేశమున భారతదేశమునకు సంబంధించి జరిగిన సభలలో రెండుమాత్రమే పేర్కొనదగినవి. అందు 1920 లో బెజవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెసు కమిటీసభ (2) కాకినాడలో 1924 లో జరిగిన కాంగ్రెసు మహాసభమాత్రమే. ఈ రెండు సభలను ఆంధ్రులము ఆహ్వానించి యెంతో జయప్రదముగ జరిపి అతిధి సత్కారమునకు, సభానిర్వహణ యేర్పాట్లకు యేయితర రాష్ట్రములకు తీసిపోవువారము కామని మనము ఋజువు చేయగలిగితిమి.

ఆంధ్ర రైతాంగ భాగ్యవశమున అఖిలభారత రైతుసభ మన రాష్ట్రమున ఈ సంవత్సరము జరుగనున్నది. మరల మనమొకసారి సభను జయప్రదముగ జరిపి మన ఆంధ్రరైతాంగము అతిధి సత్కారమునకు, సభా నిర్వహణకు యే యితర రాష్ట్ర రైతాంగమునకు వెనుకబడి యుండజాలదనుటయే గాక అన్ని విధముల ఆదర్శప్రాయముగ సభను జయప్రదమొనర్చి మార్గదర్శకులు కాగలరని నమ్ముచున్నాను సభను జయప్రదముగా జరుపవలసిన బాధ్యత ఆంధ్ర రైతాంగము మీద గలదని నేను వేరుగ చెప్ప పనిలేదు, గత 20 సంవత్సరముల నుండి తమ దైనందిన కష్టముల నివారణకొరకు తమ సంఘముల నేర్పాటు చేసుకొని కృషిచేయుచు భారతదేశ రైతు వుద్యమ చరిత్రలో యీనాడు ఒక ప్రధాన పాత్ర వహించియున్న ఆంధ్ర రైతాంగము యీ మహాసభను జయప్రదమొనర్చుటకు దీక్ష వహించవలెనని కోరుచున్నాను. దేశములోని వివిధ తరగతి ప్రజల సుఖసంపదలకు మూలకారకులగు రైతాంగమునకు తోడునీడగా అన్నివిధముల సహాయ సహకారములను చూపి 1940 మార్చిలో జరుగనున్న 5 వ అఖిలభారత రైతు మహాసభను జయప్రదముగాను జరుపుటకు పూనుకొన వలెనని ఆంధ్ర ప్రముఖులను, ప్రజలను కోరుచున్నాను. సభా యేర్పాటులు యిప్పటినుండి ప్రారంభించవలసి యున్నది. అందుకుగాను సభాస్థల నిర్ణయము వెంటనే గావింపవలసి యున్నది. అందువలన రాష్ట్ర రైతుసంఘ సాధారణసభ యీనెల 3.వ వారములో సమావేశమై స్థలనిర్ణయము చేయనున్నది, కాన జిల్లా సంఘములు వెంటనే ఆయా జిల్లాలలోగల అవకాశ వివరములను తెలుపుచు రాష్ట్రసంఘ ఆఫీసు, బెజవాడకు యీనెల 20 వ తేదీ లోపుగా వ్రాయవలెనని కోరుచున్నాను. జరగనున్న సాధారణ సంఘ సమావేశములో ఆహ్వానసంఘ యేర్పాటులు చేయుటకుగాను తాత్కాలిక ఉపసంఘము కూడ యేర్పాటు చేయబడును. కావున సోదర రైతులు, రైతు సంఘములు, ఉపసంఘ కార్యక్రమమున సర్వవిధముల తోడ్పడి, యిప్పటి నుంచి పూనుకొని, ఆహ్వానసంఘ సభ్యులను చేర్పించుటలోనూ సభా యేర్పాట్ల నిర్వహణకు అవసరమగు యితర తోడ్పాటును చేకూర్చుటకు శ్రద్ధతో కృషిచేయవలెనని కోరుచున్నాను. ఈ సదవకాశమును మన ముపయోగించుకొని, యెంతశ్రద్ధతో కృషిచేసిన మహాసభ అంత జయప్రదముగ జరుపబడుననుట నిర్వివాదాంశము. కావున యీ సందర్భమున ఆంధ్ర రైతాంగము, వివిధప్రజా సంఘములు, ఆంధ్ర ప్రజలు సర్వవిధముల తోడ్పడుదురని ఆశించుచున్నాను.

ఒరిస్సా విద్యార్థుల సమ్మెకు కారకులెవరు ?

కామ్రేడ్ యర్రమిల్లి నరసింహారావు.

'విద్యార్థి సంఘం అక్రమ సంఘం, దాని సభ్యుడు అక్రమ సభ్యుడు' ఇట్టి భావాలు నేడు ప్రచారంలో ఉన్నాయి. ఇటువంటి 'అంగీకరించబడని' సంఘంతరఫున విద్యార్థుల కనీసపుకోర్కెల కొరకు సమ్మె సాగించేందుకు నియుక్తమైన కమిటీలో కొందరు విద్యార్థులు సభ్యత్వం వహించడం ఒరిస్సా మెడికల్ స్కూలు అధికారులు సహించలేకపోయారు. భారత దేశంలో పెక్కు విశ్వవిద్యాలయాధికారులు, మంత్రులు, విద్యాశాస్త్రవేత్తలు కల్గియున్న అభిప్రాయానుసారముగానే వారు నడచారు. విద్యార్థుల కోర్కెలను పరిశీలించి వానిని గూర్చి విచారించేందుకు కాంగ్రెసు ప్రభుత్వం నియమించిన విచారణకర్త విద్యార్థులకు ఎదురు తిరిగాడు. విద్యార్థులు శిక్షణ నతిక్రమించి ప్రవర్తిస్తున్నారని అభిప్రాయాన్ని వెల్లడించాడు. ఈ వింత తీర్పు సహజంగా అధికారులబలాన్ని రెట్టించింది. ప్రభుత్వ విచారణకర్త తమ మనిషి; వారి కింకేంకావాలి? వెంటనే వారా తీర్పుయొక్క బలాన్ని పురస్కరించుకొని సమ్మె కమిటీ సభ్యుల్ని 5 గురిని కాలేజీ నుంచి వెడలగొట్టారు. ఆలా చేయడములో అధికారులు మంత్రివర్గ బలం తప్పితే విద్యార్థులకు మరే బలం లేదని అభిప్రాయపడ్డారు. ఈ విధమైన అభిప్రాయాన్నే రవీంద్ర కవీంద్రుడు యీ సమ్మె విషయంలో వెల్లడిస్తూ రాష్ట్రప్రభుత్వమునందు మీరు. సంపూర్ణ విశ్వాసము నుంచవలె; గాని మీకు మీరే న్యాయనిర్ణయకర్తలుగా నుండరాదని ఎరింగించాడు. కాని విద్యార్థులపోరాటం అఖండ విజయం పొందటం, ప్రభుత్వం, రాష్ట్రీయ కాంగ్రెసు కమిటీ విద్యార్థుల కోర్కెలను అంగీకరించడం, సమ్మె పరిణామాన్ని నిష్పాక్షికదృష్టితో పరిశీలిస్తే తెలుసుకోగలం.

సమ్మె ప్రారంభం

సమ్మెలు తీవ్రంగా పెక్కుమందిచే విమర్శింపబడుతున్న యీ రోజులలో ఒరిస్సా విద్యార్థుల -సమ్మెల చరిత్రలోనే మరియొక చరిత్రయుతమగు- ఈ సమ్మె ఏప్రిల్ 4 వ తేదీని ప్రారంభింపబడింది. ఒక దినం సమ్మె మెడికల్ స్కూలులో సాగగనే మరునాడు కటక్ పురమందలి స్కూళ్ళన్నింటియందు సమ్మెకట్టు ప్రారంభింపబడెను. ఆరోజున పురవీధులందు ఊరేగింపు జరిగింది. సానుభూతి సమ్మెలకు మేరలేదు రోల్సు నుంచిపేర్లు కొట్టివేయబడ్డా, సమ్మె నిరాఘాటముగా సాగింది. కాని మెడికల్ కాలేజీ పరిస్థితులు మునుపటిలాగే ఉండిపోయాయి. మెడికల్ స్కూలు మూసివేయబడింది కాని విద్యార్థుల హాస్టలుమాత్రం విడిచిపోలేదు. అప్పటికి సమ్మె 9 రోజులనుంచి జరుగుతోంది. రాజీ సూచనలు కన్పట్టుటలేదు. అప్పుడు రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ సమావేశమై అనుసరణీయమైన కార్యక్రమం ఒకటియిచ్చింది. అవసరమైతే మంత్రుల యింటివద్ద సత్యాగ్రహం జరుపాలని వారు నిశ్చయించుకొన్నారు. కాని వారు అప్పటికింకా సత్యాగ్రహం ఎప్పుడు ప్రారంభింపవలసినదీ మాత్రం నిర్ణయించుకోలేదు. తుదిసారి కూడా ప్రభుత్వం తమ తగాదా పరిష్కరణకు తోడ్పడకపోతే సత్యాగ్రహం చేద్దామని వారు తీర్మానించుకొన్నారు. ఈ తీర్మానానుసారంగా తిరిగి విద్యార్థి ఫెడరేషన్ ప్రతినిధులు విద్యాశాఖా మంత్రికి తమ కోర్కెలనుగూర్చి ఎరింగించారు. కాని మంత్రిగారితో జరిగిన వారి సంప్రదింపు ఏవిధంగానూ శాంతి వాతావరణం నెలకొల్పేందుకు లాభించక పోవడం శోచనీయం. టాగూరు చెప్పినట్లు విద్యార్థులు మంత్రివర్గమునందు విశ్వాసముంచారు. కాని మంత్రివర్గం విద్యార్థుల కోర్కెలయెడ గౌరవాన్ని చూపకపోవడం గమనింపదగిన విషయము. ఒత్తిడితేందే కాంగ్రెసు మంత్రివర్గమైనా ముఖ్య సమస్యలపైపైనా సరే దృష్టిని త్రిప్పదు. ఈ విషయం మునుపు మనం విశాఖపట్నం మెడికల్ కాలేజీ విద్యార్థుల డిగ్రీల రికగ్నిషన్ కొరకు జరిగిన సమ్మె సందర్భంలో బాగా తెల్పుకున్నాం. మంత్రివర్గం నియమించిన విచారణకర్త తీర్పు, విద్యాశాఖా మంత్రిగారితో జరిగిన రాజీ సంభాషణల విఫలత, సహజంగా విద్యార్థుల్ని కఠినతరమైన తుది ఆయుధమగు సత్యాగ్రహం జరుపవలసినదిగా ప్రోత్సహించాయి.

అందువలననే ఏప్రిల్ నెల 20 వ తేదీనుంచి సెక్రటేరియట్ ఎదుట కాంగ్రెసుమంత్రుల దృష్టిని తమ తగాదా పరిష్కరణకు త్రిప్పేందుకు వారు సత్యాగ్రహం సాగించక తప్పిందికాదు విద్యార్థి సంఘ గౌరవాన్ని నిలిపేందుకూ, ఉద్యమ భంగం కాకుండా చూచేందుకూ, వాడ శాంతియుతమగు పద్ధతులమీద సత్యాగ్రహం జరుప నిశ్చయించారు. ఈ నిశ్చయాన్ని సకాలమునకే మంత్రివర్గానికి తెలియపరచారు. కాని ప్రభుత్వం అప్పుడైనా సత్యాగ్రహం మాన్పించే పని చేయకపోవడం గర్హింపదగిన సంగతియే కాగలదు.

సెక్రటేరియేట్ ఎదుట సత్యాగ్రహం

విద్యార్థి ఫెడరేషన్ తీర్మానం ప్రకారము ఏప్రిల్ 20 వ తేదీని ప్రభుత్వ భవనమువద్ద నేలమీద సాగిలపడి విద్యార్థులు సత్యాగ్రహం ప్రారంభించారు. పట్టణ మేజస్ట్రేట్ దారిని నిరోధిస్తున్నారనే కారణం చెపుతూ వారు 15 నిమిషముల కాలవ్యవధిలో చెదరిపోవాలని తెలియపరచాడు. కాని విద్యార్థి గౌరవ పతాక ప్రతిష్ఠకు సత్యాగ్రహంచేయ సమకట్టిన విద్యార్థులా ఆజ్ఞ లెక్కచేయక పోవడం, తత్ఫలితంగా 12 గురు ఎరస్టు చేయబడడం జరిగింది ఆరోజున పట్నమంతా హర్తాలు జరిగింది.

సత్యాగ్రహం రెండవదినం మరింత తీవ్ర రూపం దాల్చింది. విద్యార్థులపట్టుదల ఎక్కువైంది. ఆనాడు మరల 15 గురు ప్రభుత్వ భవనద్వారమున కడ్డముగా పడుకొనినందులకు ఎరస్టు చేయబడిరి. వారి విచారణ జైలులోనే జరిగినది. రెండవదినమున పురమందు ఒరిస్సా ఎసెంబ్లీ అధ్యక్షుని భార్య జాహ్నవిదేవిగారి అధ్యక్షతను జరిగిన గొప్ప బహిరంగసభయందు మెడికల్ విద్యార్థుల సమ్మె గౌరవప్రదముగా పరిష్కరింపబడవలెనని తీర్మానింపబడెను. మరునాడు అనగా సత్యాగ్రహంప్రారంభింపబడిన మూడవరోజున (23 వ తేదీ) ప్రభుత్వమందిరమువద్ద మరల 10 మంది ఎరస్టు చేయబడిరి. వీరిలో రాష్ట్రీ కాంగ్రెసు సంఘాధ్యక్షులగు పండిత నీలకంఠదాస్ ఎం. ఎల్. ఏ. గారి కుమారుడు అశోకదాస్‌ను కలడు. వీరందరు అక్రమ సంఘ సభ్యులుగా ఎరస్టుచేయబడిరి. ఆ రోజున జరిగిన రాష్ట్రీ కాంగ్రెసు కమిటీ కార్యనిర్వాహక వర్గ అత్యవసర సమావేశమునందు సమ్మె పరిష్కారమును గూర్చి చర్చలు జరిగినవి. ఈరోజుననే పోలీసువారు ప్రెస్ అక్టుక్రింద ప్రెస్ నొకదానిని సోదాచేసి మెడికల్‌స్కూలు సమ్మెదారులు ప్రచురించిన కాగితములను, వ్రాతప్రతులను, పట్టుకొనుట జరిగినది. మూడురోజుల సత్యాగ్రహతీవ్రత ప్రభుత్వపు మొండిపట్టును కదలించలేదు. కాని నాల్గవ రోజున సత్యాగ్రహ తీవ్రత మితిమీరింది. ఆరోజున ఎరస్టుచేయబడిన వారిసంఖ్య 43. నాల్గురోజుల సత్యాగ్రహ కాలంలో మొత్తం ఎరస్టుసంఖ్య 89. వీరందరూ ఒరిస్సా ప్రభుత్వ భవనద్వారమువద్ద విద్యార్థి గౌరవపతాక ప్రతిష్ఠకు నిలవడం భారత విద్యార్థిలోకం, స్వాతంత్ర్య ప్రియులూ గర్వింపదగిన విషయం. అవసర సమయాల్లో అనుసరింపదగిన సునిశిత దీక్షాయుత శాంతి సత్యాగ్రహం.

పాఠశాలలు మూసివేయబడ్డాయి.

ఈ విపరీత పరిస్థితులు ప్రభుత్వాన్ని కలవరపరచాయి. ప్రజాసామాన్యం ఆందోళ పడింది. విద్యార్థుల శక్తికి అపూర్వబలం కలిగింది. అధికార వర్గం దద్దరిల్లింది. హిస్టీరియా లేక కలరా మొదలగు వ్యాధులతో పోల్చబడుతున్న ఈ సమ్మెజాడ్యం యితర హైస్కూళ్ళలోకి కూడా ప్రాకిపోయింది. వెంటనే ప్రభుత్వానికి హైస్కూళ్ళన్నీ మూసివేయడం తప్పితే మరో గత్యంతరం కన్పడలేదు. అందువలననే వారు కటక్‌లోని పాఠశాలలన్నింటినీ వేసగి నెలవలకి 1 నెల రోజులు ముందుగానే మూసివేశారు. ఆరోజున పురజనులు తల్లిదండ్రులు, గార్డియనులు శ్రీ పార్వతేశ్వర మహంతిగారి అధ్యక్షతను జరిగిన సభలో అరెష్టుచేయబడిన విద్యార్థులందరినీ విడుదలచేసి, శాంతిని నెలకొల్పాలని తీర్మానించారు. ఈవిషయం పూరీలో ఉన్న ఒరిస్సా ప్రధాన మంత్రిగారికి ఫోనులో చెప్పడంకూడా జరిగింది.

జైలులో నిరశనవ్రతం

కటకం జైలులోఉన్న సత్యాగ్రహులలో 27 మందిని అంగుళజైలులోనికి మార్చింది ప్రభుత్వం. దానిపై మిగిలినవారు కటకం జైలులో నిరశనవ్రతం ప్రారంభించారు. కాని ఒరిస్సా ఎసెంబ్లీ అధ్యక్షునిభార్య జోక్యంకల్గించుకోవడం వల్ల ఒక రోజు మాత్రం జరిపి విరమించుకొన్నారు.

రాజీ సూచనలు

ఏప్రిల్ 25 వ తేదీనాడు విద్యార్థులు మరల ఒక గొప్ప ఊరేగింపు లేవదీసారు. ఈరోజున 26 గురు ఎరెస్టు చేయబడి తరువాత విడుదల చేయబడ్డారు. పట్టణ ప్రజలతరపున సమ్మెను ఆపివేసేందుకు ఎన్నుకొనబడిన కమిటీ విద్యాశాఖా మంత్రిని కల్సుకొని దీర్ఘంగా చర్చించింది.

నీలకంఠదాస్ రాజీ ప్రయత్నం

ఉత్కళరాష్ట్రీ కాంగ్రెసు సంఘాధ్యక్షులగు పండిత నీలకంఠదాస్ కలుగచేసుకోవడంవల్ల (1) విద్యార్థి ఖైదీలందరినీ విడుదల చేసేందుకు (2) వారిని ఏ విధంగానూ శిక్షించ కుండేందుకు (3) వెడలగొట్టబడిన 5 రిని తిరిగి స్కూలులో చేర్చుకొనేందుకు (4) సమ్మెవలన పరీక్షలలో పాల్గొనని విద్యార్థులకు మరల పరీక్షలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. విద్యార్థుల కోర్కెలను నెరవేర్చే బాధ్యత, పూచీ రాష్ట్రీ కాంగ్రెసు అధ్యక్షులు స్వయముగా వహించారు. సత్యాగ్రహం, సమ్మె విరమింపబడినాయని విద్యార్థిసంఘ కార్యదర్శి గంగాధర్ మొహపాత్రా ఎరింగించాడు. సత్యాగ్రహం ఆపివేయబడినది.

విద్యార్థుల్ని జయం వరించింది. తనంతట తాను వరించలేదు. న్యాయం వారిది కనుకనూ, టాగూరు చెప్పినట్లుకాక వారియందు యుక్తాయుక్త విచక్షణ పరిపక్వమైనది కావునను, జయము వారిదేయైనది.

సమ్మెకు కారకులెవ్వరు?

ఈ సమ్మెకు కారకులెవ్వరు? విద్యార్థులు మొదట జరిపిన రాయబారాలు పాటిస్తే సమ్మె 23 రోజులపాటు జరుగకపోయేది. ప్రభుత్వం రెండవసారి సత్యాగ్రహం చేస్తామని విద్యార్థులు పంపిన తీర్మానాన్ని నెట్టి పారవేయకపోతే 89 ఎరస్టులు, 1 నెల ముందుగా పాఠశాలలు మూసివేయబడడం కలలోని వార్తలయ్యేవి. కాని ప్రభుత్వం విద్యార్థుల కోర్కెలను గమనింప లేదు. అందువలన ఈ సంఘటనలన్నీ జరిగాయి. వీటివలన సమ్మె లేక సత్యాగ్రహం మాత్రమే ప్రభుత్వ దృక్పథాన్ని మార్చగలదని తేలుతోంది. ఈ సంఘటనలే యితర సమ్మెలికి కారణములని గమనింపవచ్చు. సమ్మెకు కారకు లెవ్వరు?

యుక్తాయుక్త జ్ఞానము పరిపక్వము కాని విద్యార్థులా? లేక

న్యాయ నిర్ణయ కర్తలుగా పేరొందిన అధికారులా?

నరసాపురం తాలూకా కాంగ్రెస్ సంవత్సర నివేదిక

పై సంఘ ప్రధాన కార్యదర్శి ఉద్దరాజు సూర్యరాజుగారు యీ క్రింది సాంవత్సరిక నివేదికను పంపుచున్నారు:—

నూతనముగా ఎన్నుకొనబడిన తాలూకా కాంగ్రెసు సంఘ సభ్యులు ది 25-4-38 తేదీన శ్రీయుత ఉద్దరాజు రామంగారి అధ్యక్షతను పాలకొల్లులో శ్రీ పానకాలురాయ రామమోహన్ క్లబ్బులో సమావేశమై యీ క్రింది విధముగా కార్యనిర్వాహక వర్గమును ఎన్నుకొనిరి.

ఉద్దరాజు రామంగారు (అధ్యక్షులు) ఉద్దరాజు సూర్యరాజుగారు (కార్యదర్శి) కమ్మ సత్యనారాయణగారు (సహాయ కార్యదర్శి)

కార్యనిర్వాహక సభ్యులు:- వోసూరి నరసింహమూర్తి; సయ్యపరాజు వెంకట గోపాల కృష్ణంరాజుగారు; తాళ్లూరి సత్యనారాయణమూర్తి; సజ్జా వెంకట్రామయ్య, కె.కె. సూర్యనారాయణ, బండి మాతయ్య, కోసూరి నరసింహరాజుగారలు.

గ్రామ కాంగ్రెసు సంఘములు, సభ్యులు.

గత సంవత్సరం అనగా (37—38) లో 6800 మంది సభ్యులు చేరిరి. కాని దానిలో 'బోగస్' సభ్యత్వము హెచ్చుగానే యున్నది. 1938 సంవత్సరములో జిల్లాబోర్డు ఎన్నిక బందుటచే కాంగ్రెసు సంఘాధికారములోనికి వచ్చి జిల్లాబోర్డు పదవులలోనికి ఎగ్రబ్రాకవలెనను ఉద్దేశ్యముతో రకరకాలుగా సభ్యులను చేర్పించిరి. ఉదాహరణముగా ఒక గ్రామము తీసుకొందాము. క్రిందటి సంవత్సరము 1870 మంది సభ్యులు చేరిన ఆచంట గ్రామములో 114 గురు మాత్రమే సభ్యులను చేర్చుటచే క్రిందటి సంవత్సరము సంఖ్యను నిలబెట్టుటకు తాలూకా కాంగ్రెసు సంఘముయొక్క ప్రత్యేక కృషి అవసరమైనది. కాంగ్రెసు సభ్యులుగా చేరినవారిలో రాజకీయ ప్రచారముచేసినచో తిరిగి అట్టి ప్రచారము లేకుండా చేర్పించుటకు ప్రమాద ఉంతదు. అట్టి ప్రచారములేకుండా చేర్పించుటవల్లనే యీ సంవత్సరముఎక్కువ కృషిచేయవలసి వచ్చినది. యీ సంవత్సరము తాలూకా కాంగ్రెసు సంఘము ప్రతి తాలూకా సంఘ సభ్యుడు 100 మంది, జిల్లా సభ్యుడు 150 మంది, రాష్ట్రీ సభ్యుడు 200 మంది, సభ్యులను చేర్పించవలసినదిగా తీర్మానించినను కొంతమంది సభ్యులు మాత్రమే ఆ బాధ్యతను గుర్తించి తమకు నిర్ణయించిన కోటాను పూర్తిచేయుటకు కృషిచేసిరి. సంఘ సభ్యులందరు తమ కర్తవ్యమును గుర్తింపని కారణముచేతనే గ్రామాదులలో ఉన్న సభ్యత్వపు పుస్తకములు సకాలములో తిరిగి రావనే అభిప్రాయముతో చివర రోజులలో అర్గనైజర్లను ఏర్పరచవలసి వచ్చినది. సభ్యులను చేర్పించుటలో తాలూకా కాంగ్రెసు సంఘమువారు కొన్ని గ్రామాలలో మాత్రమే సభలు జరిపి కాంగ్రెసు సభ్యులుగా చేరవలసిన ఆవశ్యకమును, కాంగ్రెసు మహాసభ చేసిన ఘన కార్యములను ప్రచారము చేయగల్గినారు. కాంగ్రెసు అధికారములోనికి వచ్చిన తరువాత సహజముగా ప్రజలలో కల్గిన చైతన్యమునకు తాలూకా కాంగ్రెసు సంఘము యొక్క కృషి తోడగుటచేతనే గత సంవత్సరము బోర్డువ్యామోహముచే చేర్పించిన మొత్తం 6,800 సభ్యులను మించినట్లు యీ సంవత్సరం 7,020 మందిని చేర్పించగల్గితిమి. యీ సభ్యత్వము గత సంవత్సరం 63 గ్రామాలలో మాత్రమే ఉండగా, యీ సంవత్సరం 77 గ్రామాలలో వ్యాపించియున్నది. ఒక జిన్నూరు ఫిర్కాలో మాత్రమే అన్ని గ్రామాలలోను సభ్యులు గలరు. నర్సాపురం ఫిర్కాలో 12 గ్రామాలకు గొంది, కాజ, లక్ష్మణేశ్వరం, చిన మామిడిపల్లి, లిఖితపూడి, మాధవాయిపాలెం, సరిపల్లి గ్రామాలలో సభ్యులు చేరనేలేదు, మిగిలిన 5 గ్రామాలలో మాత్రము సభ్యులు చేరినారు. పాలకొల్లు ఫిర్కాలో వర్ధనం సంద్రపవు, వెలివెల, పాలవంచ గ్రామాలలోను, దొడ్డిపల్లి ఫిర్కాలో మేడపాడు, వద్దిపర్రు గ్రామాలలోను, మొగల్తూరు ఫిర్కాలో కుమ్మరపురుగుపాలెం, తూర్పుతాళ్లు గ్రామాలలోను, ఆచంట ఫిర్కాలో ములపర్రు, కందరవల్లి గ్రామాలలోను చేరలేదు. మొత్తం తాలూకాలో 18 గ్రామాలలో సభ్యులు లేరు. ఏ ఫిర్కాలో నైనను ఎక్కువమంది సభ్యులను చేర్పించి ప్రాథమిక సంఘములను ఏర్పరచుటగాని, ఏర్పరచకపోవుటగాని ఆఫిర్కాలో గల కాంగ్రెసు వర్కర్లమీదనే ఆధారపడి ఉన్నది.

యీ సంవత్సరమైనను, ఆయాఫిర్కాలలో సోదర సేవకులు అన్నిగ్రామాలలోను సభ్యులను జేర్పించి ప్రాథమిక సంఘములను ఏర్పరచెదరని ఆశించుచున్నాను. యిప్పుడుగల గ్రామసంఘములు నామమాత్ర సంఘములుగానే యున్నవి. చైతన్యము గలిగి కాంగ్రెసు ప్రచారము సల్పుటకు సంపూర్ణమైన బాధ్యతతో కార్యములను నిర్వహించుటకు తగినశక్తిని గలిగిలేవు. గ్రామసంఘములు సంపూర్ణముగా పైసంఘ ఆజ్ఞలను అమలుపర్చుటకు శక్తి గలిగించిననాడే స్వరాజ్య సంపాదనకు తగినబలము కలుగును.

యీ సం॥ రాష్ట్రీసంఘమువారు బోగస్ సభ్యత్వమును పరిశీలించి రద్దుచేయుటకై కొంత మంది యినస్పెక్టర్లను నియమించిరి. మన తాలూకాలో సుమారు 200 మంది సభ్యులను రద్దుపరచిరి. వారిలో గొట్టుముక్కల వెంకన్న ఎం. ఎల్. ఏ. మన్నెంబల్లి తిరుపతిరాయుడు జిల్లాబోర్డు మెంబరు గార్లుకూడా కలరు. దీనిని బట్టి చూస్తే యినస్పెక్టర్లు దొంగసభ్యత్వమును కేటాయించ జాలరనియు సభ్యత్వ ఫారములను పూర్తిచేయుటకోగల లోపములను బట్టియే కొంతమంది సభ్యత్వమును రద్దు పరచినట్లు తెలియగలదు. యీబోగస్ సభ్యత్వమును ఆపుటకు గాంధిమహాత్ముడు నిరంతరము గొంతు చించుకొని హరిజనలో ఎన్ని వ్యాసములు వ్రాసినను, రాష్ట్రసంఘమువారు ఎంతమంది యినస్పెక్టర్లను నియమించినను ప్రయోజనము అంతగా లేకున్నది.

సోదర సేవకులందరు గాంధీజీయొక్క ఆవేదన అర్థముచేసుకొనిననగాని యీబోగస్ సభ్యత్వము అంతమొందదు స్వాతంత్ర్య సంపాదనకిది తోడ్పడకపోవుటమేగాక ప్రతిరోధకమనిగ్రహించి కృషి చేసిననాడే దీనిని తొలగించగలము.

సంఘ సమావేశములు.

యీ సం॥ కార్య నిర్వాహక వర్గసమావేశములు 11 న్ను, సాధారణ సభ్యుల సమావేశములు 5 న్ను జరిగినవి. అనగా నెలకొకసారి కార్యవర్గ సమావేశమున్ను, 2 మాసముల కొకసారి సాధారణసభ్యుల సమావేశములు జరిగినవని చెప్పవచ్చును. సాధారణ సభ్యులలోను, చివరకు బాధ్యతగల కార్యనిర్వాహక వర్గసభ్యులలోకూడా, ఎలక్షను మీటింగునకు తప్ప తరువాత జరిగిన ఏఒక్క సమావేశమునకు కూడా హాజరు గాకపోవుట ఆశ్చర్యముగా ఉన్నది. సంవత్సరమునకు తిరిగి యీ ఎన్నికల మీటింగునకైన వచ్చినందులకు ఆనందించు చున్నాను.

కాంగ్రెసుసంఘము పార్లమెంటరీ కార్యక్రమము.

కొంతమంది సోదరసభ్యులు పార్లమెంటరీ కార్యక్రమము అనగానే మనకు సంబంధించినది కాదనియు కేవలము మంత్రులమీద, శాసన సభ్యులమీదనే ఆధారపడి ఉన్నదనియూ అభిప్రాయ పడుచున్నారు. పార్లమెంటరీ కార్యక్రమ విజయము మనయొక్క అనగా స్థానిక కాంగ్రెసు సంఘములయొక్క స్థాయినిబట్టియే ఉండును. పార్లమెంటరీకార్యక్రమము యింకా జయప్రదంగా జరగాలంటే మనము చేయవలసిన పనియెంతో ఉన్నదన్నమాట. యిదివరకూ మంత్రులుచేసిన మహత్కార్యములకు మనము స్వల్పముగానే తోడ్పడియున్నాము. కాంగ్రెసు మంత్రివర్గము తీసుకొనివచ్చిన బిల్లులలో చాలా ముఖ్యమైనదియగు రైతుఋణపరిష్కార శాసనము, జమీన్‌రైతు సవరణ శాసనములు తెచ్చు సమయములలో మాత్రము తాలూకాలో చాలా గ్రామాలలో సభలుచేసియు కరపత్రములు వేయించియు కాంగ్రెసు మంత్రివర్గ గౌరవ ప్రతిష్ఠలు యినుమడింపజేయుటకు మన సంఘము కృషిసల్పినది. రైతుఋణనివారణ చట్టమును గురించి కూడా వడ్డీ వ్యాపారుల ప్రతికూల ఆందోళన చేయుచూ కాంగ్రెసు గౌరవ ప్రతిష్ఠను తగ్గించుచు ప్రయత్నించుచుండగా గ్రామ గ్రామాలకు సర్క్యులర్లు పంపియు మీటింగులు పెట్టియూ రైతుల క్షేమమునకై కాంగ్రెసుమంత్రివర్గములు ఏవిధమైన ప్రయత్నములు చేయుచున్నది వివరించి ప్రజలకు చెప్పియు బిల్లును బలపర్చుచూ టెలిగ్రాములు మహజర్లు పంపించియు కృషిసల్పినది. ప్రకాశం కమిటీ రిపోర్టు విషయమైకూడా జమీందార్లుచేయు ప్రతికూల ఆందోళన నరికట్టుటకై జమీందారీ గ్రామాలలో మీటింగులు పెట్టియు, తాలూకాలోని చాలాగ్రామములనుండి రిపోర్టును బలపర్చుచూ తీర్మానములు, టెలిగ్రాములు ప్రభుత్వమునకు పంపడమైనది. యింకను తాలూకా జమీన్‌రైతు మహాసభకూడా మనసంఘ ఆధ్వర్యముక్రింద పాలకొల్లులో ఏర్పరచితిమి. కాంగ్రెసుమంత్రులు, కార్యదర్శులు మన తాలూకాకు వచ్చినప్పుడు ప్రజలకు గల కష్టములు మెమోరాండముల ద్వారాను ఆహ్వానపత్రముల ద్వారాను తెలియజేసితిమి.

తాలూకా కాంగ్రెసు సంఘము, రైతు సంఘము.

మన తాలూకాలో రైతు సంఘము కాంగ్రెసు సంఘమునకు అండగా నుండి పార్లమెంటరీ కార్యక్రమములోను, యితర విషయములలోను, కాంగ్రెసు సంఘముతో కలిసి పనిచేయుచు వచ్చినది. రైతుల కోర్కెలను మన కాంగ్రెసు సంఘం స్పష్టపరుస్తూనే వచ్చినది, తాలూకా రైతు సంఘ సహాయంతో కుపానునష్ట వివరములు తెలుసుకొని ప్రభుత్వమునకు తెల్పుటకై గ్రామ గ్రామములకు సర్క్యులర్స్ పంపించియు, ప్రతి గ్రామమునుండి నష్ట వివరములు తెల్పు లెఖ్ఖలతో కూడిన రిపోర్టులు తెప్పించియూ, తాలూకాలో వచ్చిన నష్టమంతయు ఒక రిపోర్టుగా తయారుచేసి ప్రభుత్వమునకు, రాష్ట్రసంఘములకు పంపించితిమి. నిమ్మ, అరటి, మొదలగు తోటలకు అపారనష్టము సంభవించినది. గావున పడిపోయిన తోటలు ఫొటోలుతీసి, పత్రికలకు, ప్రభుత్వమునకు పంపించితిమి. యీ ఆందోళన మూలముగా నష్టమునకు పాల్పడిన భూములకు రిమిషనులు యిచ్చియు, రెండవ పంటకు అనుమతి నిచ్చియు గృహములు పడిపోయినవారికి తాళ్ళు, కలప నిచ్చియు, ప్రభుత్వము, జిల్లా బోర్డు సహాయపడినవి.

కాళీపట్నం సమస్య.

మన రైతు కార్యక్రమములో కాళీపట్నం సమస్య అగ్రస్థానం వహించుచున్నది. కాళీపట్నం చరిత్ర మీకందరకు తెలిసినదే. రిపోర్టులో దానిని వివరముగా వ్రాయనవసరము లేదు. 1938 సం. జూలై మాసములో కాళీపట్నంలో 144 సెక్షను యిచ్చిన విషయమును, తమ యిబ్బందులను తెల్పుచూ వివరములతో కూడిన 13 పేజీల రిపోర్టును మనకు రైతుల వద్దనుండి వచ్చినది. దానిపై అధ్యక్షులు కాళీపట్నంవెళ్లి స్వయముగా విచారించి పిటీషను లోని విషయములు సత్యమని తెలుసుకొనిన మీదట రాష్ట్రసంఘమువారికి రైతుల రిపోర్టును పంపుచూ, తాలూకా కాంగ్రెసు సంఘము యొక్క కర్తవ్యమును సూచింపవలసినదిగా కోరితిమి.

కాని, మనకు రాష్ట్రసంఘమువారు ఏవిధమైన సూచనలు ఇవ్వక, మీరు పంపించిన రిపోర్టు జమీ దారుగారికి పంపించినామనీ, వారి వద్దనుండి సమాధానము వచ్చిన తరువాత పంపించెదమనీ, జవాబు వ్రాసినారు. తదుపరి తాలూకా కాంగ్రెసు సంఘము కాళీపట్నం వ్యవహారము చూచుటకు 1. వోసూరి నర్సింహమూర్తి 2. కలిదిండి బంగారం 3. భూ. లక్ష్మీ నర్సరాజు 4. ఉద్దరాజు రామం 5. ఉద్దరాజు సూర్యరాజు గారలను ఉపసంఘముగా నియమించినది. ఉపసంఘమువారు రైతులహక్కులు సక్రమమైనవనియు, వాటిని కాపాడుట మన ధర్మమనియు, గురించి సబ్‌కలక్టరు, జిల్లా కలక్టరు, రివెన్యూ మంత్రి, ప్రధాన మంత్రి గారలవద్దకు డిప్యుటేషనులు నడిపించియు, జిల్లా రాష్ట్రకాంగ్రెసు సంఘములకు ఎం. ఎల్. ఏ. లకు పిటీషనులు పెట్టించియు, కృషిచేస్తూ వచ్చింది. ఈ కృషివల్ల 144 వ సెక్షను అప్పట్లో రద్దు చేయబడింది. ఇది ఇట్లుండగా జమీందారుగారు కేసులపై కేసులుపెట్టి రైతులను బాధపెట్టుట ప్రారంభించినారు. స్థానికోద్యోగుల సహాయముతో తిరిగి 144 వ సెక్షను తీసుకొనివచ్చి భూములు బలవంతముగా స్వాధీనము చేసుకొన ప్రయత్నించినారు. అప్పుడు రైతులు సత్యాగ్రహము చేయుటయు, ఆరెస్టులు జరుగుటయు వార్తల మూలమైన విషయములన్నియు మీకు తెలిసినవే. సత్యాగ్రహ పరిస్థితులు ఎప్పటికప్పుడు త్రిప్పుచూ నున్న ముఖ్యులకు,

రాష్ట్ర సంఘాధ్యక్షులకు, తెలియచేస్తూ వచ్చాము. దానిపై రాష్ట్ర సంఘాధ్యక్షులు, తప్పక తాలూకా కాంగ్రెసు సంఘము కలుగజేసుకోవలసినదనియు, సత్యాగ్రహము ఆపుచేసి పరిస్థితులను కంట్రోలు చేయవలసినదనియు, తాము వచ్చినవెంటనే కలుగజేసుకొనెదమనియు తంతి నిచ్చినవిమ్మట తాలూకా కాంగ్రెసు సంఘాధ్యక్షులు ఉ. రామం, గొట్టుముక్కుల వెంకన్న ఎం. ఎల్. ఏ. నర్సాపురం టౌన్ కాంగ్రెసు నాయకుల సహాయముతో రైతులను ఒప్పించి సత్యాగ్రహమును నిలుపు చేయించితిమి. నిల్పుచేయించుటలో మన కాంగ్రెసు సంఘము శక్తివంచన లేకుండా పనిచేసినది. త్రిపురి కాంగ్రెసు నుండియే ఆంధ్రకేసరి టి. ప్రకాశంగారు (రివెన్యూమంత్రి)దారీ తెన్నులేని కాశీపట్నం అర్ధరాత్రివేళవచ్చి రైతుల కష్టసుఖములు స్వయముగా తెలుసుకొని వెళ్లుటయు, దరిమిలాను కాంగ్రెసు సేవకులపైన రైతులపైన పెట్టినకేసులన్ని ఉపసంహరించి ఖైదీల నందరిని, అనగా షుమారు 80 మందిని విడుదలచేసి రైతుల హక్కులను గురించి విచారించుటకు పూనుకొన్నందులకును, కాంగ్రెసు మంత్రివర్గమువారిని మన సంఘము తరపున, రైతుల తరపున, అభివందనములు తెల్పుచున్నాను.

వ్యవసాయ కూలీలు, కాంగ్రెసుసంఘం.

వ్యవసాయ కూలీలలో ప్రబోధము ఏమీ జరగలేదనే చెప్పాలి. మన తాలూకాలో వ్యవసాయ కూలీల సభలకు కొన్నిటికి మాత్రమే హాజరై కాంగ్రెసు ప్రచారము చేయగల్గినాము. సమాజములో అత్యంత నికృష్ట జీవితము ననుభవించుచున్నట్టి సమాజ పోషణ భావములో ప్రధానస్థాన మలంకరించుచున్నట్టి వ్యవసాయ కూలీల కష్టనివారణకు కృషిచేయక పోవడము పెద్దలోపమనే ఎంచవచ్చును. ఇంతటినుండియైనను నిశ్చిత కార్యక్రమముతో వారి కష్టములు తొలగించుటకు యత్నించి కాంగ్రెసు ప్రబోధము కలిగించవలసి యున్నది.

జిల్లాబోర్డు ఎన్నికలు.

గత జిల్లాబోర్డు ఎన్నికలలో సివిక్ బోర్డు అభ్యర్థుల నియమించుటకు పూర్వము ప్రతి ఫిర్కాలోను ఫిర్కా సభలు జరిపి ప్రజాభిప్రాయమును సివిక్ బోర్డువారికి తెలియపరచి అభ్యర్థుల నిర్ణయమునకు తోడ్పడినది. మొత్తముమీద సివిక్ బోర్డువారి సెలెక్షన్ కొన్ని ఫిర్కాలలో ప్రజామోదమును పొందజాలకపోయినను తాలూకా కాంగ్రెస్ సేవకుల, అభిమానుల ప్రత్యేక కృషివలన అన్ని స్థానములు కాంగ్రెసుకు లభించినందులకు అత్యంత సంతోషదాయకము.

ఇతర విషయములు.

కొప్పర్రు గ్రామములో తాలూకా రాజకీయ మహాసభనుకూడ జరిపి ప్రజలలో ఎక్కువ రాజకీయ ప్రబోధమునకు కృషి సల్పబడెను.

ప్రభుత్వోద్యోగుల లంచగొండి తనమును గూర్చి తగినంత కృషి చేయజాలకపోతిమి. 2. 3 కేసులలో కృషి చేసినను ప్రభుత్వ తోడ్పాటు ఈ విషయంలో తగినంతగా లేని కారణముచేత కృషిచేయుటకు అవకాశము లేకపోయినట.

ముగింపు

గత సంవత్సరము కాంగ్రెసు సంఘ నిర్వహణలో కల్గిన అనుభవమునుక్లుప్తముగా యీ నివేదిక వెల్లడించగలదని ఆశించుచున్నాము. ఈ అనుభవమును బట్టియూ ప్రస్తుత రాజకీయ వాతావరణమునుబట్టియూ, భవిష్యత్ కార్యక్రమము నిర్ణయించుకొనవలసియున్నది. ప్రస్తుత రాజకీయ వాతావరణంనుబట్టి కాంగ్రెసుసంఘములకు స్వాతంత్ర్యోద్యమమునకు ఇది అమూల్యకాలమని మనవి చేయుచున్నాను. రాబోవు సంవత్సరము త్రిపురీమహా సభలో ఆమోదింపబడిన జాతీయ వాంఛా తీర్మానమును తీవ్రముగా ప్రచారము చేసియు, జాతీయ వాలంటీరు దళమును ఏర్పరచి శిక్షణనిచ్చియు, వెనుకబడియున్న ప్రాంతములలోను రాజకీయ ప్రబోధములో వెనుకబడియున్న ప్రజాసామాన్యములోను, అత్యంతమగు రాజకీయ చైతన్యమును కలుగజేయవలసిన భారము, దీని కవసరమగు కార్యక్రమము, ఏర్పాటు చేసుకోవలసినబాధ్యత మనపైన కలదనిమనవిచేయుచు ఆ కార్యక్రమములో అత్యంత ఉత్సాహముతో పనిచేయుటకు సిద్ధము కావలసినదిగా కోరుచూ ఈ సభవారికి స్వాతంత్ర్యాభివందనములు సమర్పించుచున్నాను.

ఇట్లు,
ఉద్దరాజు సూర్యరాజు.
సెక్రటరీ,
నర్సాపురంతాలూకా కాంగ్రెస్ సంఘం,
పాలకొల్లు.

	జమ.	ఖర్చు.
	రు. అ. పై	రు. అ. పై
సభ్యత్వపుకాతా	1752-14-0	
జిల్లా కాంగ్రెసు సంఘపుకాతా		1095- 7-6
బాంకుకాతా	60- 0-0	150- 0-0
ప్రెస్‌కాతా		34- 4-0
విరాళములకాతా	100- 0-0	25- 0-0
అడ్వాన్సుకాతా	82- 8-0	82- 8-0
సిబ్బందికాతా		130- 0-0
స్టేషనరీ కాతా		18- 5-0
సామానులకాతా		23- 0-3
ప్రయాణపుకాతా		214- 9-0
గ్రామసంఘాలకాతా	5- 6-6	242-11-0
పత్రికలకాతా		16- 8-0
సాదరుకాతా		11- 8-0
భోజనపుకాతా		17-14 0
లైటింగుకాతా		2-10-9
అద్దెలకాతా		50- 0-0
పోస్టేజికాతా		33-15-3
మొత్తం		2148-5-3
	2000-12-6	
గత సం॥ చిఠానిల్వ	182- 2-0	
	2182- 14-6	
ఖర్చు	2148- 5-3	
నిల్వ	34- 9-3	
బాంకునిల్వ	90- 0-0	
నిల్వ	124- 9-3	
తేడా	0- 0-6	
నిల్వ మొత్తం	124- 8-0	

పహరావాని లాంతరు

(7 వ పేజీ తరువాయి) తెలివితో నిబ్బరమైన నాస్తికుడపై పుట్టుతావని నమ్ముతా.

కవి:- చచ్చిపోయే నిమిషంలో నైనా, అట్లాగ దేముణ్ణి గురించి ద్వేషంతో మాట్లాడటానికి భయపడటంలేదూ? అతనిని క్షమాపణ కోరవూ?

కూలివాడు:- కామ్రేడ్! దేముడే ఉన్నట్లయితే కోటానకోట్ల పనివారల ముందర అతగాడు మోకరించవలసింగే — మనలను కోటానకోట్లసార్లు క్షమాపణ వేడుకోవాలి — అయినప్పటికీ మనలను క్షమాపణ కోరటానికి కూడా అర్హుడుకాడు — ఎవరినైతే శతాబ్దాల తరబడి కాలిక్రింద నిలిపి, హింసించి, రక్తవరదలపాలు చేశాడో, ఎవరినైతే కేళీ వినోదం క్రింద నక్షత్ర మండలం నుండి చూచాడో అతడు మనలను క్షమాపణకోరటానికి అనర్హుడు. ఎవడైతే సాలీడులాగ బిత్తులమారితనంతో జాతి, కులం అనే గూడులను కట్టి మన మీదకు ఉరకడానికి సిద్ధముగా ఉన్నాడో .... ఓ కవీ, కవీ, కవీ! నీవు జీవితంలో మాట్లాడినా, పాడినా, ఒక్క సౌందర్యాన్ని కూర్చే కాని వేరే విషయం ప్రసక్తి లేనేలేదు! నీ వెప్పుడైనా కుష్ఠ వికృతాకారము, ప్రపంచకమును చుట్టుకొని ఉన్న జుగుప్సావహమైన కుష్ఠురోగమును చూశావా — నీ హృదయంలో నిమిడిఉన్న వేదాంతమునకది హెచ్చరిక సుమా! సరిగ్గా తిండి లేక, కాళ్ళల్లోనూ, చేతుల్లోను శక్తిలేక, వాళ్ళు ఏడ్చుట ఎప్పుడైనా చూశావా? ఆ ఆర్తనాదం అంటే ఆవేశం కల్గటంలేదూ? తమ నగ్నతను కప్పిపుచ్చుకునేందుకు మాత్రమే ప్రయత్నించు జీర్ణవస్త్రాలంకృతలను ఎప్పుడూ చూడలేదా? తమ నెవరైనా కొనుక్కుంటారేమో ఆ విధంగానైనా మర్నాటికి పట్టెడన్నము కొనుక్కొనే శక్తికల్గుతుందనే ఆశతో వీధులలోకి తరిమివేయబడిన ముదుసలి స్త్రీల నైనా చూడలేదా? నికృష్టమై మోసగించే పాడు సంఘం తొలగించిన మనుష్యులను, చోరులై బహిష్కరింపబడినవారైన వేలకొద్దీ మనుష్యుల్ని ఎరగవూ? వాడా గతికి పాలవటానికి ఈ పాడుసంఘమే కారణం. ఓ! నీవు సౌందర్యాన్ని గురించి మాట్లాడుతావు! నీవంటికవులు నాలుగో అంతస్తు మేడమీద కూర్చొని బాధపడుతూన్న ప్రపంచకాన్ని చూసి "మిన్కు మిన్కు" మనే కాంతిలో వారి సౌందర్యాన్ని గూర్చి వర్ణిస్తూ వ్రాస్తారు. వాళ్ళ దుఃఖాన్ని దూరాన్నుంచి చూస్తూ చక్కటి పద కూర్పులో చిత్రిస్తారు. గ్రుడ్డి దీపమైనాలేని వారి గుడిసెలను, చనిపోతూన్న బిడ్డలను, నక్షత్రాలతోటి, మేఘాలలోటి కలిపి ప్రపంచ భావనా కవులలో గణ్యత చెందుతావు! కవీ! నీవే నిజంగా పునర్జన్మ ఎత్తినట్లయితే, కాస్త తినటానికి ఉన్న 'దర్జా' కవిగాగాక, కొంత మట్టుకు యదార్థమైన కవివై పుడతావని ఆశిస్తాను— —ఏదో తనకి, తన సంసారానికీ పనికి వచ్చే కూలివాని వంటింట్లోని మట్టికుండ మాదిరిగ పుడతావనుకుంటా. కాని అంతకంటే కొంత ఉపయోగంగా, కూలివానివైపుట్టి మన సోదరులనంతా జ్వాలలాగా వెలిగే ఎర్రబావుటా క్రిందకు జతపరుస్తా వనుకుంటా. ఎర్రజండా, అప్పుడే సామ్రాజ్యాలను హడలెత్తించేస్తూన్న ఆఎర్రబావుటా!

కవి:- కామ్రేడ్ నేనెప్పుడూ కని విని ఎరుగని మహాకవి మాట్లాడినట్లుగ మాట్లాడినావు. అయ్యో—నేనెందుకు ఈ శక్తిని, మహోత్కృష్టమైన విషయం కోటానకోట్ల ప్రజల నగ్నమైన సత్యం, ఇంతకుముందే చూసినాను కాను! ఓ పరమేశ్వరా! నిజంగా నీవే అక్కడ ఉన్నట్లయితే—

(బాకా పిలుపు)

గాఢ నిశ్శబ్దత—తరువాత కావలివానిశబ్దం—మరల తలుపు తెరచేందుకు తాళముచెవితో వస్తాడు.

వర్తకుడు:- అహా! నాతనయా! పెండ్లిచేసికొనటానికి సిద్ధంగా ఉన్నావా?

(కావలివాడు ఒకమాటైనా అనడు—తలుపు తెరచును—ఇవతలికి ఒకరితర్వాత ఒకరిని తీసికొని వచ్చును).

కవి:- శలవు కామ్రేడ్స్! నేను కూలివారి జన్మ ఎత్తుతాను కూలివానిగా!

వర్తకుడు:- (హటాత్తుగ జ్ఞప్తికి వస్తుంది) ఎక్కడకు తీసికొని వెడుతున్నారు? ఎక్కడికి? ఓ! ఎక్కడికి! ఉరికంబము! ఉరికంబము! ఓ! నా భార్యా బిడ్డలు—ఓ!! ఓ!!—నేను చచ్చిపోలేను! (ఆతుదిమాట అనేముందు అవతలికి తీసికొని పోబడతాడు.)

కూలివాడు:- సుప్రభాతం, కామ్రేడ్ కావలావాడా! నీవంటే, నాకెంతేనా విచారమేస్తుంది. మావలెనే నీవుకూడా ప్రభుత్వానికి బలి అగుచున్నావు! కాని పరిస్థితులు త్వరలోనే మారుతాయి! విప్లవము వస్తుంది—విప్లవము వచ్చి తీరుతుంది—ఉదయారుణ కాంతిలాగ, ఉదయారుణ కాంతినంతమునతో.

(బయటికి పోతూ అంతర్జాతీయ గీతాన్ని పాడుతాడు — జైలు గుమ్మమువతల జనుల గుంపులున్నట్లు దూరాన్నుండి స్వరాలు మేళవిస్తాయి—తరువాత నిశ్శబ్దం. కావలివాడు వెలిగించిన మూడువత్తుల లాంతరును తిరిగి పెడతాడు. నెమ్మదిగ, ఎంతో నునుపుగ లాంతరు అద్దపు తలుపు తెరచి, మూడు దీపాలను ఒకటి తర్వాత ఒకటి ఊదేస్తాడు. దీపం లేని లాంతరుమాత్రం అతని చేతిలో ఉంటుంది.)

గాంధి-బోసు లేఖలు

(14వ పేజీ తరువాయి) సామరస్యంతో పనిజరుగుటయు సాధ్యమగును. ఈ సందర్భంలోనే పండిత పంతు తీర్మానం గురించి ఏప్రిల్ 6 తేది లేఖయందు నేను జ్ఞాపకము చేసియుంటిని ఈ తీర్మాన ప్రకారం వర్కింగు కమిటీని మీ అభిమతాను సారంగా నియమించాలి. అంతేగాక మీ సంపూర్ణ విశ్వాస మది పొంది యుండే విధముగ కూడా నియమించాలి. ఈ తీర్మానమును మీరొకసారి గుర్తించిన తర్వాత మీ విశ్వాసము బడయని వర్కింగు కమిటీని నియమింప మీరు సలహా యిచ్చుటకు వీలు లేదు.

4. పై సూచనలు కూడా మీరు నిరాకరించినట్లయితే, ఇక మిగిలేది ఒక్కటే మార్గం. అదేమంటే, వర్కింగుకమిటీని నియమించే పూర్తి బాధ్యతను మీరే వహించి, మీ నిర్ణయం ప్రకటించిన తర్వాత భావికార్యక్రమం నిర్ధారించుట నాకు వదలిపెట్టాలి.

★

మహాత్ముని లేఖ

రాజకోట, 10 ఏప్రిల్ 1939

ప్రియమైన సుభాష్,

మీ 6 వ తేది జాబు ఇచటికి డైరెక్టు చేయబడగా అందినది.

దాపరికం లేకుండా మాట్లాడి విభేదాలు తొలగించుకోగలందులకయి వైరులు సభకూడాలని నేను సూచించియుంటిని. కాని తదనంతరం ఇప్పటి కెన్నో సంఘటనల మూలంగా పరిస్థితులు శ్రుతిమించిపోయినవి కావున మరి అట్టి సభవల్ల ఇక ప్రయోజనం వుంటుందని అనుకోను. పైగా అందులో వారు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకొని, ఇంకా స్పర్ధలు పెరిగిపోవును. ఒండొరులమధ్య విభేదాగాధము చాలా విస్తరించి పోయింది. అనుమానాలు ప్రబలిపోయినవి. ఇక యేకంగాచేసే దారి నాకు పొడకట్టడం లేదు. ఇక మిగిలియున్న దొకటే మార్గం. విభేదాలు గుర్తించుకొని, ఏపక్షమునకావక్షము తన యిచ్ఛవచ్చి నట్లు పనిచేయనిచ్చుట.

ఈ విరోధబలగాలను సంయుక్త కార్యాచరణంకోసం ఏకంచేయగల శక్తి నాకులేదు. ఈ సంగతి నేను గ్రహించాను. వారు తమతమ పాలసీలను ఉచిత గౌరవంతో పనిచేసుకోవాలని నా అభిప్రాయము. వారట్లు మెలగినచో, దేశమునకది హితము.

పండితపంతు తీర్మానమును నేను వ్యాఖ్యానము చేయజాలను. దానిని పరిశీలించినకొలదీ కదిఅసహ్యమగుచున్నది. అయితే తీర్మానం తయారు చేసినవారి యుద్దేశం మంచిదే. కాని యిప్పటి చిక్కునకు ఇది విరుగుడుకాదు కనుక దానికి మీరు మీకుతోచే అర్థమున్సే తీసి, ఎదను గుణ్యంగా యెట్టి సంశయములేకుండా మెలగ వచ్చును.

మీపై నేను నాయిష్టమైన కేబినెటును తెచ్చి పెట్టలేను: అలా తెచ్చిపెట్టను. నిర్బంధముగా కట్టిపెట్టే కేబినెటు మీకువద్దు. మీకేబినెటును, మీపాలిసీను ఏ. ఐ. సి. సి. ఆమోదించునట్లు నేను పూచీకూడా ఇవ్వజాలను. అట్లు చేయుట నిర్బంధముగ అభిప్రాయములను నిరోధించుట యగును. కనుక సభ్యులనే తమ నిర్ణయము నొసగనీయండి. మీకు మెజార్టీవోటు రాకపోతే మీరు మెజార్టీపక్షమును మీకనుకూలముగ లిప్పు కొగలిగే వరకూ అపోజిషన్‌కు నాయకత్వం వహించి నడపండి.

నాకంతటా దౌర్జన్యస్వభావమే పని తగులుచున్నదని మరల తెలుపుచున్నాను. దౌర్జన్యరహితసమరమునకు తిరిగి వాతావరణము నాకు కనుపించుటలేదు. రామదుర్గలోని పాఠము మీకు చాలలేదా? అది వుద్యమానికి చాలా హాని కలిగించినదనియే నా అభిప్రాయము. ఈసంఘటనము ముందుగా ఆలోచించి తలపెట్టినదిగా నాకు కనుపించినది. ఒరిస్సా రాష్ట్రము రాణపూరులోపలెనే. దీనికిగూడా కాంగ్రెసువారే బాధ్యులు. ఇందును బట్టి యయినా మనమిద్దరము ఒకే విషయమును భేదదృష్టులతో చూచుచున్నామనీ, భిన్నసారాంశాలు తీయుచున్నామనీ మీకు తెలియుటలేదా? అలాంటప్పుడు మనకు రాజకీయములలో ఎట్లు పొత్తు కుదిరి, ఒకే వేదికపై కలుసుకోగలము?

★

బోసు లేఖ.

జీల్‌గోరా, ఏప్రియల్ 13.

ప్రియమైన మహాత్మాజీ!

భారత జాతీయ కాంగ్రెసు దురదృష్టమా అనునట్లు రాజకోట విషయములు మిమ్ములను ఆవరించినవని నాలో నాదేర్పడిన అభిప్రాయము నేటికిని మారలేదు. నావంటివారికి కాంగ్రెసుకు సంబంధించిన విషయములు — ముఖ్యముగ ప్రస్తుత సందర్భమున—మీ రాజకోట పిలుపు కన్నను వేయిరెట్లు ముఖ్యాతి ముఖ్యములుగ కనుపించును. గ్వాయరుగారు రాజకోట విషయమై తీర్పు చెప్పిరి గదా. ఇక అచ్చట ఉండి నడపించుటకు సర్దారుగారు చాలరా? మీరే స్వయముగ వెళ్ళవలెనా, వెళ్ళినను యిన్నినాళ్లు అచ్చటనే ఉండవలసి యుండునా అని ఎవ్వరైనా అనుకొనక మానరు. ఏమైన నేమి, వెళ్ళవలసినదే అని మీరు నిశ్చయించితిరి; వెళ్ళితిరి. ఇక ఆ విషయమై చింతించి ప్రయోజన మేమి?

ఈ నెల 10 వ తేదీన మీరు వ్రాసినలేఖ యిప్పుడే నా కందినది. నాకు తోచిన విషయములు కొన్నిటిని నేను చెప్పవలసివచ్చినది.

అనేక అంశములకు మీ రిచ్చు సమాధానములు అసంతృప్తి కల్గించుచున్నవి.

సంస్థానములలో కూడ హింసారహిత సత్యాగ్రహముపై మీకు నమ్మిక లేనపుడు సంస్థాన ప్రజల స్వత్వములు, వారికి బాధ్యతాయుత ప్రభుత్వము, ఎట్లు సాధింప నెంచితిరి? ఎంత చెప్పినను, మేము కోరునది హింసారహిత సత్యాగ్రహమే. అది నిరాకరించినపుడు మనము మితవాదుల పద్ధతియో, లేక, ఆత్మ త్యాగ విధానమో అవలంబించక తప్పదు. మీకు పలుకుబడి ఉన్న చోట్లలో శాస నోల్లంఘనోద్యమము ప్రవేశపెట్టుటను మీరు అపివేసితిరి. రాజకోట విషయమున మీరట్లే చేసితిరి. తరువాత భారమంతటిని మీమీదనే వేసికొని మీ అనువులను ఒడ్డితిరి మీరట్లుచేయుట దేశ ప్రజలకు రాజకోట సంస్థానప్రజలపట్ల న్యాయప్రవర్తనయేనా? తలచినపుడెల్ల యిష్టానుసారము వినియోగించుటకు మీ ప్రాణములు మివి కావు. రాజకోటకన్నను ఉన్నతమగు విషయమపేక్షించుహక్కు దేశ ప్రజలకు గలదు రాజకోట ప్రజలవిషయము మాత్రము చూచినచో, వారు స్వయంకృషివలనకాక మీరు చేసిన త్యాగ ఫలితముగ స్వరాజ్యము పొందిరేని, వారికి రాజకీయ అభివృద్ధి కలుగలేదన్నట్లే. వారికి మీరు సంపాదించి యిచ్చిన స్వరాజ్యమును వారు కాపాడుకొనజాలరు. కిడపటిమాట ఇకను ముందు ఎన్నిచోట్లకో ఎన్ని పోరాటములలో మనము పాల్గొనవలసివచ్చునో. ఈ రీతి మీ అమూల్యప్రాణములను ఎన్నిటికని మీరు అడ్డు పెట్టగలరు?

రాజకీయ విరుద్ధాభిప్రాయముల వల్ల ఐకమత్యత,కలిసి పనిచేయుట ఎట్లు సాధ్యంకాదో ఊహించలేకున్నాను. సంయుక్త యాజమాన్యము అసాధ్యమన్న అభిప్రాయము మీ రింకవీడకాకున్నచో, కాంగ్రెసు భవిష్యత్తు అంధకార బంధురమై యుండును. ఈ అగాధమును మీ సహాయముతో పనిచేసి, దేశమునకుకలిగిన యీ విపత్తు తొలగించవచ్చునని యిన్నినాళ్ళు నేను ఆశపెట్టుకొని యుంటిని.

మీ ఆమోదార్థము మార్గాంతరములను కొన్నిటిని సూచించితిని.

మొదటిది: జాతీయ సమరము మరల ఆరంభించుట. ప్రస్తుత చిక్కులు తన్మూలమున చాల భాగము పరిష్కారమగును. ఈ సూచనను మీరు అంగీకరింపరు.

రెండవది: నేనే ఒక కమిటీని ఏర్పరచవలసివస్తే తమకు ఒక్కరని చెప్పాలి. నాయందు విశ్వాసం ఉందని ప్రకటించాలి. ఇది కూడా సాధ్యంకాదని మీరన్నారు.

మూడవది: వర్కింగుకమిటీపైని సంపూర్ణ అధికారాన్నంతటిని మీరే స్వయంగా వహించాలని సూచించాను. ఇలా చేయడంవల్ల చాల అవాంతరాలు తొలగిపోతాయి. ఎన్నోకష్టాలు తీరిపోతాయి. ఈ సూచనను మీరు బాబయినా ఇవ్వరుకారు. ఈసూచననుకూడా మీరు నిరాకరిస్తే ఇక నేను చేయవలసిన దేమీ లేనట్లే. వర్కింగు కమిటీని యేర్పాటు చేయవలసిన బాధ్యతనంతటినీ మీరేవహించవలసియుంటుంది.

త్రిపురి కాంగ్రెసు మీపైని పెద్ద బాధ్యత మోపింది. మీరీబాధ్యతను నిర్వహిస్తారని నేనాశిస్తున్నాను దీనికి కూడా మీరు ఒప్పుకొనకపోతే నేనేమి చేసేది. ఈ విషయాన్ని ఏ. ఐ. సి. సి. కి తెలిపి, వర్కింగు కమిటీని ఏర్పరచ వలసిన పనిని ఆసంస్థకే విడిచిపెట్టేదా? లేక మీరు మరేదయినా సలహా చెబుతారా?

ప్రణామములు
'సుభాష్'

★

గాంధీగారి లేఖ

రాజకోట, ఏప్రిల్ 17

రాష్ట్రపతి సుభాసబోసుగారికి జీల్గోరా,

మీ జాబు చేరింది, ఏ. ఐ. సి. సి. సభ 29 వ తేదీనే జరుగనివ్వండి. నేను కార్యవర్గమును నియమించి మీపైన రుద్దడానికి నాకిష్టములేదు. అట్లు జరుగుట అసాధ్యము. మీరు కార్యవర్గమును ఏర్పాటు చేయకపోతే ఏ. ఐ. సి. సి. వారే ఆ విషయాన్ని తీర్మానించ నియ్యండి. విభిదపక్ష కార్యవర్గము ఆచరణీయం కాదని తోస్తూవున్నది.

బాపు

★

బోసుగారి లేఖ

జీల్గోరా, ఏప్రిల్ 20

ప్రియమైన మహాత్మగారికి నేడు మీకొక తంతివార్త పంపాను. గతమూడు వారములలో మనకు చాల వుత్తరప్రత్యుత్తరాలు జరిగాయి కాని కార్యవర్గ నిర్మాణమును గూర్చి ఫలిత మేమియు తేలలేదు. కాని అందువల్ల మన అభిప్రాయాలు విశదపడ్డాయి. కార్యవర్గము లేకుండా కాలయాపన చేయుటకు వీలు లేదు. కనుక ఆవిషయము వెంటనే తీర్మానము కావాలి ప్రస్తుత భారతదేశ పరిస్థితులను, అంతర్జాతీయ వ్యవహారములను బట్టి చూడగా కాంగ్రెస్ వర్గాలన్నియు ఒకటిగాచేరి సంయుక్త ప్రతిఘటనకు సిద్ధపడుట అత్యవసరమని తెలియుచున్నది. అంతర్జాతీయ పరిస్థితులు దినదినానికి విషమించుచున్నవని మీకు బాగా తెలియును. ఇప్పుడు రాష్ట్రప్రభుత్వాలకువుండే కొద్ది అధికారాన్ని కూడా, యుద్ధం వచ్చినప్పుడు, తీసివేయుటకై బ్రిటిషు ప్రభుత్వమువారు ఇండియా చట్ట సవరణ బిల్లును ప్రవేశ పెట్టారు.

కనుక ప్రస్తుత స్థితిగతులను గమనించిన యెడల, త్వరలో మనము కనివిని ఎరుగనట్టి క్లిష్టపరిస్థితు లేర్పడునని నిస్సందేహముగా చెప్పవచ్చును. మన భేదాభిప్రాయము లను పారద్రోలుకొని ఒకటిగా చేరినగాని మనము ఆక్లిష్టపరిస్థితులను ఎదుర్కొనజాలము కనుక మనము కాంగ్రెస్ సంస్థలో సంఘీభావము, క్రమశిక్షను నెరపుటకు తగు ప్రయత్నములు చేయుటఅత్యవసరము ఈపని మీరు నాయకత్వం వహించినప్పుడు, మేమందరము, మాశక్తి కొలది మీకు తోడ్పడి, మీ పద్ధతులనే అనుసరింపుచుందుము.

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ సాధారణ సమావేశము

ది 23—5—39 వ తేదీన నిడుబ్రోలులోని రైతాంగ విద్యాలయంలో సాయంత్రం 2 గంటలకు ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ సాధారణ సభ్యుల సమావేశము జరుగును. గాన సభ్యులెల్లరు తప్పక హాజరు గాగలందులకు కోరుచున్నాను. కార్యనిర్వాహకవర్గ సమావేశము ఉదయం 9 గం॥లకు జరుగును

ఎజెండా.

1. సంఘ అధ్యక్ష, కార్యదర్శి, కార్యవర్గ ఎన్నికలు
2. అఖిలభారత రైతు మహాసభను ఆంధ్రదేశములో జరుపుటకు తగిన ఏర్పాట్లు చేయుట గూర్చి ఆలోచించుట
3. జమీందారీ, ఈనాందారీ వుపసంఘముల నేర్పాటుచేయుట
4. అమ్మకపు పన్ను, పుగాకు పన్ను వగైరా నూతన పన్నుల గూర్చి ఆలోచించుట
5. రాష్ట్రసంఘ కోటాను చెల్లించని జిల్లాసంఘములగూర్చి ఆలోచించుట
6. అఖిలభారత కిసాన్ సంఘ నిబంధనావళిలో మార్పులగూర్చి ఆలోచించుట
7. జమా-ఖర్చులు, కార్యదర్శి ప్రవేశపెట్టు యితర విషయములు.

ఇట్లు,
కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి,
అధ్యక్షుడు,
ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం.

బెజవాడ,
11—5—39.

బ్రిటన్ - సోవియట్ సంప్రదింపులు

ఆంగ్లో - టర్కిష్ ఒడంబడిక

డిక్టేటర్లు : ఛాంబర్లేన్

డిక్టేటర్ల (హిట్లర్, ముసోలినీ) ను సంతృప్తి పరచే విధానం చావలేదా? ఛాంబర్లేను ఇంకా వారితో సంధికి రావాలనే చూస్తున్నాడా? అనే ప్రశ్నలకు జౌనని సమాధానంగా గతవారము వ్రాశాం. దానిని బలపరచే వార్తలు ఈవారము కూడా వచ్చాయి.

పార్లమెంటులో కామన్సు సభలో బ్రిటిషు ప్రధానిని జాన్‌స్టన్ అను ఒక సభ్యుడు "స్నేహపూర్వకమైన సమాధానానికి ప్రయత్నించండి"అని మీరు బ్రిటిషు ప్రభుత్వానికి సలహా నిచ్చారా? అని అడిగాడు. దానికి జవాబుగా ప్రధాని ఛేంబర్లేన్, "బ్రిటిషు ప్రభుత్వం ఎప్పుడూ స్నేహపూర్వకమైన సంధిని వాంఛించుతుందని పోలండు ఎరుగును"అని అన్నాడు. దృఢమైన జవాబు అని పత్రికలన్నీ వ్రాసిన కర్నల్ బెక్ (పోలిష్ విదేశ మంత్రి) ఉపన్యాసాన్ని బ్రిటిషు ప్రధాని "దృఢమైనదీ, సంధిని వాంఛించేదీ" అన్నాడు. ఇంతే గాదు. బ్రిటిషు విదేశ వ్యవహార సహాయ కార్యదర్శి అయిన బట్లరు మరొక ప్రశ్నకు సమాధానం చెబుతూ, "బ్రిటిషు ప్రభుత్వము అంతర్జాతీయ తగాదాలను, స్నేహపూర్వకమయిన సంభాషణల ద్వారాగాని, మధ్యవర్తిత్వం ద్వారాగాని లేక ఇతర శాంతివిధానాల ద్వారాగాని, పరిష్కరించుకోడానికి ఇష్టపడుతుంది ఏపక్షంగాని కోరినట్లయితే మేము మా సహాయము చేయడానికి సిద్ధముగా ఉన్నాం" అని అన్నాడు. అంటే దీని అర్థం ఇంకా తాము మధ్యవర్తిత్వం వహించి, అవసరమయితే, పోలండువారి డాన్జిగ్‌ను జర్మనీకి ఇప్పింతురాని తేలుతుంది.

జర్మను అల్లర్లు

అప్పుడే డాంజిగ్ నాటకానికి నాంది ప్రారంభమయింది. జర్మన్ సైలీషియాలో, జర్మనుల అల్లర్లు ప్రారంభమయాయి. పోల్ జాతివారిని కొట్టడం, వారి షాపుల్ని దనలు చెరచడం, వారి స్కూళ్ళను పాడుచేయడము, కిటికీలు బ్రద్దలుచేయడం—ఇదీ వరుస.

ఇక పోలండులో పోస్నాన్ సరిహద్దులలోనుండి 13 జర్మనులను అసత్య ప్రచారాలు గావించుతున్నందుకు వెడలగొట్టారు. పోలిష్ కారిడర్ సరిహద్దుల నుండి రహస్య కుట్రలపన్నుచున్నందుకు ఇద్దరు స్త్రీలను వెళ్ళగొట్టారు. పోస్నాన్‌వద్ద రహస్యముగా సరిహద్దును దాట ప్రయత్నించినందుకు 6 గురు జర్మనులు 2 నెలల శిక్షను పొందారు.

తగాదాకు కేంద్ర స్థానమైన డాంజిగ్‌లో అల్లరులు వృద్ధి పొందాయి. పోలండ్ జాతీయవీరుడగు పిల్సూడ్స్కీ స్మారకోత్సవం చేసుకొంటుంటే, డాంజిగ్‌లోని నాజీ పక్షంవారు కొట్లాటలు సాగించారు. పిల్సూడ్స్కీ పటంవంక రాళ్లు విసిరారు. పోలిష్ కాఫీ హోటల్‌ను పడగొట్టారు. వార్తా పత్రికా కార్యాలయం కిటికీలు బ్రద్దలు చేశారు. పిల్సూడ్స్కీ స్మారక సభను పోలులు మానివేశారు. నాజీలు అత్యధిక సంఖ్యాకులు గల శాసన సభ మాత్రం పూర్వం బాంబు దురంతమువల్ల జరిగిన ఘటనలకూ, నాజీలు ఒక పోలిష్ మాస్టరుపై దాడి సల్పినందుకూ విచారాన్ని తెలియజేశారు. డాంజిగ్ పోలీసులు అల్లర్లను ఆపడానికి సహాయం చేయలేదు.

డాంజిగ్‌లో ప్రవేశించే పోలిష్ వార్తా పత్రికలన్నీ, వశపరచుకోవలసిందని నాజీలు ఆజ్ఞాపించారు. ఇదంతా డాంజిగ్ శాసనసభ (నాజీలు పలుకుబడి గల్గి అధికారములో ఉన్నది) చేస్తున్నదని పోలండు ప్రకటించింది.

ఒక ప్రక్కన జర్మనులు ఇలా అల్లరిని ప్రోత్సహించుతున్నారు. బ్రిటిషువారి విధానం తెలిసిన జర్మనీ పత్రికలు ఇలా వ్రాస్తున్నాయి. "పలుకుబడి గల ప్రదేశాలను విభజించుకొనే పద్ధతిపైననే, జర్మనీ బ్రిటనులకు సంధి కుదురుతుంది. బ్రిటిషువారి రాజనీతిని తిరస్కరించి కూడా డాంజిగ్‌పై జర్మనులకు గల అధికారాన్ని పొందుతాము. ఈ సమస్యను గురించిన పరిష్కారాన్ని ఆలస్యం చేయవచ్చు కాని ఆపలేరు."

బ్రిటన్—సోవియటు సంప్రతింపులు

హిట్లర్‌ను సంతృప్తిపరచడానికి, ఛాంబర్లేన్ జకోస్లొవేకియా తగాదా సమయములో 2 సార్లు హిట్లర్ వద్దకు పరుగెత్తాడు. కాని సోవియట్ (రష్యా) తో సంప్రదింపులలో మాత్రం ఆలస్యం చేస్తున్నాడు. వ్యక్తిగతముగా సోవియట్ ప్రముఖులతో కలిసికోరాదా అని ప్రశ్నించితే, మాటిమాటికీ మారిపోతున్నారని (లిట్వినాఫ్‌ను ఎగతాళి చేశాడు. ఈనాడు బ్రిటన్, ఫ్రాంసులలో ఈసంప్రదింపుల ఫలితం ఆలస్యం కావడానికి కారణం, రష్యా వెనుకంజ వేస్తున్నదని, రష్యా అపార్థము చేసుకొంటున్నదని ప్రచారము చేస్తున్నారు. రష్యా వెనుకంజ వేయడం అబద్ధమైనా, బ్రిటిషు వైఖరిని సందేహించుతున్న దనుటలో ఏమాత్రము సందేహములేదు. దీనికి కారణము బ్రిటిషువారి సూచనలే.

సోవియట్ ఎప్పుడూ శాంతినే కోరుతున్నది. జకోస్లోవేకియాను హిట్లర్ కాజేసిన వెంటనే మార్చి 15 వ తేదీన ఆరు రాజ్యాలవారు కలసి సభ జరపాలని సూచించితే "ఇంకా సమయంకాదని" బ్రిటను త్రోసివేసింది. అయినా ఇప్పుడు బ్రిటన్, ఫ్రాంసులు బాల్కన్ మొదలుకొని, నల్లసముద్రమువరకు సహాయముచేస్తే, తాను పోలండ్, బెల్జియం, స్విట్జర్‌లండ్‌లకుకూడ సహాయము కావించుతానని తెలిపింది. కాని బ్రిటన్, తానూ, ఫ్రాంసూ పోలండ్, రుమేనియాలకు ఇచ్చినట్లే, సహాయము ఏ షరతులేకుండా ఈయమంటున్నాయి. పోతే వారు చేసే సహాయము మాత్రము వీటిమీద దాడి వస్తేనట! సోవియట్,ఈ వైఖరికి గల అర్థాన్ని బయటపెడుతూ ఒక ప్రకటన గావించింది.

"మా సూచనలకు బదులు, బ్రిటన్ మే 8 వ తేదీన కొన్ని సూచనలు గావించింది. బ్రిటను సూచనలకు ఫ్రాంసుకూ అభ్యంతరములేదు. సోవియట్ తన సరిహద్దులలోనున్న ప్రతిదేశానికీ సహాయము చేయాలని వాటి సూచనలులేవు. కాని, (బ్రిటన్, ఫ్రాంసు) సహాయము గావించుతామని వాగ్దానము గావించిన రుమేనియా, పోలండ్‌ల విషయమై, యుద్ధంలో తగుల్కోవలసి వస్తే, సోవియట్ సహాయము చేయాలట. తూర్పు యూరప్‌తో కొన్ని రాజ్యాలకు సోవియటుకు గల సంబంధాల ననుసరించి సోవియట్ యుద్ధములో తగుల్కోవలసివస్తే, బ్రిటన్, ఫ్రాంసుల సహాయము దానిలోలేదు."

దీని అర్థము ఏమిటి? రుమేనియా పోలండులకు, బ్రిటన్ ఫ్రాంసులు గావించినట్లే ఎట్టి హామీలులేకుండా సోవియట్ సహాయము గావించితే, జర్మనీ ఒకవేళ రుమేనియా పోలండులను ఎదుర్కొనకపోవచ్చు. ఒకవేళ ఎదుర్కొన్నా, డాంజిగ్‌ను ఇప్పించి, తమ రుమేనియా వర్తకానికి అడ్డులేకుండా బ్రిటన్ ఉండవచ్చు. పోతే జర్మనీకి రష్యాను ఎదుర్కొటానికి మరోమార్గం ఉంది. అది లిథూనియా, లాట్వియా, ఇస్తోనియాల గుండా లెనిన్‌గ్రాడ్ (రష్యాలో పెద్ద పట్టణము) పై బడటము. ఇలా దెబ్బగొట్టితే, రష్యాకు సహాయము గావించడానికి బ్రిటన్, ఫ్రాంసులు రానవసరము లేదు ఇపుడు బ్రిటన్ సూచనల ననుసరించి. కాబట్టి ఈ బ్రిటిషు సూచనలు, తాము బయట ఉండి, రుమేనియా పోలండులపైన హిట్లర్‌దృష్టిని తప్పించి, సోవియట్ పైకి పోయేటట్లు కావించుతాయి. అందుకనే సోవి శంకించుతున్నది. ఫ్రాంకో—సోవియట్ (ఫ్రాంసు—రష్యా) సంధి ఉన్నది కదా, మళ్ళా హామీ ఎందుకని ఫ్రాంసు ఓదార్చ చూస్తున్నది. కాని ఈ సంధి, జకోస్లొవేకియాను మ్రింగినప్పుడు ఫ్రాంసు ఆచరణలో పెట్ట దానికి తయారుకాలేదు. బ్రిటిషువారి ఈయెత్తుకు సోవియట్ ఒప్పుకోదు.

సోవియట్ బాల్టిక్ దేశాలు

బ్రిటన్‌తో సంప్రదింపులే గాక, సోవియట్ పోలండుతోకూడ సంప్రదింపులు సాగించుతున్నది. బాల్టిక్ దేశాలతో కూడ సంప్రదింపు సాగించబోతోంది. జినీవాలో నానాజాతిసమితి సభ జరిగాక బాల్టిక్‌దేశాలను (లిథూనియా, లాట్వియా, ఇస్తోనియా) పొటెమ్కిన్ (రష్యా విదేశ సహాయమంత్రి) దర్శించుతాడట!

ఆంగ్లో—టర్కిష్ ఒడంబడిక

ఒక ప్రక్క సోవియట్‌తో సంప్రదింపులు 7 వారాలకు పైగా సాగుతూ వచ్చాయి. కాని ఏ ఒడంబడికకు రాకముందే, ఇటలీ—జర్మనీలు మిలాన్‌వద్ద సంధి చేసుకొన్నాయి. ఇవి చేసుకొన్న మిలటరీ సంధి మళ్లా బ్రిటన్, ఫ్రాంసులపై కొంత ఒత్తిడి తెచ్చాయి. ఛాంబర్లేను, దలదీరులు మేకపోతు గాంభీర్యంతో ఉపన్యాసాలిచ్చారు.

మధ్య ధరాసముద్రములో, ఎవరికి అపాయము గలిగినా ఒకరికొకరు సహాయము చేసుకోవాలని ఈ సంధి ఉద్దేశ్యము. సంపూర్తి వివరాలు రాలేదు కాని సారమిదే. ఈ ఒడంబడికతో టర్కీ 'తటస్థత' వదలింది. ఈ సంధి రష్యాపై ఒత్తిడి—బ్రిటన్ గావించిన సూచనలతోనే, సంధికి రమ్మని ఒత్తిడి—తేవడానికి ఉపయోగిస్తుంది.

ఫ్రాంసు, బ్రిటనుల ఎత్తులకు ప్రతిఎత్తులు డిక్టేటర్లు వేస్తున్నారు. బల్గేరియా—రుమేనియా సరిహద్దులలో అల్లర్లు లేపారు. యుగోస్లేవియా రాజు, ఇటలీలో తిరుగుతున్నాడు — దలదీర్, ఛాంబర్లేనులకు జవాబుగా ముస్సోలినీ ఉపన్యసించాడు. ఆ ఉపన్యాసములో డాంజిగ్, పోలండు, రుమేనియాలను గురించి లేదు- కాని జర్మనీ, ఇటలీ బలాన్ని గురించి, పొగడుకోటం, తాము ఇద్దరూ కలసి తమ కోర్కెలను సాధించుకొంటామన్న బెదరింపుమాత్రము విడువలేదు.

తాల్చేర్ ఒడంబడిక భగ్నమైంది.

తాల్చేర్ సంస్థాన ప్రభువు పెట్టుచున్న బాధ లనుభవించలేక సుమారు 31 వేలమంది ప్రజలు సకుటుంబ సపరివారంగా "అన్గుల్"కు లేచి వచ్చి, అక్కడ పడరాని బాధలన్నీ పడుచున్నారనే విషయము అందరికీ తెలిసినదే. ఈవిషయమై ఒరిస్సాసంస్థానాలలో బ్రిటిష్ ప్రభుత్వము తరఫున ప్రతినిధిగా ఉన్న మేజర్ హెన్నెస్సే గారికిన్నీ సంస్థాన ప్రజల తరఫున హరికృష్ణ మెహతాబ్ గారికిని మార్చి 21 వ తేదీని ఒడంబడిక జరిగింది. దీనిని అమలుజరుపకపోవడం, హానికరమే గాకుండా, మహానేరం అనికూడా చెప్పబడింది.

ఈ ఒడంబడిక జరిగినదని తాల్చేరు ప్రజలు తిరిగి తమ స్వగృహములకు పోనున్నారని ఒక ప్రకటన వెలువడింది. వెంటనే ఆవార్తను ఖండిస్తూ, బ్రిటిషు ప్రభుత్వ ప్రతినిధి ఆమోదించిన ఒడంబడికను తాల్చేరు ప్రభువు అంగీకరించలేదని మరియొక వార్త ప్రకటింపబడింది.

ఒడంబడిక వివరాలు

1. సెస్సులు 5 అణాలనుండి 3 అణాలకు తగ్గించి వచ్చే నవంబరునుండి ప్రారంభమయే సెటిల్మెంటులో శిస్తులు సెస్సులు కలసి "అన్గుల్"లో నున్న అదే రకపు భూమియొక్క శిస్తులు, సెస్సుల మొత్తానికి మించరాదు. 2. చర్మాలు, వస్తుపదార్థాలమీద తప్ప, మిగతావాటిమీద "మొనాపలీ"లను రద్దుచేయుట. 3. పంచాయితీ, మత. కోర్టులచే విధింపబడిన జరిమానాలను వసూలు చేయుటకు ప్రభుత్వ యంత్రాన్ని వినియోగించరాదు. 4. నిర్బంధ సేవను రద్దు చేయాలి. పబ్లిక్ పనులకై ప్రజలచే పనిచేయించుకొనునప్పుడు వారికి న్యాయమైన కూలి ఇవ్వాలి. 5. పారిశ్రామిక వర్గముపై వసూలుచేయబడే తలపన్ను రద్దు చేయాలి. 6. సంస్థానములోకి తిరిగివచ్చిన ప్రజలను ఏమీ హింసించరాదు. 7. ప్రజలు పాల్గొనుటకు వీలుగా నుండే బాధ్యతాయుత ప్రభుత్వమును త్వరలో ఏర్పరచుట. 8. వాక్కు పత్రిక సభా స్వాతంత్ర్యములను ఏర్పరచుట. 9. ప్రజల భూములను ధ్వంసము చేసే అడవి మృగాలను నంపుటకు ప్రజలకు హక్కుండాలి. దీనిపై ఏ విధమగు పన్నుయు విధించరాదు.

ఈ ఒడంబడిక జరిగేటప్పుడు, బ్రిటిషు ప్రతినిధి హరికృష్ణ మెహతాబ్‌లు కాక, సాల్వేషన్ ఆర్మీకి సంబంధించిన "వూడ్స్"గారు, ఒరిస్సా ప్రభుత్వము తరఫున, ఒరిస్సా రివిన్యూ కమీషనరుగారును కూడా గలరు.

ఈ ఒడంబడికపై దస్కత్తు చేయడానికి బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధికి తాల్చేర్ ప్రభువుయొక్క పూర్తి అనుమతి ఉంది. దానినిప్పుడు ప్రభువు ఏవిధముగా కాదనుచున్నాడో అర్థమవుటలేదు.

తాల్చేర్ ప్రభువుకు యివ్వబడ్డ సనద్‌లో ఉన్న వివరాలు చూస్తే మరీ చిత్రంగా ఉంటుంది. "ప్రజలను న్యాయంగా పాలించి, వారి హక్కులన్నీ కాపాడుతూ వైస్రాయిచేత తూర్పు సంస్థానాలకు నియమింపబడిన ప్రతినిధిగాని మరి ఏయితర అధికారిగాని చెప్పినట్లు ప్రవర్తించుకొనవలెను."అని ఉంది.

ఈ షరతు ప్రకారం, బ్రిటిషు పొలిటికల్ ఏజంటు చెప్పినట్లు ప్రవర్తించుకోవడంతప్ప, రాజాకు ఇంకో గత్యంతరం ఏమీలేదు. "ఈ ఒడంబడికను అమలు జరపడంలో ఆలస్యానికి కారణం ఏమి? సుమారు 20 వేల మంది ప్రజల ప్రాణాలు చిక్కుకొనియున్న యీ వ్యవహారములో ఆలస్యం హానికరమేకాదు- మహాపరాధంకూడా" అని గాంధీజీ ఒక వ్యాసాన్ని ప్రకటించాడు.

తరువాత రాజీ ప్రయత్నాలు కొన్ని జరుగగా కొన్ని షరతులను మాత్రమే అమలు జరుపుటకు రాజా అంగీకరించాడు అవి చాలకపోతే రెసిడెంటు నిర్ణయాన్ని పాటిస్తానని అంగీకరించాడు. కాని హరికృష్ణ మెహతాబ్, ప్రజలు సంతృప్తిపడలేదు. వివరం గాంధీజీకి తెలిపారు

జయపూర్

సత్యాగ్రహుల దురవస్థ

జయపూర్ ప్రజామండలి అధ్యక్షుడును, అఖిలభారత కాంగ్రెసు వర్కింగు కమిటీ మెంబరు అయిన జమ్నాలాల్ బజాజ్ గారిని జయపూరు సంస్థాన ప్రభుత్వము ఒక మారుమూల గ్రామంలో ఖయిదు చేసి ఉంచింది, వారికి వారి సాటివారి నెవ్వరినీ సాయము ఇవ్వలేదు. ఆప్రదేశములో ఆరోగ్యకరమగు నీటివసతి లేదు. వీరిని ఒంటరిగానే ఉంచాలని ప్రయత్నిస్తోంది.

ఇక ఇతర సత్యాగ్రహులు ఎక్కువ సదుపాయాలకై నిరసనవ్రతం చేస్తే వారిని లాంబాకోట అనే చోటికి మార్చి ఉంచారు. ఇది వట్టి పాముల పుట్ట. ఈ విషయాన్ని జయపూర్‌ప్రభుత్వమే అంగీకరించింది. దీనిని మరమ్మత్తు చేయిస్తున్నామనీ, ఇంతవరకు ఏ పామూ ఎవరినీ కరువలేదని, బజాజ్‌గారికి సరియైన సౌకర్యాలు ఇస్తున్నామనీ జయపూర్ ప్రభుత్వము తన చర్యను సమర్థించుకోవాలని ప్రకటన చేసింది.

ఈ ప్రకటన కుంటి సమర్థన. జమ్నలాల్‌జీని,ఆరోగ్యకరముగా ఉండి, అన్ని విధాల అందుబాటులో ఉండే ప్రదేశానికి మార్చి, సరియైన సహవాసాన్ని కూర్చాలని గాంధీజీ ప్రభుత్వాన్ని హెచ్చరించాడు. ఇక ఇతర సత్యాగ్రహులను "ఇంతవరకూ ఏ పామూ కరవలేదని సమాధాన మిచ్చుట చాలా హాస్యాస్పదముగా ఉంది. కరిస్తేనేగాని ప్రభుత్వానికి చీమ కుట్టదా?" అన్నాడు గాంధీజీ. "నాఆజ్ఞానుసారమే జయపూర్‌లోనూ మిగతాచోట్లా సత్యాగ్రహాన్ని ఆపినా, ఎల్ల కాలము ఇల్లాగే ఉంటుందనుకోవద్దు మేల్కొన్న ప్రజల సానుభూతిని సంపాదించడానికి సంస్థాన ప్రభుత్వాలు తొందరగా ప్రయత్నించా"లన్నాడు గాంధీజీ. సత్యాగ్రహులను అగౌరవముగా చూడడము ఆపాలని జయపూర్‌ను హెచ్చరించాడు.

తిరువాన్కూరు

తిరువాన్కూరు సంస్థానములో ప్రజాభిప్రాయాన్ని చీలగొట్టడానికిని, ప్రస్తుతం వివిధ మతస్థుల మధ్యనున్న సామరస్యాన్ని భంగముచేద్దామని, సంస్థాన ప్రభుత్వము, ఓటింగు విధానములోను, స్థానాలు ప్రత్యేకించడములోనూ కొన్ని మార్పులు చేసింది. దీనిని స్టేట్ కాంగ్రెసు అధ్యక్షుడగు పట్టంతాను పిళ్లేగారు ఖండించారు. మరికొందరు మితవాద ప్రముఖులు (స్టేట్ కాంగ్రెసులో లేనివారు) వీటిని ప్రశంసించారు. స్టేట్ కాంగ్రెసు వర్కింగు కమిటీ సమావేశమై మహాత్ముని సలహాకై అధ్యక్షుని, వరీఘీస్‌గారిని పంపుటకు తీర్మానించింది. సత్యాగ్రహంలో శిక్షింపబడ్డవారిలో 51 మందికి "సత్యాగ్రహ ఉద్యమం విఫలమైనది గనుక" అని శిక్ష రిమిషన్ ఇచ్చి విడుదలచేసింది ప్రభుత్వం. విచారణలో ఉన్న 14 కేసులు ఎత్తివేసింది. మిగతావి ఆలోచిస్తానన్నది. ఇంతమాత్రన్నే ప్రభుత్వం బాగుపడిందని అనుకోలేమని, పిళ్ళేగారు ప్రకటించారు.

మే 13 వ తేదీని తిరువాన్కూరు నాయకులు గాంధీజీని దర్శించి సంభాషించారు. సంభాషణలు ఇంకా జరుగుతాయి.

ఫార్వర్డ్ బ్లాక్

ఫార్వర్డు బ్లాక్‌ను గురించి కాంగ్రెసు సోషలిస్టు పార్టీవారి అభిప్రాయమేమి అని యునైటెడ్ ప్రెస్ విలేఖరి (పాట్నా) జయప్రకాశనారాయణగారిని అడిగారు. జయప్రకాశనారాయణగారి సమాధానం ఇది.

"ప్రస్తుత పరిస్థితులలో ఈ 'బ్లాక్'ను గురించి ఎక్కువగా చెప్పవలసినదేమిలేదు ఇదివరకు ప్రకటించినట్లు సోషలిస్టు పార్టీ దానిలో కలువరాదని నిశ్చయించింది. కాని ఆ 'బ్లాకు'ను విరోధించదు. మా విధానములతో అంగీకరించినంతవరకు మేము దానితో సహకారం చేస్తాం.

"సుభాసుబాబు ప్రకటనవలన, ఆ బ్లాకుకు, మొత్తం మీద కాంగ్రెసు అవలంబించు విధానాలు తప్ప మరో విధానాలు లేవని తేటతెల్లంగా తెలుస్తుంది. ఉన్న వ్యతిరేకత అల్లా, నేడు సర్వసాధారణంగా 'ఫేషన్' అయిపోయి పిలువబడే "హైకమాండు" (పై నాయకత్వం)కు మాత్రమే." అట్టి వ్యతిరేకత సోషలిస్టుపార్టీ యొక్క విధానం కానేరదు. ఈ నాడు పార్టీ వ్యతిరేకించుచున్నది సామ్రాజ్యవాదమునూ దాని సహాయకులనూ. కాంగ్రెసు విధానాలను ఆచరణలో పెట్టించుటే మన ఉద్దేశ్యమయితే, 'లీగ్'లూ, 'బ్లాకు'లూ ఎన్నుకొన్నవారివలె గాక, సోషలిస్టు పార్టీ కాంగ్రెసువారి నందరినీ (కాంగ్రెసు విధానాలను) ఆచరణలో పెట్టుడని విజ్ఞప్తి గావించుతుంది. కాంగ్రెసు వారిని ముఠాలుగా విభజించడం వివేకయుక్తమయిన పని గాదని సోషలిస్టుపార్టీ తలచుతుంది. సోషలిస్టు పార్టీ ఇలా చెప్పడం సందేహం కల్గించవచ్చు. సోషలిస్టుపార్టీ, సోషలిస్టు కాంగ్రెసువాదులను ఒకటిగా తీసుకురావడంవలన కాంగ్రెసును విభజించలేదు. కాంగ్రెసును మించిన కొన్ని ఆదర్శాలను, సోషలిస్టుపార్టీ కలిగియుంది. అందువలన, వాటిని సాధించడానికి, పార్టీ ఏర్పడింది. కాంగ్రెసుతో, మా ఆశయాలు కలిసివచ్చినంతవరకు కాంగ్రెసులో ఇతర కాంగ్రెసు వాదులతో, కలసి పని చేస్తాం. ఇది "బ్లాకు"లు ఏర్పరచడంవల్ల కాదు. రాజకీయఉత్సాహం (ఇనీషియేటివ్), ఆచరణా వీటివల్ల అవుతుంది."

మద్రాసులో సంయుక్త కార్మికోద్యమం

మద్రాసు రాష్ట్రములోని 40 కార్మికసంఘాల ప్రతినిధులు 10 వ తేదీన కామ్రేడ్ యస్. గురుస్వామి గారి అధ్యక్షతక్రింద మద్రాసులో కాంగ్రెసు హౌసునందు సమావేశమైరి. మద్రాసు ప్రభుత్వమునకు కార్మిక శాసనమును గూర్చి ఒక చిత్తు నివేదికను తయారుచేయుటకు గురుస్వామి, రామమూర్తి, కృష్ణమూర్తి, కళ్యాణసుందరం, రామానుజనాయుడు గార్లను ఒక ఉపసంఘముగా నియమించిరి. 11 వ తేదీ ఉదయమున తిరిగి సమావేశమై ఉపసంఘమువారిచే తయారు చేయబడిన చిత్తు నివేదికను కొద్ది సవరణలతో ఆమోదించిరి. కార్మిక వివాదముల పరిష్కారమునుగూర్చి, నిరుద్యోగ భీమా పద్ధతి, తదితర కార్మిక సమస్యలనుగూర్చి కొన్ని సూచనలు కావించిరి. ఈ నివేదికను మద్రాసు కార్మిక శాఖా మంత్రి గారికి పంపిరి. వీటిని గూర్చి మంత్రిగారితో తిరిగి చర్చలు జరుపుదురు.

ఇప్పటివరకును అన్ని కార్మికసంఘములను కేంద్రీకరింపచేసి పనిచేయు "యునైటెడ్ ట్రేడుయూనియన్ కాంగ్రెసు" ఈ రాజధానిలో యేర్పడలేదు. పైసమావేశమందు యునైటెడ్ ట్రేడు యూనియన్ కాంగ్రెసు యావశ్యకతను గుర్తించి మద్రాసు రాష్ట్ర యునైటెడ్ ట్రేడు యస్ కాంగ్రెసును నెలకొల్పిరి. రైల్వే, పోర్టు, ట్రాన్సుపోర్టు యూనియన్లు టెక్స్టైలు, జ్యూట్ మొదలగు పరిశ్రమల కార్మికసంఘ ప్రతినిధులు పాల్గొనిరి. ఈ సంవత్సరమునకు ఈక్రింది కార్యనిర్వాహక వర్గమును ఎన్నుకొనిరి. అధ్యక్షుడు: కామ్రేడ్ పి. ఆర్. కె. శర్మ యం. యల్. ఎ. ఉపాధ్యక్షులు : కామ్రేడ్స్ పి. వెంకట్రావు

యఱ. జి. రామస్వామి
ముత్తు రామలింగతేవరు
పి. కృష్ణపిళ్లై
సి. శివసుబ్రహ్మణ్యం

ప్రధాన కార్యదర్శి : కామ్రేడ్ పి. రామమూర్తి
కోశాధికారి : కామ్రేడ్ యస్. కుప్పుస్వామి
సభ్యులు : కామ్రేడ్స్ జి. కృష్ణమూర్తి యం. యల్. ఎ.

వి. వి. నరసింహం ..
ఈ. యం. శంకర
నంబూద్రిపాద్ ..
శంకర నారాయణపిళ్లై. ఆది కేశవులు. రెడ్డియారు. ఏ. యస్. కె. అయ్యంగారు. వి. కృష్ణమూర్తి. యన్. లక్ష్మణస్వామిగార్లు.

* * *

ఉత్తర విశాఖపట్టణం జిల్లా బస్సు పనివారలు యేప్రియల్ 30 వ తేదీన చికాగోలులో సమావేశమై ఒక సంఘముగా యేర్పడిరి. శ్రీ కె. సుబ్బారావు యం. యల్. ఎ. జి. వి. రామమూర్తిగార్లు అధ్యక్ష కార్యదర్శులుగా యెన్నుకొనబడిరి.

నవశక్తి

పార్టీ సభ్యులు ముఖ్యంగా గమనించాలి

	మే నెల కోటా	రెండు వారాలలో చేర్పించినది.
విశాఖపట్టణం	10	0
తూ. గోదావరి	30	2
ప. గోదావరి	30	5
కృష్ణా జిల్లా	50	12
గుంటూరు	30	4
నెల్లూరు	25	8
రాయలసీమ	10	1
చిత్తూరు	5	0
కర్నూలు	5	2
ఇతర స్థలాలు	15	2
	200	31

* * *

ఈ నెలలో 31 చందార్లనే చేర్పించారు. పార్టీసభ్యులు తమ విధిని నిర్వర్తించడం లేదు. పత్రిక పరిస్థితులందరు సభ్యులు ఎరిగినదే. పార్టీసభ్యులు తమ విధిని నిర్వర్తిస్తేనే, పత్రికను మరింత అభివృద్ధి చేయగలం. ఇది గమనించ కోరతాం. — సంపాదక వర్గం.

రామగోపాల్ పిక్చర్సు వారి

పాశుపతాస్త్రము



త్వరలో వచ్చుచున్నది!

విడుదల తేదీకై ఎదురు చూడుడు!!

★

స్టూడియో :

ఆంధ్రసినీటోను

సాంకేతిక ప్రవీణులు :

ఛాయాగ్రహణం :

దేవ్జీ

శబ్దగ్రహణం :

ముఖర్జీ

★

కవి :

కాశీ వాసు

సంగీతము :

గోపాల్ సింగ్

★

డిస్ట్రిబ్యూటర్సు:—

సరస్వతీ టాకీస్

లిమిటెడ్, బెజవాడ.

★

గ్రామఫోను ప్రపంచమందలి మధుర గానము 'పాశుపతాస్త్రము' రికార్డులు:—

సన్ రికార్డు

కంపెనీ వారివి.

Published by M. Chandrasekhara Rao)

END OF ISSUE